
/////// హరి జ్ఞానమే అన్నమయ్య గానము ///////



**హరి జ్ఞానమే అన్నమయ్య గానము**

**మొదటి ప్రచురణ**

**మే 2016**

**రచన**

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

**వెల : అమూల్యం**

**ప్రతులకు :**

**ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్దార్థ నగర్,**

**హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360**

**అక్షరాల కూర్పు మరియు ముద్రణ :**

**సత్యనారాయణ వరప్రసాద్ రావు పసుపులేటి**

**ఫోన్ : +91-94939 79719**



# అంకితము



ఆ సర్వేశ్వరునకు లోకేశ్వరునకు.... యెందుకంటే

ఉ॥ **లోకములన్ సృజించితివి లోకములేలెడి పాలకుండవై**
**లోకపు రక్షజేసితివి లోపములేని తెరంగునన్ ప్రభూ!**
**లోకములన్ని మ్రింగెదవు లుప్తముజేతువు లిప్తపాటులో**
**లోకపతీ! యిదంకితము లోగొనునన్నిక లోకనాయకా!**

తా॥ ఓ లోకపతీ! ఈ లోకములన్నింటిని పుట్టించితివి. లోకముల పాలకుడవై పరిపాలిస్తున్నావు. తగిన సమయమున జంకు గొంకులేక వున్నట్లుగా మ్రింగేస్తావు. నీకు కనురెప్పపాటు ఆలస్యం కూడా వుండదు. అందుకే ఓ లోకనాయకా! దీనినంకితముగైకొని నన్నులోగొను (రక్షించు... నీలో కలుపుకో). దయ చూపించు తండ్రీ!

# ప్రార్థన

కం॥ శ్రీహరి జ్ఞానము బొందితి
ఆహా! నా భాగ్యమేమి, "అన్నమ" దయచే
దేహంబనిత్యమైనను
ఆ "హరిగానంబు" నిత్యమౌనని తెలిసెన్.

ఆ.వె॥ హరిని దెలుపనట్టి ఆ జ్ఞానమజ్ఞాన-
మరయ "కూర" లేని "అన్న"మయ్య,
అన్నమయ్య పాట హరిని నేర్చెడి "బాట"
దీని జెప్పుచుంటి "దాని కొఱకె.

సీ॥ హరిని కీర్తించని ఆ నోరుదేనికి?
కుక్కిన చెత్తను మెక్కు కొఱకె?
హరిని గానగలేని ఆ కన్నులేటికి?
చూడకూడని చెడు జూచు కొఱకె?
హరి కీర్తన వినని ఆ చెవ్వులేటికి?
వినరాని శుంఠల వినుట కొఱకె?
హరిని భజించని ఆ దేహమేటికి?
అగ్గిలో బుగ్గియై మగ్గ కొఱకె?

తే.గీ॥ హరిని దెలియని జ్ఞానము వ్యర్థమయ్య!
హరిని జెప్పని గురుడేటి గరుడతండు?
హరిని నమ్మని మనుజుడే నిరుపయోగి,
హరిని గొలువని జన్మేల అయ్యలార?

కం॥ హరి నెఱిగితినే చివరకు,
కరివరదుడు మకరి నరికి కరిగాచె కదా!
సరివేరి హరికి నరయగ
హరి హరియని జరుపరారె హరిగానమునే.



చం॥ ఇది "తుది యత్నమౌ"ననుచు యెంతటి భ్రాంతుల నుంచి నావురా!
వదలక చావుకాశపడు వాని నివన్నియు జెప్ప మంటివే!!
కుదురగ, నాకసాధ్యమని కూర్పగ "మోక్షము" నెంచి నావొకో!!
విదితము కాదు నీమహిమ వేంకటనాథుడ! నీకు మ్రొక్కెదన్.

శా॥ తీరన్జాలదు దాహమెన్నటికి శ్రీదేవీ విభున్పాడినన్
మారన్జాలదు నమ్మకంబెపుడు యేమాత్రంబు నాకెన్నడున్
కోరన్జాలను మోక్షమెన్నటికి నాకోపంబు శాంతించకన్
రారా! జ్ఞానము నిమ్ము వేంకటపతీ! రవ్వంత మున్ముందుగా.

మ॥ వెలుగున్ జాడని గబ్బిలంపు బ్రతుకైవేసారి జీవించితిన్
కలిగెన్ జ్ఞానము కళ్ళు విచ్చినవి, వోకారుణ్యసింధో! హరీ!
తొలుతన్ జీవితమందు భ్రాంతి తొలగెన్ దోషంబులున్ తగ్గెరా
మలుపున్ ద్రిప్పితివయ్య వేంకటపతీ! మార్పంత నీభిక్షయే.

తే.గీ॥ మోక్షసాధనమునకును ముందు అడుగు
జ్ఞానమెఱుగుట, హరిభక్తి జతగనుంట,
గానలోలుడు శ్రీవేంకటనగవిభుడు
అన్నమయ్యకు జేజేలు అందుకొఱకె.

ఉ॥ బాధలు లేనివాడెవడు? బంధమె బాధకు కారణంబగున్
సాధుజనావనా! వరద! జ్ఞానములేని ధనంబులేటికిన్?
బాధలు సౌఖ్యమౌ హరిని పాడినుతించిన, అందుచేతనే
మాధవ! వేడెదన్ శరణు మమ్ముల గావుము వేంకటేశ్వరా!

# ముందుమాట

ఇది నా అభిప్రాయం. మానవుడు జీవించడానికి ఆహారం యెలా అవసరమో వాడు "పునరపి జననం పునరపి మరణం" నుంచి తప్పించుకోవాలి అంటే వాడు భగవంతుని శరణాగతి పొందక తప్పదు గాక తప్పదు. అసలు జన్మ పునర్జన్మలని నమ్మను అనే వారిని గురించి చెప్పేందుకేమీ లేదు. అయ్యా! మీ కొక నమస్కారం అనుటయే ఉత్తమం.

మళ్ళీ జన్మం వున్నదని నమ్మేవారు ఇలా ఆలోచించాలి. అసలు జన్మకి కారణం "కోరిక" అది మంచిదీ కావచ్చు చెడ్డదీ కావచ్చు. మరి అది మనిషి చేతిలో వున్నదా అంటే అది సరికాదు. గత జన్మలలో జీవి పాపపుణ్యాలను బట్టి, వాడి కట్టి కోరికలు కలుగుతాయి. ఆ కోరికపై మోహం కలుగుతుంది. మోహము, కామము (కోరిక) పెనవేసికొనిపోయి అది తీరకపోతే క్రోధంగా మారుతుంది. ఎలాగైనా సరే! ఆ కోరిక తీరాలనే లోభం పుట్టుకొస్తుంది. ఒక వేళ కోరిక తీరితే నేనే గొప్పవాడిననే మదము పుట్టుకొస్తుంది. అలాంటి కోరిక సాధించిన మరొకరిపై అసూయ కలిగి అదే మాత్సర్యంగా పరిణమిస్తుంది. దీనికి చక్కని ఉదాహరణ మహాభారతంలోని దుర్యోధనుడు. అటువంటి వాడివల్ల కులక్షయమైతీరుతుంది. భీష్మునివంటి మహామహులైన అటువంటివారి నీడలో నశిస్తారు.

అయితే కోరికని నిగ్రహించటం అంత సులువైన పనికాదు. ఒక కోరిక తీరితే ఇంకొక కోరిక పుట్టుకొస్తూనే వుంటుంది. దీనికి అంతూపొంతూ వుండదు. మరి కోరిక యెలా పోతుంది? వైరాగ్యం వల్ల పోతుంది. వైరాగ్యం (విరక్తి) రావటం అంత సులభంకాదు.

దానికి మొట్టమొదటి ఆవశ్యకత సచ్చింతన. అది భక్తివలన తేలికగా వస్తుంది. భక్తిలేకపోయినా సత్ప్రవర్తనవున్నా అది సాధ్యమే. విరక్తి వలననే మోక్షం దక్కుతుంది. అది (విరక్తి) జ్ఞానము వల్ల వస్తుంది. ఈ జ్ఞానము పూర్వజన్మల సుకృతం వలన మాత్రమే సాధ్యము.



ఈ జ్ఞానములేనివాడు అజ్ఞాని అని అందరికీ తెలిసినదే, కాని తెలియనిదేమంటే జ్ఞానం రెండురకాలు. ఒకటి ప్రాపంచిక జ్ఞానం, రెండవది భగవంతుని గురించిన జ్ఞానం. మొదటి జ్ఞానంవల్ల మేధాసంపన్నుడై ధనము నార్జించి గొప్పవాడనిపించు కొంటాడు. అయితే దీనికి పరిమితులు లేవు కాబట్టి వెయ్యిరూపాయలు లక్ష కావాలనంటుంది. లక్ష, కోటి కావాలంటుంది. ఈ ధన సంపాదన యెన్నటికీ తరగదు. పైగా నానాటికి పెరిగి భస్మాసుర హస్తంలాగా చివరికి వీడినే నశింపచేస్తుంది. ధనంతో వీడు మంచి పనులు, చెడ్డపనులు – రెండూ చేయడం చేత అవి పాపపుణ్యాలై జన్మలకు కారణమవుతున్నాయి. మళ్ళీ కథ మొదటికే వచ్చింది.

ఇదండీ జీవుని జీవయాత్రంతా. దీనికి అంతులేదా అంటే ఉన్నది. అన్నమయ్య జీవితమే పైన చెప్పిన కథకు చక్కని ఉదాహరణ. ఆయన గత జన్మలో శ్రీహరి ఖడ్గము (నందకం) స్వతహాగా తనకే కోరికలేకపోయినా భగవంతుని నిర్దేశప్రకారం పామరులలో భక్తిని రేకెత్తించి వారిని జ్ఞానమార్గంలో పెట్టాలని భూమిపై అవతరించాడు. తొలినాళ్ళలో ఆయన కూడా అరిషడ్వర్గాలకు లోనైనాడు.

తన కీర్తనలననుకరించిన వారిని తన కీర్తనలలోనే నిందించాడు. తాను "నందకం" కాబట్టి శ్రీహరి శృంగారలీలలను వర్ణించి కీర్తించి 32000 కీర్తనలు చెప్పాడు. భార్యలను మృత్యువు కంబళించినా భక్తిని విడువలేదు. అది వైరాగ్యమై కీర్తనలుగా జాలువారాయి. చిట్టచివరికి తొంబదియైదవ యేట శ్రీవేంకటేశ్వరుని కాళ్ళావేళ్ళాబడిముక్తిని సాధించి దేవదేవుని "ఒరలో" స్థానం సంపాదించాడు.

ఆయన జ్ఞానులందరికీ వేగుచుక్క. దిగ్దర్శకుడు. ఆయన బాటలో పోతేనే ముక్తి. ఇది మనస్సులో నాటుకొంటేగాని ఈ నా పుస్తకానికి ఈ పేరు నేనెందుకు యెన్నుకొన్నానో అర్థంకాదు. జ్ఞానం మోక్షానికి అర్హతనిస్తుంది. జ్ఞానమే ఇహపర సాధనమని అన్నమయ్య అనేకమార్లు నొక్కివక్కాణించారు. పరమాత్ముని సంతృప్తుని చేయటానికి అన్నమయ్య యెన్నుకొన్న మార్గం గానం. గానము శిశువులను, పశు వులను పన్నగములను సైతము మైమరపించుననునది జగమెరిగిన సత్యమే. కానీ అది జగన్నాథుని సైతము మైమరపిస్తుందని అన్నమాచార్యులవారు చాటి చెప్పారు.

గత జన్మలో గాయకుడైన వారికి మరుజన్మలో గానం అంటే ప్రాణంగా వుంటుంది. కొందరు గాయకులైతే, కొందరు గానప్రియులుంటారు. అది వారి వారి భాగ్యమంటారు అన్నమయ్య. శ్రమలకోర్చి సంగీత విభావరి సందర్శించే వారు పనిలేని వారనుకొంటే మీ అంత పనికిమాలిన వాడులేడని అర్థం. లోకోభిన్నరుచిః అన్నదీ నిజమే. ఒకరికి లలిత సంగీతం ఇష్టమైతే, వేరొకరికి పరదేశ సంగీతం నచ్చవచ్చును. కానీ సంగీతాన్ని ద్వేషించేవారు మాత్రం అల్పసంఖ్యాకులే.

ఇకపోతే సంగీతాన్ని రాగ తాళ నిబద్ధతను కొందరు ఆస్వాదిస్తే కొందరికి ఆ పాటు భావము తెలుసుకొంటే కాని తృప్తివుండదు. మీరే గమనించండి యెంతో మంది తెలుగు తెలియని గాయకులు పాడే "టెలుగూ సాంగ్" కీ, భావము నాకళింపు చేసికొని పాడే తెలుగు గాయకులకు హస్తిమశకాంతరం తేడావుంటుంది.

చాలామంది అన్నమయ్య సంగీత విద్వాంసులు కీర్తన నర్థం చేసికొననిదే పాడరు. ఆ విద్వాంసులు వలనే నేటి తరం గాయకులు కూడా అన్నమయ్య పాట వివరణ తెలిసికోవాలని భావించి నాబోటి కొందరు అన్నమయ్య కీర్తనా విశ్లేషణకు నడుముకట్టారు. ఆ మహానుభావుని ఋణం ఈ విధముగా తీర్చుకొనే భాగ్యం మాకు దక్కింది.

గతంలో నేను చాలాసార్లు వుటంకించినట్లు అన్నమయ్య మనలాగా తనలో తాను తర్కించుకొంటూ తప్పులు దిద్దుకుంటూ కీర్తనలు చెప్పలేదు. శ్రీవేంకటేశ్వరుడు ఆయన నోటితో వాటిని పలికించాడు. ఇది యెందుకు నిర్భయంగా చెప్పగలుగు తున్నానంటే అది నా స్వానుభవం. నేను కవినిగాను, భాషాకోవిదుడను కాను. పోనీ నా పెద్దలు గాని దగ్గరి చుట్టాలు కాని కవులు కాదు. శ్రీవేంకటేశ్వరుడే నా మేధస్సులో దూరి, నా స్నేహితులచే తగు సూచనలిప్పించి ఇవన్నీ చేయిస్తున్నాడు. నిజానికి నాకు "కథ" కధ కాదని, "ప్రార్థన" ప్రార్ధన కాదని తెలియదు. "థ" యెక్కడ వాడాలో తెలియదు. మీరు చదువుతున్నదంతా "నేను" స్వయంగా నా పుట్టుచేతితో వ్రాసిందే. సహజ సిద్ధమైన నా కుడిచేయి పక్షవాతం వలన నాకు నిరుపయోగం. కాని దానికి ఒక గొప్ప ఉపయోగం పెట్టాడు ఆ ఏడుకొండల దొర. నేను ఆయనకు



నమస్కరించగలుగుతున్నది దాని వలననే కదా! ఎంతోమంది పాఠక మిత్రుల అనురాగానికి పాత్రుని చేసింది ఆ స్వామి కాక మరెవ్వరు?

ఇదంతా యెందుకు చెబుతున్నానంటే శ్రీవేంకటేశ్వరుడు పలికించాడు కాబట్టే అన్నమయ్య సాక్షాత్తు అలమేలు మంగమ్మను "ఏమే" అనగలిగాడు. స్వామిని "లంజకాడవవుదువురా?" అనగలిగాడు కొత్తపెళ్లి కూతురు అలమేలు మంగ "కొంతపెడ మరలి నవ్విందని" చెప్పగలిగాడు. ఉగ్రనరసింహుని శృంగారప్రియ నరహరిగా చెంచులక్ష్మిపై "తమకం" వున్న "సరసునిగా" వర్ణించగలిగాడు. శ్రీరామచంద్రుని విరహాన్ని, సీతమ్మ ఆవేదనను, ఆంజనేయుని ఓదార్పును చిత్రీకరించగలిగాడు. శ్రీకృష్ణుని దొంగ పనులను, రాసలీలను, వసంతోత్సవాన్ని వర్ణించగలిగాడు.

భాషలో ఆయన పొరబాట్లు చేసే ఆస్కారమే లేదు. కీర్తనలలో మనబోటి అల్పులు గమనిస్తున్న "పొరబాట్లు" ఆచార్యులవారివి కావు. అవి తాటియాకులపై వ్రాసిన శిష్యుల పొరబాట్లు. వాటిని చూచి రాగిరేకులపై చెక్కిన వ్రాతపనివారివి. వాటిని చిలుము పట్టించిన "ఉన్మాదులవి".

తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి కృషి వలన, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారి వంటి యెందరో మహానుభావుల పరిశ్రమ వలన, అసంఖ్యాకులైన మధురగాయకుల వలన, అసమానులైన భాషాకోవిదుల వలన, అవిరామ కృషి చేసిన రచయితల వలన– నేడు మనబోటి వారికి ఈ పదకవితా పితామహుని ప్రసాదం దక్కింది.

ఇక ప్రస్తుతానికి వద్దాం. గత ఏడు సంవత్సరాలుగా నన్ను నా మనస్సును గట్టిగా పట్టి వదలని కోరికలు యెన్నోవున్నాయి. నేను చెబుతున్న కోరికలు సుఖాపేక్షకు సంబంధములేని కోరికలు. ఉదాహరణకి అందరూ అను నిత్యం పాడుకొనే కీర్తనలు వివరించాను, శృంగార వైరాగ్య, జానపద కీర్తనలు వివరించాను. అతి పొడవైన కీర్తనలను, శృంగార రసప్రధానమైన కీర్తనలను వివరించాను. అన్నమయ్య కీర్తనలతో

పిల్లలకు "అ, ఆ, ఇ, ఈ... ల" వర్ణక్రమం నేర్పాను. అన్నమయ్య కీర్తనలను "పద్యాలు"గా తర్జుమాచేశాను. ఏమి చేసినా యెంత చేసినా "ఇంకాయేదో" చేయాలని అనిపిస్తుంటుంది.

ప్రస్తుతం నా ఆలోచన, అన్నమయ్య కీర్తన వింటూ-చదువుకోగలగటమే కాక, విశ్లేషణ కూడా చదివి అర్థం చేసికొనే విధంగా పుస్తకమూ, CD రెండూ రూపొందించి రెండూ అంటే ఆధ్యాత్మిక మరియూ శృంగార కీర్తనలు పాఠక శ్రోతల కందించాలని.

అయితే దీంట్లో మూడు చిక్కులున్నాయి. మొదటిది ఆకీర్తన నేను గతంలో విశ్లేషించి వుండకూడదు. రెండవది ఆ కీర్తన మంచి గాయకుల చేత పాడించి రికార్డు చేయించబడి వుండాలి. మూడవది అతిముఖ్యమైనది ఆ కీర్తన నాబోటి సామాన్యునికి అసాధ్యమైనంత కఠిన భాషలో వుండకూడదు.

నిజానికి ఇది ఒక యజ్ఞం. "మడి" మీదయేమాత్రం నమ్మకంలేని నేను భగవంతుని తప్ప సామూహిక భజనలపై యేమాత్రం నమ్మకం లేని నేను, మంచి చూడు-మంచి విను-మంచి మాట్లాడు అనే వ్రతం ఆచరించని వారు యెన్ని సత్యనారాయణ వ్రతాలు చేసినా లాభం లేదని నమ్మే నేను, అసూయ, అహంకారం వున్న ఆడది యెన్ని నోములూ నోచినా అణుమాత్రం ఉపయేగం లేదని నమ్మే నేను ధైర్యంగా చెప్పే మాట ఒక్కటే సత్యము, ధర్మము, వినయము, విశ్వాసము లేని వాడు యెన్నటికీ "ముక్తిని" పొందలేడు.

వాడికి జన్మల చక్రభ్రమణం తప్పదు. ఇహపర సాధనలు అంటే మరేమిటో అనుకోకండి పై నాలుగింట్లో మొదటి మూడు ఇహలోకంలో సుఖాన్నిస్తాయి. నాలుగవది పరలోకంలో సుఖం ఇస్తుంది. నిరంతరం వీటి సాధనమనయే ఐహిక బంధ విముక్తులను చేస్తుంది. అదే ముక్తి అనే మోక్షం. మోక్షం Ph.D అనుకొంటే మిగతావన్ని స్కూలు, కాలేజి, యూనివర్శిటీ చదువులన్నమాట.

కాకపోతే నేటి నవీన యుగపు "కళాప్రపూర్ణ" డాక్టరేట్ కాదు మోక్షం. కోట్ల



జన్మల తరువాత పుణ్యం కొద్ది మానవ జన్మలభిస్తుంది. కోట్లాది మానవులలో వొక్కడికే భగవంతుని శరణాగతి లభిస్తుంది. అటువంటి కోట్లాది శరణాగతులలో వొకరిద్దరికే మోక్షం లభిస్తుంది.

ఇదంతా విన్నాక నామటుకు నాకు L.K.G విద్యార్థిననిపిస్తున్నది. వీడికి Ph.D., ఎప్పుడొస్తుంది? శ్రీమన్నారాయణునికి తప్ప మరెవ్వరికీ తెలియదు. అయితే శ్రీహరి కృపవలన L.K.G లో చేరాను. ఆపైన అంతా "తిరుమలయ్య దీవెన" నేను నిమిత్తమాత్రుడను మాత్రమే.

నావంటి అవిటి వానిచేత 2750 అన్నమయ్య కీర్తనలకు వివరణ "పుష్టిచేత్తో" వ్రాయించి సాక్షాత్తు T.T.D. అన్నమాచార్య ప్రాజెక్టు వారికోసం D.T.P. చేయించి, వారికి సమర్పిచగలిగానంటే.. "ఇది గాక సౌభాగ్యమిదిగాక తపము మఱి, యిదిగాక వైభవం బికనొకటి కలదే?"

మనిషి పుట్టుక అవటం చేత నేనూ ఆశాబద్ధుడనే. 3000 కీర్తనలను విశ్లేషించాలని ఇంకొక "క్రొత్త ఆశ" పుట్టించాడు ఆ "కొండలరావు" గారు నేను యెప్పటిలాగే ఆయన ఆజ్ఞాబద్ధుడను. అలాగే నిమిత్తమాత్రుడను. నన్ను ప్రోత్సహించి ఆదరించిన తిరుమల తిరుపతి దేవస్థానముల వారికి సదా కృతజ్ఞుడను.

Please visit my Website in Google Network
"www.geetadeeksha.com"

అంతేకాదు "kinige.com" వారి "E-Books" లో నావి "10 పుస్తకాలు (2400 అన్నమయ్య కీర్తనల విశ్లేషణ" మిమ్మల్ని అలరిస్తాయి.

"లోకాస్సమస్తా స్సుఖినోభవంతు"







# హరి జ్ఞానమే అన్నమయ్య గానము

## ఎన్నుకొన్న అన్నమయ్య సంకీర్తనలకు భావదీపిక

## విషయ సూచిక


| క్రమ సంఖ్య | కీర్తన విషయము | సంపుటము/ సంఖ్య | పేజీ |
|---|---|---|---|
| 1. | అందరిలోనా నెక్కుడు హనుమంతుడు | 2/207 | |
| 2. | అచ్యుత మిమ్ముఁదలచేయంత పనివలెనా | 3/23 | |
| 3. | అట్టివేళ గలగనీ దదివో వివేకము | 1/489 | |
| 4. | అతని  మూలమే జగమంతా నిది | 2/362 | |
| 5. | అతనిబోపొగడేము ఆతని శరణంటిమి | 2/499 | |
| 6. | అతి సులభం బిది యందరి పాలికి | 2/10 | |
| 7. | అదివో చూడరో అందరు మొక్కరో | 2/498 | |
| 8. | అని రావణు తలలట్టలు బొందించె | 3/31 | |
| 9. | అన్నిటా నాపారిటికి హరియతడే కలడు | 3/10 | |
| 10. | అన్నిటా నేరుపరి హనుమంతుడు | 3/138 | |
| 11. | అన్నిటికి హరియంతర్యామి మూలము | 2/442 | |
| 12. | అన్నియు నీతని మూలమాతడే మాపాలజిక్కె | 3/35 | |
| 13. | అన్నియును నతని కృత్యములే | 1/20 | |
| 14. | అపరాధిని నేనైనాను | 2/326 | |
| 15. | అభయ మభయమో హరి నీకు | 1/383 | |
| 16. | ఆదిమపూరుషు దచ్యుతు దచలుడనంతుడు | 1/80 | |
| 17. | ఆదిమునుల సిద్ధాంజనము | 1/261 | |
| 18. | ఆపద్బంధుడు హరి మాకు గలడు | 1/438 | |
| 19. | ఆర్తుడ నేను నీకడ్డమెందును లేడు | 2/382 | |
| 20. | ఇందరి బ్రదుకులును యీశ్వరుని చేతిదే | 2/193 | |
| 21. | ఇందిరా నాయక యిదివో మా పాటు | 1/379 | |





| | | | |
|---|---|---|---|
| 22. | ఇందిరాపతిమాయలు యింతులు సుండీ! | 1/494 | |
| 23. | ఇందుకే పో వెరవయ్యానేమందును | 2/31 | |
| 24. | ఇదియే బుద్ధి నాకు ఇంతకంటె మతిలేదు | 2/171 | |
| 25. | ఇన్ని జన్మములేటికి హరిదాసు | 1/367 | |
| 26. | ఇహమును పరమును యిందే వున్నవి | 1/492 | |
| 27. | ఎంత చేసిన తనకేది తుది | 1/98 | |
| 28. | ఎండలు రేయెండలుగా నిరువంక జూచువాడు | 5/216 | |
| 29. | ఎంతటివారలు నెవ్వరును హరి | 1/32 | |
| 30. | ఎంత విభవము గలిగెనంతయును నాపదని | 1/181 | |
| 31. | ఎక్కువ కులజుడైన హీనకులజుడైనా | 1/138 | |
| 32. | ఎదుట నెవ్వరు లేరు యింతా విష్ణుమయమే | 1/502 | |
| 33. | ఎవ్వడోగాని యెరగరాదు కడు- | 1/74 | |
| 34. | ఎవ్వారు లేరు హితవు చెప్పగవట్టి- | 1/15 | |
| 35. | ఏటి విజ్ఞానమేటి చదువు | 1/77 | |
| 36. | ఏది చూచిన తనకు నిన్నియును నిటువలెనె | 1/95 | |
| 37. | ఏది వలసె నీవది సేయు యిందులోన జీవుడా | 2/128 | |
| 38. | ఏమిసేయుదు నింక నిందిరాధీశ్వరుడ | 2/11 | |
| 39. | ఏ రీతి నెవ్వరు నిన్ను నెట్టుభావించినాను | 2/173 | |
| 40. | ఏవం దర్శయసి హితమతిరివ | 5/167 | |
| 41. | ఐనట్టయ్యీ గాక హరి కల్పితములివి | 2/247 | |
| 42. | కనినవాడా గాను కాననివాడా గాను | 1/496 | |
| 43. | చాల నొవ్వి సేయునట్టి జన్మమేమి మరణమేమి | 1/247 | |
| 44. | చీ చీ వివేకమా చిత్తపు వికారమా | 2/13 | |
| 45. | చీచీ వో జీవుడా చింతించుకో జీవుడా | 2/115 | |
| 46. | చూడ జాడ మాణిక్యాలు చుక్కలు వలెనున్నవి | 1/133 | |
| 47. | చూడ వేడుకలు సొరిది నీమాయలు | 3/29 | |
| 48. | చూడుడిందరికి సులభుడు హరి | 1/117 | |

49. చెల్లబోయీ జీవులిలజేసిన పాపమెంతో 2/23
50. జనులు నమరులును జయ లిడగా 1/320
51. జలజనాభహరి జయజయ 1/396
52. తనకేడ చదువులు తనకేడ శాస్త్రాలు 1/197
53. తలగరో లోకులు తలవకురోమమ్మ 2/144
54. తలచిన విన్నియుదన కొరకే వెలి 1/70
55. తానే కాకెవ్వరు మాకు దాతయు దైవంబు 1/193
56. తానే తెలియవలె తలచి దేహి తన్ను 1/128
57. తెలిసిన దెలియుడు తెలియని వారలు 1/317
58. తెలిసిన బ్రహ్మోపదేశము 1/495
59. తోరణములే దోవెల్లా 1/119
60. దినము ద్వాదశి నేడు తీర్థదివసము నీకు 2/151
61. దురితదేహులే తొల్లియను శ్రీ- 1/21
62. దేవ నీదయయెంతనో దివ్యసులభమెంతునో 2/38
63. దేవా యీ తగవు దీర్చవయ్యా 1/435
64. దైవమా నీమాయ తలమొలెఅగనీదు 2/4
65. దైవమా నీ వెలితేది తమవెలితేకాని 1/284
66. ధ్రువవరదా సంస్తుతవరదా 2/73
67. నీ కథామృతము నా నిరతసేవన 1/54
68. నీవే కానింక నేనన్యమెఱగయే- 1/17
69. నెరవాది సాహసులు నిత్యశూరులు 1/490
70. నేరిచి బ్రదికే వారు నీ దాసులు 1/493
71. పడతులాల సోబాన పాడరమ్మా 28/489
72. పరమాత్ముడు సర్వపరిపూర్ణుడు 2/232
73. పరమాత్ముని నోరబాడుచును యిరు 1/130
74. పరాకుసేయకురమ్మ పడతులాల 20/526
75. బలువుడు హరిజే పట్టితిని 2/77



76. బాపు బాపు రాఘవ నీ ప్రతాపమేమని చెప్ప 3/133
77. బోగము నేను నీకు భోగివి నీవు 2/274
78. భారకుడతడే బంధువుడతడే 4/354
79. భోగిశయనమును బుస కొట్టెడిని 1/139
80. మనసిజ గురుడితడో మరియు గలడో వేద 1/37
81. మరలి మరలి జయమంగళము 1/443
82. మరిగి వీరిపోమాదైవంబులు 1/402
83. మఱియు మఱియు నివె మాపనులు 1/446
84. మామను నేతు మాగత వానసి 5/252
85. ముంచిన వేడుకతోడ మొక్కుటగాక 1/467
86. మోహము విడచుటే మోక్షమది 1/263
87. యోగి భోగినటనం కురువుల్లా సానన మోహన 11/588
88. విశ్వరూప మిదివో విష్ణురూప మిదివో 3/403
89. వెరపులు నొరపులు వృథా వృథా 1/217
90. వేటగాడ నంటా నా వెంటబాయేవు 5/217
91. శరణన్న విభీషణు గరుణ గాచినవాడు 2/228
92. శ్రీపతి నీయాజ్ఞ సేసెదమిదివో 2/147
93. శ్రీపతి నీవు సిద్ధించుటే సిద్ధులన్నియు 2/258
94. సందడి విడుము సాసముఖ 1/12
95. సరసుడవవుదువు జాణవవుదువు 28/488
96. సిరిదొలంకెడి పగలు చీకటియితడేమి 1/228
97. సులభమా మనుజులకు హరిభక్తి 1/144
98. సులభుడైవున్నాడు సుగ్రీవనారసింహుడు 4/512
99. సొరిది సంసారంబు సుఖమాయిందరికి 1/248
100. హరి నీదాసుల భాగ్యమిది యెంతని చెప్పేము 2/309
101. హరి హరి నీమహిమలనంతములు 2/358

**సంఖ్య : 207 సంపుటము : 2 పుట : రాగం : నాట**

పల్లవి: అందరిలోనా నెక్కుడు హనుమంతుఁడు
కందువ మతంగగిరి కాడి హనుమంతుఁడు

చ. 1: కనకకుండలాలతో కౌపీనముతోడ
జనియించినాఁడు యీ హనుమంతుఁడు
ఘన ప్రతాపముతోడ కఠినహస్తాలతోడ
పెనుతోఁక యెత్తినాఁడు పెద్ద హనుమంతుఁడు

చ. 2: తివిరి జలధి దాఁటి దీపించి లంకయెల్లా
అవల యివల సేసె హనుమంతుఁడు
వివరించి సీతకు విశ్వరూపము చూపుతా
ధ్రువమండలము మోచె దొడ్డ హనుమంతుఁడు

చ. 3: తిరమైన మహిమతో దివ్యతేజముతోడ
అరసి దాసులఁ గాచీ హనుమంతుఁడు
పరగ శ్రీవేంకటేశు బంటై సేవింపుచు
వరములిచ్చీఁ బొడవాటి హనుమంతుఁడు

**అవతారిక :**

మతంగగిరిపై వెలసిన హనుమంతునిపై చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. అనేక కీర్తనలు ఆంజనేయునిపై వినిపించినా దేని మాధుర్యం దానిదే. ఈ పొడవాటి హనుమంతుడు శ్రీవేంకటేశ్వరుని బంటై తన భక్తులకు కోరిన వరాలన్నీ ఇస్తున్నాడు అంటున్నారు.

**భావదీపిక :**

ఈ హనుమంతుడు, అందరిలోనానెక్కుడు (అందరి కంటే ఘనుడు). కందువ (సమర్థుడై) మతంగగిరిపై వెలసినాడు.

ఈ స్వామి బంగారపు కుండలాలతోను, కౌపీనము (బిగుతైన లోచెడ్డీ) తోను జన్మించినాడట. ఈ పెద్ద హనుమంతుడు గొప్ప ప్రతాపముతోను, కఠినమైన హస్తములతోను, యెత్తిపెట్టిన పెద్ద తోకతోను వున్నాడు.

ఈ హనుమంతుడు గొప్ప ప్రయత్నంతో సముద్రాన్ని దాటి, ధైర్యంతో లంకానగరాన్ని అవల ఇవలసేసె(ఛిన్నాభిన్నం చేసేశాడు). ఈ దొడ్డ హనుమంతుడు సీతకు రాముని జాడ వివరించి, ఆమె సందేహనివృత్తికి ధ్రువమండలాన్ని తాకే తన విశ్వరూపాన్ని చూపించాడు.

ఈ హనుమంతుడు స్థిరమైన మహిమతో, దివ్యమైన తేజస్సుతో తన దాసులను కనికరించి కాపాడుతున్నాడు. అతిశయించిన శ్రీవేంకటేశుని బంటై ఆయనను సేవిస్తూ, ఈ పొడవాటి (ఎత్తైన హనుమంతుడు) అనేక వరములిచ్చుచున్నాడు.



**సంఖ్య : 23 సంపుటము : 3 పుట : రాగం : శంకరాభరణం**

పల్లవి: అచ్చుత మిమ్ముఁ దలఁచే యంతపని వలెనా
యిచ్చుల మీవారే మాకు నిహపరా లియ్యఁగా

చ. 1: మిమ్ము నెఱిఁగిన యట్టి మీ దాసుల నెఱిఁగే
సమ్మతివిజ్ఞానమే చాలదా నాకు
వుమ్మడి మీ సేవ సేసుకుండేటి వైష్ణవుల
సమ్ముఖాన సేవించుటే చాలదా నాకు

చ. 2: నిరతి నీకు మొక్కే నీడింగరీలకు
సరవితో మొక్కుటే చాలదా నాకు
పరగ నిన్నుబూజించే ప్రపన్నులఁ బూజించే
సరిలేని భాగ్యము చాలదా నాకు

చ. 3: అంది నీకు భక్తులైన యల మహానుభావుల
చందపువారిపై భక్తి చాలదా నాకు
కందువ శ్రీవేంకటేశ కడు నీ బంటుబంటుకు
సందడిబంట నవుటే చాలదా నాకు

**అవతారిక :**

అన్నమయ్య అచ్చుతునితో మీతో మొరపెట్టుకొనేటంత పనేముందయ్యా? నీ దాసుల అనుగ్రహం మాకువుంటే చాలదా? వైష్ణవుల సముఖానవుంటే ఇంకేమి కావాలి? నీ శరణాగతులను పూజిస్తే చాలదా? శ్రీవేంకటేశ్వరా! నీ బంటు బంటుకు నేను బంటునైనా అది చాలదా నాకు అంటున్నారు.

**భావదీపిక :**

ఓ అచ్చుతా! మిమ్ముదలచే (ధ్యానించేటంత) పనివలెనా (అవసరమున్నదా?) ఇచ్చుల (ఇహలోకములో) మీ వారే (తమరి శరణాగతులే) మాకు ఇహపరములు రెండూ ఇస్తున్నారయ్యా!

మిమ్ము నెరిగిన మీ దాసులను మేమెరిగితిమి. వారు సమ్మతించి ఇచ్చిన నీ విజ్ఞానమే మాకు చాలు. స్వామీ! మీ సేవ నిత్యము చేసికొనే వైష్ణవుల సమ్ముఖము జేరి వారిని సేవిస్తే ఆ బాగు చాలదా నాకు?

నీకు శ్రేష్ఠముగా మొక్కే నీ డింగరీలకు (దాసులకు) సరవితో (క్రమముగా) మొక్కితే నాకు అది చాలదా? నీ ప్రపన్నులను (శరణాగతులను) అతిశయముతో పూజిస్తే నిన్ను పూజించేవారు నన్ను కనికరించరా? ప్రభూ! సరిలేని ఆ భాగ్యం చాలదా నాకు?

నీకు వశమై భక్తులైన మహానుభావులు అయినవారిపై భక్తివుంటే అది నాకు చాలదా? అతిశయించిన శ్రీవేంకటేశ్వరా! నీ బంటు నవటంకూడా పనిలేదు, నీ బంటుకు బంటుకు వినయపు బంటునైతే నాకు అది చాలదా?

**సంఖ్య : 489 సంపుటము : 1 పుట : 338 రాగం : సాళంగనాట**

పల్లవి: అట్టివేళఁ గలఁగనీ దదివో వివేకము
మట్టుపడితే శాంతము మఱి యేలా

చ. 1: జడధులు వొంగినట్టు సందడించు నింద్రియములు
వొడలిలో జీవునికి నొక్కొక్క వేళ
బడబాగ్ని రేఁగినట్టు పైకొనీ ముంగోపము
వుడికించు మనసెల్ల నొక్కొక్కవేళా

చ. 2: ఆరయఁ గొండయెత్తినట్టు వేఁగౌ సంసారము
వూరక కలిమిలేము లొక్కొక్క వేళ
మేరలేని చీఁకటియై మించును దుఃఖములెల్లా
వూరటలేనికర్మికి నొక్కొక్క వేళ

చ. 3: పెనుగాలి వీచినట్టు పెక్కుకోరికెలు ముంచు
వొనర నజ్ఞానికి నొక్కొక్క వేళా
యెనయఁగ శ్రీవేంకటేశుదాసుఁడైనదాఁకా
వునికిఁ బాయ విన్నియు నొక్కొక్క వేళా

**అవతారిక :**

అన్నమయ్య ఈ కీర్తనలో ఇంద్రియాలు చెలరేగినప్పుడు, కోపము విజృంభించినప్పుడు, సంసారమనే కొండను మోస్తున్నప్పుడు, దుఃఖము చీకటిలా చుట్టుముట్టినప్పుడు, కోరికల ఝంఝామారుతంలో కొట్టుకుపోయేటప్పుడూ, శాంతము యెలా వుంటుంది? శ్రీవేంకటపతి శరణనక తప్పదు-అంటున్నారు.

**భావదీపిక :**

అట్టివేళ (నేను చెప్పబోయే విపత్కర పరిస్థితుల్లో) అదిగో చిత్తము వివేకము కలుగనీయదు. మట్టుపడితే (అప్పుడు కూడా కుదురుగావుంటే) శాంతము తప్పక వుంటుంది.

చెలరేగే ఇంద్రియాలు సముద్రంలా పొంగితే, ఒడలిలో (దేహములోని) జీవుడు ఒక్కొక్కప్పుడు తానూ రెచ్చిపోతాడు. ముక్కుమీద వుండే కోపం బడబాగ్నిలా ముంచెత్తితే మనస్సు వొక్కొక్కప్పుడు ఉడికిపోతుంటుంది. ఏమిచేయగలము?

వేగౌసంసారమును (భారమైన సంసారం) కొండయెత్తినట్లు మోస్తుంటే కలిమిలేములు ఒక్కొక్క వేళ ఆరడి పెడతాయి. మేరలేని (మితిలేని) చీకటిని మించిన దుఃఖములు ఒక్కొక్కప్పుడు కర్మబద్ధుడైన జీవుణ్ణి వూరటలేని వానిగా చేస్తాయి.

అజ్ఞానియైన జీవుడిని ఒక్కొక్కప్పుడు అనేకమైన కోరికలు పెనుగాలి వీచినట్లు జోరుగా ముంచేస్తాయి. అయితే శ్రీవేంకటేశ్వరుని దాసులు అయినదాకా ఒక్కొక్కప్పుడు ఈ పీడలన్నీ వదలకుండా పట్టుకొంటాయి.



**సంఖ్య : 362 సంపుటము : 2 పుట : రాగం : లలిత**

పల్లవి: ఆతనిమూలమే జగమంతా నిది
ఆతుమలో హరి కీలుఅయివుండుఁ గాని

చ. 1: మచ్చరము లేకున్నను మనసే రామరాజ్యము
వచ్చినట్టె వచ్చితేను వలపే చవి
యెచ్చుకుందు లేకున్న నెక్కడైనా సుఖమే
యిచ్చకుఁడై హరి తన కియ్యవలెఁ గాని

చ. 2: నెట్టుకొని నడచితే నిజమే మూలధనము
పట్టినదే వ్రతమైతే భవమే మేలు
జట్టిగా నొనగూడితే సంసారమే ఫలము
యిట్టి హరి దనకు నియ్యవలెఁ గాని

చ. 3: చెప్పినట్లు సేసితేను చేరి దేహమే చుట్టము
తప్పులు లేనిదియైతే ధర్మమే సొమ్ము
చొప్పున హరిదాసులు సోదించి చూచిన దిది
యెప్పుడు శ్రీవేంకటేశుఁ డియ్యవలెఁ గాని

**అవతారిక :**

సర్వజీవుల ఆత్మలో హరి కీలు (సూత్రధారి వలెనున్నాడు) అంటున్నారు అన్నమయ్య. జగన్మూలము అతడే కదా! మచ్చరమే లేకపోతే మనస్సే రామరాజ్యము. చెప్పినట్లు వింటే దేహమే చుట్టము. హరిదాసులు గ్రహించిన సత్యం ఒక్కటే శ్రీవేంకటేశుడు ఇయ్యవలెగాని అన్యులవల్ల అయ్యే పనికాదది.

**భావదీపిక :**

జనులారా! ఈ జగమంతా అతని మూలంగా నడచుచున్నదే. సర్వజీవుల ఆత్మలలో హరి కీలు (సూత్రధారి) గా అయివుండుటచేతనే ఈ విశ్వరచన జరుగుతున్నది.

మనస్సునకు మాత్సర్యగుణం లేకపోతే అంతా రామరాజ్యము. స్పందనకు ప్రతి స్పందనతోడైతే వలపె మాధుర్యము. హెచ్చుతగ్గులు లేకపోతే యెక్కడైనా సుఖమే. శ్రీహరి ప్రియవాదియై తనకియ్యవలెగాని లోటుంటుందా?

నెట్టుకొని (పూనుకొని) నడచితే (గమనిస్తే) సత్యవచనమే మూలధనము. తాని చేపట్టినదే వ్రతము. మంచిభవమే (జన్మమే) ముక్తికి మేలైన మూలము. జట్టిగా (శ్రేష్ఠంగా) మనగలిగితే సంసారమే ఫలవంతము. ఈ విధంగా శ్రీహరి ఇయ్యాలేగాని ఇదేమేలు కదా!

శాస్త్రోక్తంగా నడుచుకొనేవాడికి దేహమే ఆత్మబంధువు. తప్పులు చేయని యే ధర్మము నాచరించినా అది సొమ్మువలె ఉపయోగపడుతుంది. శ్రేష్ఠులైన హరిదాసులు శోధించి కనుగొన్నదేమంటే, ఎప్పుడైనా శ్రీవేంకటేశ్వరుడే ఇయ్యాలిగాని అది పరులవల్ల అయ్యేపనికాదు.

**సంఖ్య : 499 సంపుటము : 2 పుట : రాగం : రామక్రియ**

పల్లవి: ఆతనిఁబో పొగడేము ఆతని శరణంటిమి
ఆతఁడే సర్వజీవుల అంతర్యామి
చ. 1: పెక్కు బ్రహ్మాండకోట్లు పెక్కు బ్రహ్మకోట్లు
పెక్కు రుద్రకోట్లును పెక్కు యింద్రులు
వొక్కొక్క రోమకూపాల నొగి నించుకుండునట్టి
వొక్కఁడే విష్ణుఁడు వీఁడే వున్నతోన్నతుఁడు
చ. 2: అనంత సూర్యచంద్రులు అనంత వాయువులును
అనంత నక్షత్రము లనంత మేరువులు
కొనలు సాగీ నన్నిటి కూటువఁ గూడుకొన్నట్టి
అనంతుఁడొక్కఁడే మించీ నాదిమూరితి
చ. 3: అసంఖ్యమహిమలను అసంఖ్యమాయలు
అసంఖ్యశక్తులు వరాలసంఖ్యములు
పొసఁగ నిన్నిటిఁ దానే పుట్టించి రక్షించినట్టి
అసంఖ్యాతుఁడు శ్రీవేంకటాద్రీశుఁడు

**అవతారిక :**

ఇది "హరిజ్ఞానమే అన్నమయ్యగానము" అనే అన్నమయ్య కీర్తనాస్రవంతిలో 101వ కీర్తన. నా 3000వ కీర్తనా విశ్లేషణకు "150 కీర్తనల" దూరంలో వున్నాను. అందాకా ఈ ఊపిరి వుంటుందో లేదో అసంఖ్యాతుడు శ్రీవేంకటాధీశునికే తెలుసు. ఎందుకంటే నన్ను పుట్టించి, సదా రక్షించేవాడికి, నను శిక్షించే హక్కే కాదు... భక్షించేహక్కు వుంటుంది. అతని శరణంటిమి అతడేనా అంతర్యామి.

**భావదీపిక :**

అయ్యలారా! ఆతనిన్ పో (శ్రీహరినే పో!) మేము పొగడెదము. ఆతనినే శరణువేడెదము. సర్వజీవులలో నెలకొనివున్న అంతర్యామి అతడే సుమా!

ఈ విశ్వమంటే ఎన్నో కోట్ల బ్రహ్మాండాలు ఎన్నోకోట్ల బ్రహ్మలు, ఎన్నోకోట్ల రుద్రులు, ఎందరో ఇంద్రులు. ఇంతమంది దేవతలను ఒక్కొక్కరోమకూపములో నింపుకొనిన విశ్వరూపుడు ఒక్కడే. వీడే వున్నతోన్నతుడైన విష్ణుమూర్తి.

అనంతమైన ఈయన కళ్ళు అంతులేని సూర్యచంద్రులు, అనంతమైన వాయువులు, నక్షత్రాలు, అనంతమైన మేరుపర్వతాలు మొదలైనవన్నీ కొనలు సాగి (వృద్ధిచెంది) కూటువ (సాధనసంపత్తి వలె) కూడుకొనియున్న అనంతుడు వొక్కడే. ఈతనిని మించిన ఆదిమూర్తి మరిలేడు, వుండడు.

ఈతని మహిమలు అసంఖ్యాకములు. ఈతని మాయలు, శక్తులు అసంఖ్యాకములు. ఈతడిచ్చే వరములు అసంఖ్యాకములు. అన్నింటిలోనూ తానే పొసగి జీవులందరిని పుట్టించి, పోషించి, రక్షించుచున్నట్టి ఈ శ్రీవేంకటాధీశుడు అసంఖ్యాతుడు (లెక్కకందనివాడు) అంతుకే శ్రీవేంకటేశం శరణంప్రపద్యే.



**సంఖ్య : 10 సంపుటము : 2 పుట : 7 రాగం : మలహరి**

పల్లవి: అతిసులభం బిది యందరిపాలికి
గతియిది శ్రీపతి కైంకర్యంబు
చ. 1: పాలసముద్రము బలిమిఁ దచ్చికొని-
రాలరిదేవత లమృతమును
నాలుక నిదె హరినామపుటమృతము
యేల కానరో యిహపరసుఖము
చ. 2: అదరి బాఁతిపడి యవని దేవతలు
బడివాయరు యజ్ఞభాగాలకు
విడువక చేతిలో విష్ణుప్రసాదము
కడిగడియైనది కానరు గాని
చ. 3: యెక్కుదురు దిగుదు రేడులోకములు
పక్కను దపముల బడలుచును
చిక్కినాఁడు మతి శ్రీవేంకటేశ్వరుఁ -
డిక్కడి తుదిపద మెఱఁగరు గాని

**అవతారిక :**

అన్నమయ్య మాట వినండి. అతిసులభమైనది శ్రీహరి శరణాగతి. పాలసముద్రాన్ని మథించి అమృతం సంపాదించాల ఈ హరినామామృతం మేలుకదా? యజ్ఞయాగాలు చేసి భ్రాంతిపడాలా? విష్ణుప్రసాదము చాలదా? తపస్సు చేసి ఏడులోకాలెక్కినా మళ్ళీ దిగవలసిందే. శ్రీవేంకటేశుని చిక్కించుకొంటే జీవన్ముక్తి దక్కినట్లేకదా! అంటున్నారు.

**భావదీపిక :**

ఇది (శ్రీహరి కైంకర్యంబు) అతి సులభమైన ప్రక్రియ. అందరిపాలిటి అతిసులువైన ఈ శరణాగతి జీవులందరికీ ఒకే ఒక్క గతి.

ఆనాడు పట్టుదలగల దేవతలు అమృతంకోసం పాలసముద్రాన్ని దచ్చిరి (మథించిరి). ఎందుకంత శ్రమ పడ్డారో తెలియదు. నాలుకమీద ఈ శ్రీహరినామామృతాన్ని పెట్టుకొంటే ఇహపర సుఖములు ఇక్కడే కనుపిస్తాయి కదా!

అతిశయించి అవనిలో జరిగే యజ్ఞభాగాలకు భాఁతిపడి (భ్రాంతి చెంది) దేవతలు వాటిని బడివాయరు (వదలిపెట్టరు). వారి చేతిలోనే వున్న విష్ణుప్రసాదమును కడిగడియైనది కానరు (ఆహారంగా భుజిస్తున్నామని గమనించరు.

వారి కర్మానువర్తులై మరణానంతరము ఏడు లోకాలు యెక్కుతుంటారు, దిగుతుంటారు. దాని కోసం గొప్పతపములు చేసి బడలుతూనేవుంటారు. మా గురించి చెప్పేందుకేముంది? శ్రీవేంకటేశ్వరుడు మా మతిజిక్కినాడు. తుదిపదము నిక్కడయెక్కితిమి (జీవన్ముక్తులమైనాము)

**సంఖ్య : 498 సంపుటము : 2 పుట : రాగం : పాడి**

పల్లవి: అదివో చూడరో అందరు మ్రొక్కరో
గుదిగొనె బ్రహ్మము కోనేటిదరిని
చ. 1: రవిమండలమున రంజిల్లు తేజము
దివిఁ జంద్రునిలో తేజము
భువి ననలంబునఁ బొడమిన తేజము
వివిధంబులైన విశ్వతేజము
చ. 2: క్షీరాంబుధిలోఁ జెలఁగు సాకారము
సారె వైకుంఠపు సాకారము
యీరీతి యోగీంద్రులెంచు సాకారము
సారెకు జగముల సాకారము
చ. 3: పొలసిన యాగంబులలో ఫలమును
పలు తపములలో ఫలమును
తలఁచిన తలఁపుల దానఫలంబును
బలిమి శ్రీవేంకటపతియే ఫలము

**అవతారిక :**

శ్రీవేంకటేశ్వరుని వైభవాన్ని కీర్తిస్తున్నారు అన్నమయ్య. స్వామి పుష్కరిణి ఒడ్డున వెలసిన బ్రహ్మము అదిగో చూడండి మ్రొక్కండి అంటున్నారు. విశ్వంలోవున్న వివిధ తేజస్సు సాకారము ఈ వైకుంఠనాథుడే అన్ని తపస్సుల ఫలము, దానముల ఫలము ఈ శ్రీవేంకటపతియే అంటున్నారు.

**భావదీపిక :**

ఓ భక్తులారా! అదిగో చూడండి. అందరూ మ్రొక్కండి. స్వామి పుష్కరిణి అని పిలువబడే ఈ కోనేటి ఒడ్డున సాక్షాత్తు పరబ్రహ్మమే నెలకొనినది.

ఇంత తేజము రవిమండలమున అతిశయించును. స్వర్గమున చంద్రునిలో ఇంత తేజస్సు వుండనోపును. భూమి మీద అగ్నిలో ఇంత తేజము పొడచూపవచ్చును. అనేక రకములైన విశ్వ తేజము ఇదియే.

ఇది క్షీరసాగరమున పవళించిన సాకారము. వైకుంఠమున విలసిల్లెడి విష్ణుదేవుని సాకారము. ఈ విధముగా ఘనులైన యోగీంద్రులు యెంచిన సాకారము. తడవతడవకు జగములన్నీ యెంచిన సాకారము.

పొలసిన (అతిశయించిన) యాగముల యొక్క ఫలమును ఈ దేవదేవుని దర్శనమే. అనేకమైన గొప్ప తపస్సుల ఫలము ఈతని దర్శనమే. అనేక దానములు తలచుకొన్నవి గాని తలచుకోబోయినవి గాని చేసిన ఫలము ఈ శ్రీవేంకటపతి దర్శనమే.



**సంఖ్య : 31 సంపుటము : 3 పుట : రాగం : సాళంగం**

పల్లవి: అని రావణుతల లట్టలుఁ బొందించి
చెనకి భూతములు చెప్పె బుద్ధి
చ. 1: కట్టిరి జలనిధి కపిసేన లవిగో
చుట్టు లంక కంచల విడిసె
కొట్టిరి దానవకోట్ల తలలదే
కట్టడి రావణగతియో నీకు
చ. 2: యెక్కిరి కోటలు యిందరు నొకపరి
చిక్కిరి కలిగిన చెరయెల్ల
పక్కన సీతకుఁ బరిణామమాయ
నిక్కె(క్క?)ము రావణ నీకో బ్రదుకు
చ. 3: పరగ విభీషణుఁ బట్టము గట్టెను
తొరలి లంకకును తొలుఁదొలుతే
గరిమెల శ్రీవేంకటగిరిరాముఁడు
మెరసెను రావణ మేలాయఁ బనులు

**అవతారిక :**

రావణ వధానంతం జరిగిన పరిణామాలను వివరిస్తున్నారు అన్నమయ్య. రామాయణం మొత్తం కీర్తనల రూపంలో ఆయన రచిస్తే మన దౌర్భాగ్యం కొద్దీ చాలా తాళపత్రములు తగుల బెట్టబడి రాగిరేకులలో నిక్షిప్తపరచినవి మిగిలివున్నాయని నాకు అనిపిస్తున్నది. ఎంతుకంటే మధ్యలో ప్రారంభమై మధ్యలోనే అంతం చేయటం యెందుకు?

**భావదీపిక :**

అని (యుద్ధంలో) రావణుని తలలను అట్టలు బొందించి (తెగిన మొండెములా చేసి) భూతములన్నీ వాటిని చెనకి (కాళ్ళతో తొక్కి) బుద్ధి చెప్పినవి.

దీని కోసం రాముడు యెంత కష్టపడ్డాడు!! అదిగో వానరసేన సముద్రంపై వారధి కట్టింది. లంకకు అంచులలో (ఒడ్డున చుట్టూ) విడిసింది. కోట్లాది దానవుల తలలు తెగవేసిరి. ఓ రావణా! నీకు గతి కట్టడి అయిపోయింది.

ఇంతమంది కపిసేన ఒక్కసారిగా నీ కోటను యెక్కారు. దానవులంతా చెరలో చిక్కారు. పక్కన (వెనువెంటనే) సీతకు పరిణామమాయెను (గొప్ప సంతోషము కలిగెను). నిజము రావణా! నీకోబ్రదుకు (నీదీ ఒక బ్రతుకేనా?)

ఆపైన విభీషణునికి పట్టాభిషేకము జరిగింది. అంతకు మునుపే విభీషణుని హితులు లంకను స్వాధీనం చేసికొనినారు. గరిమెలు (మహిమాన్వితుడైన) శ్రీవేంకటగిరి రాముడు మెరిసెను (అతిశయించెను) రావణా! పనులన్నీ చక్కబడినవిరా.

**సంఖ్య : 10　　సంపుటము : 3　　పుట :　　　　రాగం : లలిత**

పల్లవి: అన్నిటా నా పాలిటికి హరి యాతఁడే కలఁడు
యెన్నికగాఁదుదిపద మెక్కితిమి మేలు

చ. 1: కొందరు జీవులు నన్నుఁ గోపగించినా మేలు
చెంది కొందరట్టె సంతసించినా మేలు
నిందించి కొందరు నన్ను నేఁడే రోసినా మేలు
పొందుగ కొందరు నన్నుఁ బొగడినా మేలు

చ. 2: కోరి నన్నుఁ బెద్దసేసి కొందరు మొక్కినా మేలు
వేరే హీనుఁడని భావించినా మేలు
కూరిమిఁ గొందరు నన్నుఁ గూడుకుండినా మేలు
మేరతో విడిచి నన్ను మెచ్చుకున్నా మేలు

చ. 3: యిప్పటికిఁ గల పాటి యెంత పేదయినా మేలు
వుప్పతిల్లు సంపద నాకుండినా మేలు
యెప్పుడు శ్రీవేంకటేశు కే నిచ్చిన జన్మమిది
తప్పు లే దాతనితోడి తగులమే మేలు

**అవతారిక :**

అన్నమయ్య ఈ కీర్తనలో కొంతమంది నాపై కోపిస్తారు, కొంతమంది మొక్కుతారు, కొంతమంది మెచ్చుకొంటారు. యేదియేమైనా తప్పు లేదు. అన్నిటికీ నాకు శ్రీహరివున్నాడు అది చాలు. నేను ముక్తిని పొందినట్లే. నా జన్మ శ్రీవేంకటపతి ఇచ్చినదే. అందుకే ఆయననే తగులుకొన్నాను అంటున్నారు.

**భావదీపిక :**

అయ్యలారా! అన్నిటా (అన్ని విధములా) నా పాలిటికి ఆ శ్రీహరియే కలడు. ఎన్నికగా (విశిష్టముగా) నేను తుదిపదమెక్కితిని (ముక్తిని పొందితిని). మేలు మేలు.

కొందరు జీవులు నన్ను గోపించియుండవచ్చును మేలు. కొందరు ననుజాచి సంతసించివుండవచ్చు అదియును మేలే. నేనంటే రోసి నన్ను నిందించియుండవచ్చును మేలు మేలు. కొందరు పొందుగా నన్ను పొగడియుండవచ్చును అదియును మేలే.

కొందరు నాకు పెద్దరికం ఇచ్చి మొక్కియుండవచ్చును మేలే. కొందరు హీనుడని భావించి నిందిచవచ్చును. అదీమేలే. కొందరు నా పై ప్రేమతో కూడుకొని యుండవచ్చును మేలే. మేరతో (మర్యాదతో) నన్ను సంకోచము విడిచి కొందరు మెచ్చుకొనవచ్చును అదియును మేలే.

ఎప్పటికినీ యెంత పేదనయినా, పాటి (ప్రమాణం) వుంటే, అదే యెంతో మేలు. ఉప్పతిల్లు (అందరూ ఓర్వలేనంత) సంపదవున్నా నాకు మేలే. ఈ జన్మను యెనాడో శ్రీవేంకటేశ్వరునికి కైంకర్యం చేశాను. ఇక తప్పులేదు. అతనితో తగులు (సమాగమం) నాకు మేలు.



**సంఖ్య : 138　　సంపుటము : 3　　పుట : 93　　　　రాగం : రామక్రియ**

పల్లవి: అన్నిటా నేరుపరి హనుమంతుఁడు
పిన్ననాఁడే రవినంటె పెద్దహనుమంతుఁడు

చ. 1: ముట్టిన ప్రతాపపు రామునిసేనలలోన
అట్టె బిరుదుబంటు శ్రీహనుమంతుడు
చుట్టి రా నుండినయట్టి సుగ్రీవుప్రధానులలో
గట్టియైనలావరి చొక్కపు హనుమంతుఁడు

చ. 2: వదలక కూడినట్టివనచరబలములో-
నదె యేకాంగవీరుఁడు హనుమంతుఁడు
చెదరక కుంభకర్ణుచేతిశూలమందరిలో
సదరాన విరిచె భీషణహనుమంతుఁడు

చ. 3: త్రిజగములలోపల దేవతాసంఘములోన
అజునిపట్టాన నిల్చె హనుమంతుఁడు
విజయనగరాన శ్రీవేంకటేశుసేవకుఁడై
భుజబలుఁడై యున్నాఁడిప్పుడు హనుమంతుఁడు

**అవతారిక :**

విజయనగరంలో వెలసిన హనుమందునిపై చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. చాలా ఎత్తుగావుండే ఈ హనుమంతుడు గొప్ప భుజబలశాలి. ఈయన శ్రీవేంకటేశ్వరుని సేవకుడై విరాజిల్లుతున్నాడంటారు అన్నమయ్య. కుంభకర్ణుని శూలాన్ని సదరాన విరచిన భీషణుడట ఈ హనుమంతుడు.

**భావదీపిక :**

ఈ పెద్ద హనుమంతుడు యెంతటి ఘనుడో వినండి. ఈయన అన్ని విద్యలలోను నేర్పరి. చాలా చిన్నప్పుడే సూర్యుని ఫలమని మ్రింగబోయి రవినంటె (భానుని తాకినాడు).

శ్రీహనుమంతుడు ఉద్దండప్రతాపశాలియైన రాముని సేనలలో బిరుదు బంటు (పేరుగాంచిన సేవకుడు). చుట్టిరానుండినయట్టి (వాలిభీతిచే పారిపోయిన) సుగ్రీవుని ప్రధానులలో గట్టి లావరి (బలవంతుడు) ఈ హనుమంతుడు.

సీతాన్వేషణలో వదలక తనన్నాశ్రయించిన వనచరులలో ఈయన ఏకాంగవీరుడు (అసాహాయశూరుడు) యీ హనుమ. కపిసేన కుంభకర్ణుని ధాటికి పారిపోతుంటే, చెదరక అతగాని శూలమును సదరాన (సమగ్రంగా) విఱచివేసినాడు.

ముల్లోకాలలోను ముక్కోటిదేవతలుండగా రాబోవు మన్వంతరములో బ్రహ్మవయ్యెదవని రామునిచే అజునిపట్టము (బ్రహ్మపదవి) పొంది నిలిచినవాడు ఈ హనుమంతుడు. విజయనగరములే వెలసిన ఈయన శ్రీవేంకటేశ్వరుని సేవకుడై, ఇప్పుడు గొప్ప భుజబల పరాక్రమవంతుడైవున్నాడు.

**సంఖ్య : 442 సంపుటము : 2 పుట : రాగం : బౌళిరామక్రియ**

పల్లవి: అన్నిటికి హరి యంతర్యామి మూలము
విన్నకన్న గతులెల్లా వృథా మూలము
చ. 1: లాలిత వైరాగ్యమూలము మోక్షము
ఆలరిసంసారమూల మతిబంధము
మేలిమిశాంతిమూలమే సుఖము
వీలి క్రోధమూలమే వెడదుఃఖము
చ. 2: కైకొను భవములే కర్మమూలము
శ్రీకాంతుపై భక్తి చిన్మూలము
పైకొన్న ధ్యానమెల్ల భావమూలము
దీకొని లంపటములు దేహమూలము
చ. 3: అరుదై సుజ్ఞాన మాచార్యమూలము
ధరణి జగత్తెల్లా ధనమూలము
పరము శ్రీవేంకటపతి మూలము
హరి నాతని శరణాగతి మూలము

**అవతారిక :**

ఆది మధ్యాంతరహితుడైన మూలకారణానికి మొక్కెదన్ అని గజేంద్రుడు శరణంటే ఏ దేవుడూ పరుగులు తీసి వెళ్ళలేదు. ఒక్క విష్ణువే వెళ్ళాడు. అన్నమయ్యకూడా హరి అందరి అంతర్యామి కాబట్టి అన్నిటికీ మూలము అంటున్నారు. “ధనమూల మిదంజగత్” కాని హరిశరణాగతియే హరికి మూలము అంటున్నారు.

**భావదీపిక :**

అన్నిటికి (అన్ని జీవులకు) శ్రీహరియే అంతర్యామి. ఆయనే ఆదిమూలము. ఐహికమైన గతులన్నీ వృథాయైన మూలము. వాటిని యెంత కనినా, వినినా లాభంలేదు.

లలితమైన వైరాగ్యానికి మూలము మోక్షము. అలరిన సంసారానికి మూలము మిక్కుటమైన బంధము. మేలిమివంటి శాంతికి మూలము సుఖము. వీలి (వీలుకాని) క్రోధానికి మూలము తీరని దుఃఖము.

కలిగే భవములకు (పుట్టుకులకు) చేసిన కర్మ మూలము. శ్రీకాంతునిపై భక్తి చిత్తుకి (చిదానందానికి) మూలము. అతిశయించిన ధ్యానమంతా భావమూలమున సిద్ధించును. మనలను ఢీకొనే లంపటాలు దేహమూలముగా పుట్టినవే.

అరుదైన సుజ్ఞానము ఆచార్యుని మూలంగా కలుగుతుంది. భూమిపైన జగమంతా ధనమూలమనేది తిరుగులేని సత్యం. పరము (వైకుంఠానికి) మూలము శ్రీవేంకటపతి. శ్రీహరి ఆయన శరణాగతి మూలంగా స్వంతమవుతాడు.



**సంఖ్య : 35 సంపుటము : 3 పుట : రాగం : మాళవిగౌళ**

పల్లవి: అన్నియు నీతనిమూల మాతఁడే మాపాలఁ జిక్కె
కన్నుల వేడుకకు కడయేది యిఁకను
చ. 1: కామధేనువు గలి(గి?)తే గర్వించు నొక్కఁడు
భూమి యేలితే నొకఁడు పొదలుచుండు
కామించి నిధి గంటె కళలమించు నొకఁడు
శ్రీమంతుఁడగు హరి చిక్కె మాకు నిదివో
చ. 2: పరుసవేదిగలి(గి?)తే పంతములాడు నొకుడు
ధరఁ జింతామణబ్బితే దాఁటు నొకఁడు
సురలోక మబ్బితేను చొక్కుచునుండు నొకఁడు
పరమాత్ముఁడే మా పాలఁ జిక్కెనిదివో
చ. 3: అమృతపానము సేసి యానందించు నొకఁడు
భ్రమను దేహసిద్ధిఁ బరగొకఁడు
తమి శ్రీవేంకటేశుఁడే దాఁచిన ధనమై మాకు
అమరి నా మతిఁ జిక్కె నడ్డములే దిదివో

**అవతారిక :**

అన్నమయ్య తమకు అడ్డమే లేదంటున్నారు. అన్నిటికీ మూలకారణమైన శ్రీహరియే మాకు చిక్కితే ఇంకేం కావాలి? హరి వుంటే ధనధాన్యాలు యెందుకు? సురలోక భోగాలెవరికి కావాలి, పరమాత్మే మాపట్లవున్నాడు. శ్రీవేంకటేశుడు మేము దాచికొనిన నిధి. ఆయన వుండగా మాకు అమృతం కూడా వద్దు అంటున్నారు.

**భావదీపిక :**

అన్నియును ఆతని (శ్రీహరి) మూలంగానే కలుగుతాయి. ఆతడే మాపాల జిక్కినాడు (మాకు దక్కినాడు). ఇక మాకు కన్నులవేడుకే కదా! కడమయేది? (లోటు యెక్కడుంది?)

ఒకడు తనకు కామధేనువు వుందని గర్విస్తాడు. ఒకడు భూమిలో యేలికైతే సంతోషిస్తాడు. ఒకడు కోరుకొన్న నిధి దొరికితే కళకళలాడుతుంటాడు. కాని మాకు అవేవీ వద్దు. శ్రీకాంతుడైన శ్రీహరి మాకు చిక్కితే ఇంకేమిటి?

ఒకడు పట్టిందల్లా బంగారం చేసే పరుసవేది కోరుతాడు. ఒకడు కోరినదెల్లా ఇచ్చే చింతామణి కావాలంటాడు. స్వర్గసుఖాలు పొందాలి అని ఇంకొకడు కోరుకొంటాడు. పరమాత్ముడైన పద్మనాభుడే మా పాల జిక్కినాడు ఇదిగో ఇంకా మాకు కోరికలుంటాయా?

ఒకడికి అమృతం తాగి అమరత్వం పొందాలని వుంటుంది. ఒకడికి దేహసిద్ధి (దేహముతోనే ముక్తి) పొందాలనే ఆశవుంటుంది. మాకు తనివిదీరా ఆ శ్రీవేంకటేశ్వరుడే దాచిన ధనములా దొరికాడు నా మదిలో నిలచాడు. ఇక మాకు అడ్డమేముంది?

**సంఖ్య : 20 సంపుటము : 1 పుట : 13 రాగం : శ్రీరాగం**

పల్లవి: అన్నియును నతని కృత్యములే
యెన్నియైనానవు నతఁడేమి సేసినను
చ. 1: అణురేణు పరిపూర్ణుఁడవలి మోమైతేను
అణువౌను కమలభవాండమైన
ఫణిశయనుని కృపాపరిపూర్ణ మైతే
తృణమైన మేరువౌ స్థిరముగా నపుడే
చ. 2: పురుషోత్తముని భక్తి పొరపొచ్చ మైతే
ఎరవులౌ నిజసిరులు ఎన్నైనను
హరిమీఁది చింత పాయక నిజం బైతే
నిరతిఁ బట్టినవెల్లా నిధానములే
చ. 3: మదనగురుని సేవ మదికి వెగటైతేను
పదివేలు పుణ్యములు పాపంబులే
పదిలమై వేంకటపతి భక్తి గలిగితేను
తుదిపదంబునకెల్ల దొడవవు నపుడే

**అవతారిక :**

పరిపూర్ణతనొందిన జీవుడు తెలిసికొనే పరమ సత్యం ఒక్కటే, సర్వం ఈశ్వరేచ్ఛ. దీనినే అన్నమాచార్యులవారు ఈ చక్కని కీర్తనలో వివరిస్తున్నారు. ఆయన (సర్వేశ్వరుడు) అనుకొన్నది జరిగి తీరుతుంది. మన్మథునికి తండ్రియైన ఆ స్వామిని ద్వేషించేవారు పదివేల పుణ్యాలు చేసినా లాభంలేదు. అవి పాపములుగానే మారిపోతాయి అంటున్నారు.

**భావదీపిక :**

ఈ ప్రపంచంలో యేపని జరిగినా, అన్నియు అతని (శ్రీహరియొక్క) కృత్యములే (చేతలే). అతను తలచినచో యెన్నియైనా అవుతాయి. అతడేమి చేసినా చెల్లుతుంది.

అణురేణు పరిపూర్ణుడు (అణురూపము నుంచి పరిపూర్ణమైన అనంతరూపం వున్నవాడు) పెడమొగమైతే బ్రహ్మలోకమైనా అణుమాత్రమవుతుంది. ఆదిశేషశయనుడైన హరికృప పరిపూర్ణంగావుంటే తృణమైనా (గడ్డిపోచ) కూడా మేరుపర్వతంలా నిశ్చలంగా వుంటుంది.

పురుషోత్తముని మీది భక్తిలోటుపడితే, స్వంతమైన సిరిసంపదలు యెన్ని యెరువులైపోతాయి (క్షణికములౌతాయి). శ్రీహరిమీద నీ ధ్యాస నిజమైనదైతే నీవు పట్టినదెల్లా బంగారమౌతుంది.

మదనగురుడు (మన్మథుని తండ్రి) అయిన శ్రీహరిసేవ నీ మనస్సుకు వెగటైతే నీవు చేసిన పదివేలపుణ్యాలైనా అవి పాపములే సుమా!! శ్రీవేంకటపతి మీద పదిలమైన భక్తి గవితేను (కలిగినదంటే) అప్పుడే తుది పదంబునకు (మోక్షమునకు) తానే తొడవవును (భూషణమౌతాడు).



**సంఖ్య : 326 సంపుటము : 2 పుట : రాగం : భూపాళం**

పల్లవి: అపరాధిని నేనైనాను
కృపగలవారికిఁ గపటములేదు
చ. 1: సనాతనా అచ్యుతా సర్వేశ్వరా
అనాది కారణ అనంతా
జనార్దనా అచల సకల లోకేశ్వరా
నిను మరచియున్నాఁడ ననుఁ దెలుపవయా
చ. 2: పురాణపురుషా పురుషోత్తమా
చరాచరాత్మక జగదీశా
పరాత్పరా హరి బ్రహ్మాండనాయకా
యిరవు నీవే యట యెఱిఁగించఁగదే
చ. 3: దేవోత్తమా శశిదినకరనయనా
పావనచరితా పరమాత్మా
శ్రీవేంకటేశా జీవాంతరంగా
సేవకుఁడను బుద్ధి చెప్పఁగవలయు

**అవతారిక :**

అనంత నామధేయుడైన శ్రీహరిని శరణాగతితో నామసంకీర్తన చేస్తున్నారు అన్నమయ్య. నేను అనేక అపరాధాలను చేసిన మాట నిజమే, అయినప్పుటికీ నీ కృపకు పాత్రులైనవారికి కపటము వుండదు కదా! నేను నీ సేవకుడనయ్యా నాకు బుద్ధి చెప్పే బాధ్యత కూడా నీదే మరి.

**భావదీపిక :**

ప్రభూ! నేనపరిధిననెడి మాట ఇది వరకు వాస్తవమే. నీవు కృపగలయేలికవు. కృపగలవారికి కపటము లేదు కదా! కాబట్టి నిన్ను సన్నుతించేవాడిని నీవు కరుణించు.

ఓ సనాతనా! (ఆదిపురుషా) అచ్యుతా నీవు సర్వేశ్వరుడవు. అనాదినుంచి నీవే కారణ భూతుడవు. అనంతా! నీవు జనుల ఆర్తిని తీర్చే జనార్ధనుడవు, అచలుడవు, సకల లోకనాథుడవు. నిన్నేమరచిన నాకు నేనెవరినో తెలుపవయ్యా!

ఓ పురాణపురుషా! నీవే పురుషోతముడవు. చరాచరములన్నింటికి నీవే ఆత్మవు. ఈ జగతికంతటికి ఈశ్వరుడవు. పరాత్పరుడవు (శ్రేష్ఠులకెల్లా శ్రేష్ఠుడవు) శ్రీహరివి. అండపిండ బ్రహ్మాండములకు నాయకుడవు. నీవే ఇరవు (ఆధారమని) ఇట్లు యెరిగించవయ్యా!

ఓ దైవోత్తమా! నీవు సూర్యచంద్రనేత్రుడవు, పావనమైన చరిత్రకలవాడవు. నీవే పరమాత్మవు, ఓ శ్రీవేంకటేశ్వరా! సమస్తజీవుల అంతరంగాలలో నీవే అంతర్యామిగా వుంటావు. నేను నీ సేవకుడను, నాకు నీవు చెప్పాలి లేకుంటే నా గతియేమిటి తండ్రీ?

**సంఖ్య : 383 సంపుటము : 1 పుట : 256 రాగం : పాడి**

పల్లవి: అభయమభయమో హరి నీకు
విభుఁడ వింతటికి వెర విఁక నేది

చ. 1: జడిగొని మదిలో శాంతము నిలువదు
కడుఁగడు దుస్సంగతి వలన
యిడుమలేని సుఖ మించుక గానము
అడియాసల నా యలమటవలన

చ. 2: తలుపులోన నీతత్వము నిలువదు
పలు లంపటముల భ్రమవలన
కలిగిన విజ్ఞాన గతియును దాగెను
వెలి విషయపు పిరివీకుల వలన

చ. 3: పక్కనఁ బాపపు బంధము లూడెను
చిక్కక నినుఁ దలఁచిన వలన
చిక్కులు వాసెను శ్రీవేంకటపతి
నిక్కము నా కిదె నీకృప వలన

**అవతారిక :**

అన్నమయ్య సర్వలోకములకు ప్రభువైన హరిని అభయము నిమ్మని వేడుకుంటున్నారు. అంతటికీ భర్తఅయిన నిన్ను గతియని వేడుకొనక మాకు మరొక దారియేది? అని అడుగుతున్నారు. నీదయ లేక మాకు శాంతిలేదు, లంపటాలు బాధిస్తాయి, విజ్ఞానము కలుగుదు. మరి నీ కృపవుంటే చిక్కులన్నీ తొలగిపోతాయి అంటున్నారు.

**భావదీపిక :**

ఓ శ్రీహరీ! నీకు అభయమభయము (శరణు, శరణు) ఇంతటికి (ఈ సమస్తమునకు) నీవు విభుడవు (భర్తవు) మరి మాకు వెరవుయేది (గత్యంతర మెక్కడుంది?)

మా తిప్పలు చూడవయ్యా! ఎంతప్రయత్నించినా మనస్సున శాంతము నిలబడుటలేదు. ఎందువలనంటే మిక్కిలి దుష్టసాహవాసమువలన. ఇడుములు (బాధలు) లేని సుఖము కొద్దిగా లేదు. ఎందుకంటే అడియాసలే నా అలమట (చింత) కాబట్టి.

ఇక మా ఆలోచనల్లో కూడా నీ దివ్యతత్త్వము నిలచుటలేదు. మరి మా ఆలోచనలన్నీ మాకున్న లంపటాల మీద వాటి భ్రాంతిమీద, మాకున్న కొద్దిపాటి విజ్ఞానము (దైవజ్ఞానము) కూడా యెక్కడో మరుగున పడింది. ఎందుకంటే బాహ్యవిషయాల పిరివీకుల (పెనగులాట) వలన.

అటువంటి స్థితిలో శ్రీవేంకటేశుని నిజమైన కృప నాకుదక్కింది. అంటే.. పాపభూయిష్టమైన మా బంధాలన్నీ వూడిపోయాయి. మా చిక్కులలో దిక్కునీవేనని నేను తలచుట వలన మేము వాటిలో చిక్కక స్వామి శరణాగతిని పొందగలిగాము.



**సంఖ్య : 80 సంపుటము : 1 పుట : 55 రాగం : శంకరాభరణం**

పల్లవి: ఆదిమపూరుషుఁ డచ్యుతుఁడచలుఁడనంతుఁడమలుఁడు
ఆదేవుఁ డీతఁడేపో హరి వేంకటవిభుఁడఁ

చ. 1: ఏకార్ణవమై ఉదకములేచిన బ్రహ్మాండములోఁ
బైకొని యుండఁగ నొక వటపత్రములోపలను
చేకొని పవళింపుచు నొక శిశువై వడిఁదేలాడిన-
శ్రీకాంతుఁ డీతఁడేపో శ్రీవేంకటవిభుఁడఁ

చ. 2: అరుదుగ బలిమద మడఁపఁగ నాకసమంటిన రూపము
సరుగన భూమింతయు నొక చరణంబున గొలచి
పరగిన పాదాంగుటమున బ్రహ్మాండము నగిలించిన
పరమాత్ముఁ డీతఁడేపో పతి శ్రీవేంకటవిభుఁడఁ

చ. 3: క్షీరపయోనిధి లోపల శేషుఁడు పర్యంకముగా
ధారుణియును సిరియునుఁ బాదము లొత్తఁగను
చేరువదను బ్రహ్మాదులు సేవింపఁగఁ జెలుఁవొందెడి
నారాయణుఁ డితఁడే వున్నత వేంకటవిభుఁడు

**అవతారిక :**

అన్నమాచార్యులవారు ఆదిమపురుషుడు అచ్యుతుడు అయిన శ్రీహరినేటి వేంకటవిభుడై మనకు ద్యోతకమౌతున్నాడని కీర్తిస్తున్నారు. ఏకార్ణవమున వటపత్రశాయి, బలిని "అణగద్రొక్కిన" త్రివిక్రమడు, క్షీరాబ్ధిలో ఆదిశేషశయనుడు, బ్రహ్మాదిదేవతలు సేవించే నారాయణుడు కూడా కలియుగ ప్రత్యక్షదైవమైన ఈ శ్రీవేంకటేశ్వరుడే.

**భావదీపిక :**

అచలుడు (చలించనివాడు) అచ్యుతడు (నాశరహితుడు), అనంతుడు (అంతములేని వాడు), ఆదిపురుషుడు అయిన ఆ దేవుడు ఇతడే పో! శ్రీహరి యీ వేంకటనాథుడే సుమా!

బ్రహ్మాండమంతా ఒకే మహాసముద్రమైపోతే వ్యాపించిన ఆ నీటిపై మఱ్ఱి ఆకుపై పవ్వళించిన వొక శిశువు తేలాడినాడు. ఆదిమూలమైన ఆ శ్రీకాంతుడీతడేపో! శ్రీ వేంకటనాథుడు.

తనంత 'దాతలేడని మదించిన బలిచక్రవర్తిని, అరుదైన వామనునిగా మూడడుగులు యాచించి, ఒక చరణముతో భూమిని, ఒక అడుగుతో ఆకాశమును ఆక్రమించి, తన పాదాంగుటముతో (కాలిబొటనవ్రేలితో బ్రహ్మాండమును అగిలించిన (వూడపెరికిన) ఆ పరమాత్మ యితడేపో! శ్రీ వేంకటనాథుడు.

క్షీరపయోనిధిలో (పాలసముద్రములో) ఆదిశేషుడు పర్యంకంగా (పరుపుగా) ధారుణి (భూదేవి) సిరియు (శ్రీదేవి) పాదములను వొత్తుచుండగా తన చుట్టూ చేరిన బ్రహ్మాదిదేవతలు సేవిస్తుండగా చెలువొందు (ఆశ్రయించునట్టి) ఆది నారాయణుడు ఇతడేపో! అత్యున్నతమైన శ్రీవేంకటచలమునేలెడి మన ఇష్టదైవము ఈ దేవదేవుడు శ్రీవేంకటేశ్వరుడు. ఇతనినే శరణుజొచ్చేదను.

**సంఖ్య : 261 సంపుటము : 1 పుట : 175 రాగం : ధన్నాసి**

పల్లవి: ఆదిమునుల సిద్ధాంజనము
యేదెసఁ జూచిన నిదివో వీఁడే

చ. 1: నగిన సెలవిఁ బడు నాలుగుజగములు
మొగమును జూపే మోహనము
నిగిడి యశోదకు నిధానంబై
పొగడొందీ గృహమున నిదె వీఁడే

చ. 2: కనుదెరచిన నలుగడ నమృతము లటు
అనువును గురసీ నపారము
వనితలు నందవ్రజమునఁ జెలఁగఁగ
మనికికి నిరవై మలసీ వీఁడే

చ. 3: పరమునకునుఁ దాని బరమై వెలసిన-
పరిపూర్ణ పరాత్పరుఁడు
సరుస రుక్మిణికి సత్యభామకును
వరుఁడగు వేంకటవరదుఁడు వీఁడే

**అవతారిక :**

ఉన్నాడా అని సందేహించేవారికి లేడేమో అనిపిస్తాడు ఈతడు. కాని ఉన్నాడని నమ్మి తపించిన ఆదిమునులకు సిద్ధించిన అంజనము ఈ తిరుమలేశుడు. అట్టి భక్తులకు ఇందుగలడందులేడని సందేహమేవలదు. ఏదెస "జూచినా" నిదివో వీడే అంటున్నారు అన్నమయ్య. ఈమోహనమూర్తే ఆనాటి యశోద గారాలకూచి, నందవ్రజసుందరీమణుల ఆనందమూర్తి, రుక్మిణీ సత్తభామల ఉమ్మడి వరుడు.

**భావదీపిక :**

ఈ శ్రీకృష్ణపరమాత్మ ఆదిమునులకు (సనకాది మునివర్యులకు) సిద్ధాంజనము (తలచినప్పుడు దర్శింపజేసే ద్రష్ట) వారికి యెక్కడచూచినా ఇదిగోవీడే.

యశోదకు తననోటిలో మోహనము (అద్భుతము) నిగడి (విజృంభించి) చూపిన నిధానమితడే. నాలుగు జగములను బోసినవ్వుల నోటిలో జూపినాడు. ఆ గొపెమ్మగృహమున పొగడొందినాడు (కీర్తించబడినాడు).

బాలకృష్ణుడు తన విశాలనేత్రాలను విప్పి చూస్తే నలుదిక్కులా అమృతం వర్షించేది. రేయింబవళ్ళు ఆ అపారమైన ధారలో నందవ్రజములోని వనితలు తేలియాడిరి. వీడే (ఈ బాలకృష్ణుడే) మనికికినిరవై (జీవనాధారమై) మలసీ (వసించినాడీ) దేవదేవుడు.

ఈ శ్రీకృష్ణుడే పరమునకు పరమై అత్యున్నత మోక్షదాతయై వెలిసిన పరిపూర్ణుడు. ఈయననే పరాత్పరుడు (సర్వశ్రేష్టుడు) సరుస (క్రమముగా) రుక్మిణీ సత్యభామలను పెండ్లాడిన వరుడితడే. శ్రీవేంకటాచలమున కాదనక వరములనొసగునది వీడేవీడే.



**సంఖ్య : 438 సంపుటము : 1 పుట : రాగం : సామంతం**

పల్లవి: ఆపద్బంధుఁడు హరి మాకుఁ గలుదు
దూపలి తలఁచినా దోషహరము

చ. 1: గరుడనినెక్కిన ఘనరేవంతుఁడు
గరుడ కేతనముగలరథుఁడు
గరుడఁడే తనకును గరియగుబాణము
గరిమె నీతఁడేపో ఘనగారుడము

చ. 2: పాముపరపుపై బండినసిద్ధుడు
పాముపాశముల పరిహరము
పామున నమృతముఁ పడుదచ్చినతుడు
వేమరు నీతఁడే విషహరము

చ. 3: కమలాక్షుఁ డీతఁడు కమలనాభుఁడును
కమలాదేవికిఁ గైవశము
అమరిన శ్రీవేంకటాధిపు డితఁడే
మమతల మాకిదే మంత్రౌషధము

**అవతారిక :**

ఈ కీర్తనకు పూర్వం నా చేత 2750 కీర్తనలను విశ్లేషింపజేసిన ఆ శ్రీవేంకటేశ్వరుడు "ఒరే ఇంత చక్కని కీర్తన నెందుకు మఱచిపోయావు?" అని నిందించకుండా నేటికైనా వివరిస్తున్నాను. అన్నమార్యా! నన్ను క్షమించు. "దూపలి తలచిననూ దోషహరము" అని నీవే ఈ కీర్తనలో అన్నావు కదా!

**భావదీపిక :**

ఈ శ్రీహరి యెవ్వరను కొన్నారు? మాకు ఆపద్బంధుడు. దూపలి (అలసటచెంది) తలచినా (యెక్కడున్నావురా, రావేమిరా అనినా) ఆ నామస్మరణే దోషములను హరిస్తుంది.

ఇతడు గరుత్మంతునిపై నెక్కిన రేవంతుడు (రౌతు). గరుడధ్వజము కలిగిన రథము నధిరోహించు దేవదేవుడు. తనకు గరుడడే గరియగు(వాడియైన) బాణము. మహిమతో ఈతడే పో! ఘనగారుడము (ఘనమైన మరకత మణి).

పాముపరపు (శేషతల్పము) పై పడుకొనే సిద్ధయోగి ఇతడే. నాగబంధములను నిర్మూలించే శేషాచలపతీ ఇతడే. పామున (వాసుకితో) అమృతమునకై దచ్చిన (మధింపజేసిన) ఆదికూర్మమూ ఇతడే. అసంఖ్యాకముగా ద్వేషమను విషమును హరింప జేసే విషహారుడు ఈ వృషభాచలపతియే.

కమలనయనుడు వీడే. కమలనాభుడైన విష్ణువూ వీడే. కమలాదేవి (శ్రీదేవికి) కైవశమైనదీ ఈ శ్రీహరియే. మనకు అమరిన శ్రీవేంకటేశ్వరుడూ ఇతడే. మాకు "ఓం నమో వేంకటేశాయా" అనేదే సాటిలేని మమతల మంత్రౌషధము.

**సంఖ్య : 382 సంపుటము : 2 పుట : రాగం : గుజ్జరి**

పల్లవి: ఆర్తుఁడ నేను నీకడ్డ మెందును లేదు
మూర్తిత్రయాత్మక మొగిఁ గరుణించవే

చ. 1: సర్వసాక్షివి నీవు సర్వాంతరంగుఁడవు
సర్వసర్వంసహాచక్రవర్తి
నిర్వాణమూర్తి నిగమాంతకీర్తి
సర్వాపరాధములు క్షమియింపవే

చ. 2: పరమాత్ముఁడవు నీవు పరంజ్యోతివి నీవు
పరమ పరానంద పరమపురుషా
కరిరాజవరదా కారుణ్యనిలయా
శరణాగతుఁడ నన్ను సరిఁగావవే

చ. 3: అణువులోపలి నీవు ఆదిమహత్తును నీవు
ప్రణుత శ్రీవేంకటప్రచురనిలయా
అణిమాదివిభవా ఆద్యంతరహితా
గణుతించి నాపాలఁ గలుగవే నీవు

**అవతారిక :**

అన్నమయ్య "ఆర్తి" రూపు దిద్దుకొన్నట్లు పరమాత్ముని అర్థిస్తున్నారు. ఇంత ఆర్తితో వేడుకొంటే శిలలే కరుగుతాయి. మరి కరిగిపోయే కరుణాంతరంగుడు కరుగడా? అందుకనే ఎదురుకోలుతో అన్నమాచార్యుని వైకుంఠానికి తీసికొని వెళ్ళాడు. మరి ఇటువంటి కీర్తన విని కరుగని వారుంటారా?

**భావదీపిక :**

ప్రభూ! నీకెందును అడ్డులేదు కదయ్యా? నేను ఆర్తుడను దీనుడను అని నీవెరుగవా? మూర్తిత్రయాత్మక (త్రిమూర్తుల స్వరూపుడవైన స్వామీ! మొగి (పూని) నన్ను కరుణించవయ్యా!

నీవు సర్వ సాక్షివి. సర్వుల ఆత్మలలో నుండే నిన్ను మించినవారు సృష్టికంతటికి సర్వసర్వం సహా చక్రవర్తివి. నిన్ను మించినవారు లేరు. నీవు నిర్వాణమూర్తివి (ముక్తిప్రదాతవు). వేదవేదాంతములు కీర్తించువాడవు. నా సర్వాపరాధములను క్షమియించవయ్యా!

నీవు పరమాత్ముడవు, పరంజ్యోతివి (ఉత్కృష్టమైన జ్యోతిస్వరూపుడవు). పరమపదమున నున్న ఆనంద స్వరూపుడవు, పరమపురుషుడవు, గజేంద్రరక్షకుడవు, కరుణ నిలయమైవున్న కరుణామూర్తివి. నేను నీ శరణాగతుడనయ్యా! నన్ను సరిజేసి రక్షించవయ్యా!

నీవు అణువులో ఇమిడివున్న శక్తివి. ఆది నుండి వున్న మహత్తువు కూడా నీవే. ప్రణుతించబడెడి శ్రీవేంకట నగముపై, ప్రచురనిలయా(అధికంగా వుండువాడా) అణిమాది విద్యలకెల్ల వైభవమైన స్వామీ! నీవు ఆద్యంతములు లేనివాడవు. నన్ను యెన్నుకొని నా పాల నుండుము తండ్రీ!



**సంఖ్య : 193 సంపుటము : 2 పుట : రాగం : దేసాళం**

పల్లవి: ఇందరి బ్రదుకులును యీశ్వరుని చేతి వే
యెందూ సుజ్ఞానులునిన్నే యెఱిఁగి కొలిచిరి

చ. 1: నినుఁ గనుఁగొనలేక నీచేఁత దెలియక
మనుజులదృష్టమని మది నెంతురు
అనిశము నీసృష్టి యిట్లని నిశ్చయించరాక
తనరఁ గొందరు తమతమ కర్మ మందురు

చ. 2: మహి నీలీల లెంచక మహిమలు దెలియక
బహుగతి జగత్తు స్వభావ మందురు
నిహితమై నీ వింతటా నిండుకుండుట చూడక
తహతహఁ గొందరు యింతా మిథ్య యందురు

చ. 3: భావములోన నిన్ను భావించ వసముగాక
ఆవల నిరాకారమని యందురు
శ్రీవేంకటేశ నీవు చేరి యెదుట నుండఁగా
దేవుఁడు మనవాఁడుగా తెలిసితి మందురు

**అవతారిక :**

అన్నమయ్య ఈ కీర్తనలో యేమంటున్నారో వినండి. ఎక్కడనున్నా సుజ్ఞానులు ఈశ్వరుని తెలిసికొని కొలిచెదరు. అందరి బ్రతుకులూ ఆయనవే అని వారెరుగుదురు. కొందరు అదృష్టం అంటారు, కొందరు కర్మమంటారు, కొందరు మిథ్య అంటారు, కొందరు నిరాకారుడు అంటారు. శ్రీవేంకటేశుని మాత్రం సాకారదేవుడని మొక్కుతారు.

**భావదీపిక :**

అందరి బ్రతుకులు ఈశ్వరుని చేతిలోనివే. ఎక్కడ వున్నప్పటికీ సుజ్ఞానులు ఈ సత్యం యెఱిగిన వారై నిన్నే కొలిచెదరు.

స్వామీ! మానవులు నిన్ను కనుగొనలేక నీ చేతలు తెలియ లేక అంతా అదృష్టం అని తమ మనస్సులో భావిస్తారు. ఎల్లప్పుడూ నీ సృష్టి ఇలా వుంటుందని నిశ్చయించలేక అతిశయించి కొందరు తమ తమ కర్మము అని అంటారు.

ఈ భూమిపై నీ లీలలు గ్రహించలేక నీ మహిమ నెరుగక ఈ జగత్తు ఎన్నో వింత స్వభావాలను కలిగియున్నది. అందుకే అట్లా జరిగిందని కొట్టిపారేస్తారు. నిహితమై (ఉంచబడినవాడవై) నీవు అంతటానిండి వుండగా అది చూడలేక తహతహ లాడతారు. అంతేకాక జగమంతా "మిథ్య" అంటారు.

నిన్ను తమ భావనలో భావించ వారి వశము గాక అటుపై పరమాత్ముడు నిరాకారుడంటారు. కొందరు జ్ఞానులు శ్రీవేంకటేశ్వరా! నీవు మా యెదుటనేవుండగా చూచి, అవును దేవుడు మనవాడుగా తెలిసితిమి అంటారు.

**సంఖ్య : 379   సంపుటము : 1   పుట : 273   రాగం : రామక్రియ**

పల్లవి: ఇందిరా నాయక యిదివో మాపాటు
చెంది నీవే గతి చేకొనవయ్యా
చ. 1: తీసీఁ గోరికతీదీపు లొకవంక
లాసీ సంసారలంపటము
మూసీఁ గర్మము మునుకొని పరచింత
సేసేదేమిఁకఁ జెప్పే దేమి
చ. 2: వంచీ నాసలు వలసినచోటికి
పొంచీ దుర్గుణబోగములు
ముంచీ యౌవనమోహాంధకారము
యెంచేదేమి సోదించేదేమి
చ. 3: యెఱిఁగీఁ జిత్తము యించుకించుక నిన్ను
మఱవనినీపైభక్తి మతినుండఁగా
నెఱి శ్రీవేంకటపతి నీవే కాతువుగాక
వెఱచి నేఁజేసే విన్నపమేమి

**అవతారిక :**

ఇందిరానాయకుడైన శ్రీవేంకటేశ్వరుని అభ్యర్థిస్తున్నారు అన్నమయ్య. మాపాటు చూడవయ్యా! నీవేమాకున్న దిక్కు. మమ్ముచేకొనవయ్యా! అంటున్నారు. మా కోరికలు, లంపటాలు, కర్మఫలాలు, దుర్గుణాలు, యౌవనమోహాంధకారం మమ్మల్ని వేపుకుతింటుంటే నీపై మనస్సు, భక్తి యేలనిలుస్తాయి స్వామీ?

**భావదీపిక :**

ఓ ఇందిరానాయకా! ఇదిగో మాపాటు (తిప్పలు). చెంది (వహించి) నీవేగతివి. మమ్ముచేకొనవయ్యా! (ఆదుకోవయ్యా!).

ఒకవంక మా అంతులేని కోరికలే తీదీపులై (మిక్కిలి బాధాకరములై) తీసి (వేదిస్తున్నాయి). మా సంసార లంపటములు లాసీ (నృత్యంచేస్తున్నాయి). మాపురాకృత కర్మము ఆవహించి పరముపై కోర్కె నిర్మూలిస్తున్నది. ఇకమేము చేసేదేముంది? చెప్పేదేముంది?

"ఆశ" మమ్మల్ని వంచి వలచిన చోటికి పొమ్మంటుంది. భోగముల మాటున దుర్గుణము పొంచివున్నది. యౌవనము మమ్మల్మి మోహాంధకారంలో ముంచి వేస్తున్నది. ఇక మాలో యెంచేదేమున్నది? వెదకి బాగుచేసేదేముంది?

మరి నన్ను రక్షిస్తున్నదేమిటి? నిన్నుయెఱిగిన నా చిత్తము కొద్దికొద్దిగా నీపై మరపురాని భక్తిని మదిలో నిలిపింది. అదివుండుట వలన నీకు నాపై దయకలిగింది. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇక నన్ను నీవే రక్షించుకొంటావు. ఇంకా నేను భయంతో చేయాల్సిన విన్నపమేమిటి తండ్రీ?



**సంఖ్య : 494   సంపుటము : 1   పుట : 331   రాగం : ముఖారి**

పల్లవి: ఇందిరాపతిమాయలు యింతులు సుండీ
మందలించి హరిఁ గొల్చి మనుదురుగాని
చ. 1: అతివలచూపులే ఆయాలు దాఁకీఁ జుండీ
జితమైనపులకలఁ జిల్లులౌఁజుండీ
రతిపరవశములు రాఁగినమూర్ఛలు సుండీ
మతిలోఁ దప్పించుక మనుదురుగాని
చ. 2: మెఱయించేచన్నులే మించుఁబెట్లుగుండ్లు సుండీ
మెఱుఁగుమోవులే మచ్చు మేపులు సుండీ
మఱి మంచిమాటలు మాయపుటురుల సుండీ
మఱవక తప్పించుక మనుదురుగాని
చ. 3: బలుసంసారపుపొందు పాముతోడిపొత్తు సుండీ
వెలలేనివలపులు విషము సుండీ
యెలమితో శ్రీవేంకటేశ్వరుమఱుఁగు చొచ్చి
మలయుచు సొలయుచు మనుదురుగాని

**అవతారిక :**

అతివల వల్ల జరిగే అనర్ధాలను వివరిస్తున్నారు అన్నమయ్య. ఆయన స్త్రీద్వేషి అనియో లేక పురుషాధిక్యాహంకారియో అని పొరబడకండి. అయన ప్రపంచపు నడవడిని బట్టి హితవు చెబుతున్నారు. నిజం తియ్యగా యెప్పుడూవుండదు. మరి ఈ సమస్యకు పరిష్కారం యేమిటి?

**భావదీపిక :**

ఓ మానవులారా! ఇంతులు (స్త్రీలు) ఇందిరాపతి యొక్క "మాయలు" సుమా! మందలించి (సరిదిద్దుకొని) శ్రీహరిని కొలిచి జీవించెదరుగాక!

అతివల చూపులున్నాయే అవి ఆయాలు (సున్నితమైన మూలలను) తాకుతాయి. ఒంటిపై పులకలు గుండెల్లో చిల్లులు. వాళ్ళు కల్పించే రతి పారవశ్యములు రేగిన మూర్ఛలు. వాళ్ళ మనుగడే పురుషులకు మతి దప్పించటం సుమా!

తళుక్కున మెరిపించే స్త్రీల చన్నులు కట్టిపడవేసే "గుండ్లు" మెరుగులున్న అధరములు మరులు కలిగించే మందులు. వారి మంచి మాటలు దాగి తగులుకొనే ఉరితాళ్లు. అయ్యా! మీరు ఇది మరువక తప్పించుకొని వుండెదరుగాక!

స్త్రీతో సంసారము పొందు పాముతో పొత్తుపెట్టుకొనుట వంటిది. వాళ్లు చూపించే అమితమైన వలపు విషము సుమా! అయితే హరిదాసులు శ్రీవేంకటేశ్వరుని మఱుగున చేరి మలయుచు సొలయుచు (ఉత్సాహంగా ఉల్లాసంగా) మనుదురుగాని (ఉంటారుగాని).

**సంఖ్య : 31 సంపుటము : 2 పుట : 21 రాగం : శంకరాభరణం**

పల్లవి: ఇందుకేపో వెరగయ్యీ నేమందును
కుందులేని నీమహిమ కొనియాడఁగలనా
చ. 1: అటు దేవతల కెల్ల నమృతమిచ్చిన నీవు
యిటు వెన్నదొంగిలుట కేమందును
పటుగతి బలీంద్రుని బంధించినట్టి నీవు
సట రోలఁ గట్టువడ్డ చందాన కేమందును
చ. 2: కలిగి యాకరిరాజుఁ గరుణఁ గాచిన నీవు
యిల నావులఁ గాచుట కేమందును
తలప బ్రహ్మాదిదేవతలకుఁ జిక్కని నీవు
చెలుల కాఁగిళ్లకుఁ జిక్కితి వేమందును
చ. 3: భావించ నన్నింటికంటేఁ బరమమూర్తివి నీవు
యీవల బాలుఁడవైతి వేమందును
కావించి బ్రహ్మాండాలు కడుపున నిడుకొని
శ్రీవేంకటాద్రి నిలిచితి వేమందును

**అవతారిక :**

ఈ కీర్తనను నేటి తెలుగులో వూహిస్తే తికమక వుంటుంది. అన్నమయ్య పల్లవిలోనే కీర్తన గురించిన విశేషము గుంభనంగా చెబుతారు. పోవయ్యా! అందుకే నాకు ఆశ్చర్యం కలుగుతుంటుంది. ఏమందును నేను? తక్కువకాని నీ మహిమను నేనుకొనియాడగలనా? నేను చెబుతాను, నీవే విను.

**భావదీపిక :**

అయ్యా! ఇందుకే పో! నాకు వెరగయ్యీని (ఆశ్చర్యం కలుగుతుంది). ఏమందును (నేనేమి అనగలను?) కుందులేని (తక్కువకాని) నీ మహిమలను కొనియాడగలనా? లేను.

ఆనాడు దేవతలందరికీ అమృతం పంచి పెట్టావు. ఈ నాడు రేపల్లెలో వెన్న దొంగిలించావు. దీనికేమి చెప్పను? పటుగొని (పట్టుకొని) బలిచక్రవర్తిని నీవు నాగపాశాలతో బంధించావు. యశోదతో రోటికి కట్టివేయబడ్డావు. నీ చందానికి (పద్ధతికి) యేమందునయ్యా?

ఆనాడు గజేంద్రునిపై కరుణతో పరుగుపరుగున వెళ్లి రక్షించిన గరుడవాహనుడవు, బృందావనంలో ఆవులను కాచావు. బ్రహ్మాదిదేవతల మనస్సులకైనా చిక్కని నీవు గోపికల కౌగిళ్ళకు చిక్కావు. దీనికేమనగలను?

నీవు భావించి చూస్తే పరమాత్మవు. కాని ఇప్పుడు బాలుడవై ఆడుకొంటున్నావు. దీనికేమందును? కావించి (తగినట్లు) చతుర్దశ భువనాలను నీ కడుపులోవుంచుకొన్న విశ్వరూపుడవు. ఈ తిరుమల శ్రీవేంకటాద్రిపై నిలిచావు. దీనినియేమనగలనయ్యా?



**సంఖ్య : 171 సంపుటము : 2 పుట : రాగం : ముఖారి**

పల్లవి: ఇదియే బుద్ధి నాకు నింతకంటే మతిలేదు
కదిసి నీబంటనంటే కాతువు నన్నును
చ. 1: నేరచి నడచేనంటే నేఁ గాను స్వతంత్రుడఁను
నేరమి చేసేనంటే నిందును దూరు
యీరెంటికిఁ గాక నేను యిట్టె నీకు శరణంటే
గారవించి వహించుక కాతువు నన్నును
చ. 2: వొక్కచో నర్థ మర్జించుకుందితే జన్మాలు పెక్కు
యెక్కేనంటే మోక్షము యేడో యెఱఁగ
యెక్కడి సుద్దులునేల యిచ్చుట నీనామము
గక్కనఁ బేర్కొంటేఁ దయఁ గాతువుగా నన్నును
చ. 3: తపసినయ్యేనంటేఁ జిత్తము కైవశము గాదు
చపలసంసారినైతే శాంతి యుండదు
ఉపమలేల శ్రీవేంకటోత్తమ నీసేవ చేసి
కపటము మానితేను కాతువు నన్నును

**అవతారిక :**

తనకు ఇంతకంటే జ్ఞానము అవసరంలేదు అంటున్నారు అన్నమయ్య. స్థిరచిత్తముతో నీ బంటునైతే నీవే నన్ను కాపాడెదవు కదా! అంటున్నారు. తపస్సు చేయాలంటే మనస్సు స్వాధీనంలో వుండదు. సంసారినైతే శాంతి కరవవుతున్నది. స్వామీ! నిష్కపటంతో నీ శరణంటే నీవే కావాడతావు కదా! అంటున్నారు.

**భావదీపిక :**

ప్రభూ! నాకు ఇదియే బుద్ధి (జ్ఞానము). నీ శరణు అంటే చాలుకదా? నీ బంటునైతే నీవే రక్షిస్తావు కదా! ఇంతకంటే గొప్ప జ్ఞానం మరిలేనే లేదయ్యా!

నేరచి (నేర్పుతో) నడచుకొందామంటే నేను స్వతంత్రుడను కాకపోతిని. నేరం చేస్తే దూరు (నిందలు) భరించక తప్పదు. నాకు ఈ రెండూ వద్దని నిన్ను శరణు అంటిని. కాబట్టి నను ఆదరించి నీవే కాపాడెదవు.

ఒక్క సారిగా బోలెడు ధనం సంపాదిద్దామంటే అనేక జన్మల నెత్తవలసి వస్తే నా గతేమిటి? పోనీ యెక్కేనంటే (ముక్తిబాట పట్టెదనంటే) మోక్షము యెక్కడవున్నదో తెలియదు. అనంతములైన నీ కథలను యెన్నని వినను? నీ నామ సంకీర్తన చేస్తే నీవే దయ చూస్తావు కదా!

పోనీ తపస్సుజేసి నిన్ను మెప్పిద్దామంటే నా మనస్సు నా వశములోవుండదు. మనశ్శాంతి పొందుదామంటే అనేక రుచులు గల సంసారినైతిని. ఓ శ్రీవేంకటేశ్వరా! ఉపమలేల (ఇతర ఉపాయములెందుకు?) కపటము మాని నీ సేవచేస్తే నీవే రక్షిస్తావు కదా!

**సంఖ్య : 367 సంపుటము : 1 పుట : 245 రాగం : శ్రీరాగం**

పల్లవి: ఇన్ని జన్మము లేఁటికి హరిదాసు-
లున్న వూరఁ దా నుండిను జాలు
చ. 1: హరిభక్తుల యింటియన్నము గొనువారి-
వరు(ర)వుడై వుండవలెనన్నఁ జాలు
పరమభాగవత భవనంబులఁ జెడ్డ
పురువు దానయి పొడమినఁ జాలు
చ. 2: వాసుదేవుని భక్తవరులదాసులు మున్న-
రోసినయెంగిలి రుచిగొన్నఁ జాలు
శ్రీ సతీశునిఁ దలచినవారి దాసాన-
దాఁసుడై వుండఁదలుచినఁ జాలు
చ. 3: శ్రీ వేంకటేశుఁ జూచినవారిశ్రీ పాద-
సేవకుఁడై యండఁజేరినఁ జాలు
యీవిభుదాసుల హితుల పాదధూళి-
పావనమై సోఁకి బ్రదికినఁ జాలు

**అవతారిక :**

పురాకృత కర్మ వలన జన్మకలుగుతుంది. జీవుడు ఈ చక్రబంధం నుంచి తప్పించుకోలేడు. శ్రీహరి మాయలో జిక్కి ఈ రొంపిలో పొర్లుతూనేవుంటాడు. హరిదాసుడైన వాని నాశ్రయిస్తే ఇన్ని జన్మలు అనవసరం అంటున్నారు అన్నమయ్య. హరిదాసులున్న వూరిలో తానుండినా చాలును అంటున్నారు. ఇంకా ... వినండి మరి.

**భావదీపిక :**

పునరపి జననం, పునరపి మరణం వలన ప్రయోజనమేమి? హరిదాసులున్న వూరిలో తానువుండి వారిని సేవించిన చాలదా? ఆ సేవ జన్మరాహిత్యాన్నిస్తుంది.

హరిభక్తుల ఇంటిలో అన్నము తినేవారి వరవుడై (దాసియై) వుండవలెనంటే అది చాలదా? పరమభాగవతుల ఇండ్లలో చెదపురుగుకైనా నిరంతర హరినామస్మరణ వినుటవలన ముక్తి లభిస్తుంది. తనకు అది చాలదా?

వాసుదేవుని భక్తులు తింటున్న దానిపై 'రోసి' ఇక చాల్లే అని వదలివేసిన యెంగిలి రుచిచూచిన చాలదా? శ్రీ సతీశుడైన విష్ణుని ధ్యానించేవారి దాసానుదాసులై (దాసులకు దూసులై) వుండాలని కోరుకుంటే అది చాలదా?

శ్రీవేంకటేశుని నిత్యమూ ఇన్ని వేలమంది దర్శిస్తుంటారు. వారిలో శరణాగతుడొక్కడున్నా చాలు. వాని శ్రీపాదసేవకుడైవుంటే చాలు ముక్తి లభిస్తుంది. ఈ జగన్నాథుని దాసులకు హితులైన వారి యొక్క పాదధూళి కూడా పవిత్రమైనదే. దానిని సోకి బ్రతికిన చాలదా? ముక్తికి త్రోవ అదే కదా!



**సంఖ్య : 492 సంపుటము : 1 పుట : 330 రాగం : సామంతం**

పల్లవి: ఇహమునుఁ బరమును యిందే వున్నవి
వహికెక్కఁ దెలియువారలు లేరు
చ. 1: చట్టువంటి దీచంచలపు మనసు
కొట్టులఁబడేది గుతిగాదు
దిట్ట వొరులు బోధించినఁ గరఁగదు
పట్టఁబోయితే పసలేదు
చ. 2: చిగురువంటి దీజీవశరీరము
తగుళ్లు పెక్కులు తతి లేదు
తెగనిలంపటమే దినమునుఁ బెనచును
మొగము గల దిదే మొనయును లేదు
చ. 3: గనివంటిది యీఘనసంసారము
తనిసితన్పినాఁ దగ లేదు
ఘనుడఁగు శ్రీవేంకటపతి గావఁగ
కొనమొద లేర్పడె కొంకే లేదు

**అవతారిక :**

ఇహమున సుఖము పరమున మోక్షము అని భావిస్తుంటారు. కాని ఆ రెండూ భూమి మీదేవున్నాయి. కాని ఈ లెక్క తెలిసిన వారే లేరు అంటున్నారు అన్నమయ్య. శ్రీవేంకటేశుడు కాపాడబట్టి ఈ సంసారానికి మొదలు చివరా తెలిశాయి. లేకపోతే...?

**భావదీపిక :**

ఓ మానవులారా! ఇహము నందు సుఖము, పరము నందలి మోక్షము ఇందే (ఈ భూమిపైనే) వున్నవి. దీనిని మాకెక్కన్ (లెక్కించినట్లు) తెలిసినవారే లేరు.

ఈ చంచలమైన మనస్సు 'చట్టు' (చిన్నముంత) వంటిది. కొట్టులబడేది (దెబ్బతినేది). అందుకని అది సరియైనదికాదు. పరులు దానికి దిట్టముగా బోధించినా అది కరగదు. పోనీ దానిని పట్టివుంచుదామంటే సాధ్యం కాదు.

ఈ జీవుని శరీరము 'చిగురు' వంటిది. మరి ఈ లేతకొమ్మకు అనేకమైన తగుళ్ళు (రోగాలు) తతిలేదు (ఆనందము నెరుగదు). ప్రతి రోజు ఈ జీవుడికి వ్యర్థమైన లంపటాలే పెనవేసికొనిపోయిన దీనికి ఆరంభం వున్నది. కానీ, అంతము లేనేలేదు.

ఈ ఘనమైన సంసారము వున్నదే, ఇది 'గని' వంటిది. తనిసి తన్పినా (తృప్తిచెంది, తృప్తి పరచటం) తగలేదు (యుక్తమైన అలవాటు దీనికి లేదు). ఘనుడైన శ్రీవేంకటేశ్వరుడు దీనిని రక్షించగా ఈ జీవుని సంసారానికి కొనమొదలేర్పడే (ఆది అంతము) తెలిశాయి. ఇక కొంకేలేదు (లోటురాదు).

**సంఖ్య : 98 సంపుటము : 1 పుట : 67 రాగం : సామంతం**

పల్లవి: ఎంత చేసిన తనకేది తుద
చింత శ్రీహరిపైఁ జిక్కుటే చాలు
చ. 1: ఎడపక పుణ్యాలెన్ని చేసినాఁ
గడమే కాకిఁ కఁ గడ యేది
తడఁబడ హరియే దైవమనుచును మది
విడువక వుండిన వెరవే చాలు
చ. 2: యెన్నితపము లివి యెట్లు జేసినా
అన్నువ కధికము కలవేది
వన్నెలఁ గలఁగక వనజాక్షునిపై
వున్న చిత్తమది వొక్కటే చాలు
చ. 3: యిందరివాదము లెట్ల గెలిచినా
కందే గాకిఁక గరిమేది
ఇందరినేలిన యీ వేంకటపతి
పొందగు మహిమల పొడవే చాలు

**అవతారిక :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన పల్లవి నాకు అన్వయించి చెప్పుకోవాలంటే... ఎన్ని కీర్తనలు విశ్లేషించినా దీనికి అంతు యెక్కడుంది? శ్రీహరిపైన ధ్యాస నిలిచిందంటేచాలు. హరిధ్యాస లేక ఇంకేదైనా నిరుపయోగమే. అన్నట్లు "అన్నువ కధికము కలవేది" అనే చరణాన్ని అన్నువకు+అధికముకు+అలవి+ఏది" అని విడదీస్తే కాని అర్థంకాదు.

**భావదీపిక :**

తనకు (జీవుడికి) యెంతచేసినా (యెన్ని పుణ్యాలు, తపములు, వాదములు చేసినా) తుదియేది? (అంతెక్కడుంది?). శ్రీహరిపైన చింత (ధ్యాస) చిక్కుటేచాలు (పట్టుబడితే చాలుకదా!).

ఎడపక (యెడతెగక) యెన్ని పుణ్యకర్మలు చేసినా కడమేకాక (కొఱతేకాని) కడయేది (అంతమెక్కడుంది?) తడబడినప్పుడు శ్రీహరియే నా దైవమని మనస్సులో విడువక చేబూనిన వెరవేచాలు (ఉపాయము చాలుకదా!)

ఎన్నితపములను యెంత కఠిన నిష్ఠతో చేసినా అన్నువకు (అల్పత్వానికి) అధికముకు (ఆధిక్యానికి ) అలవియేది (కొలది యెక్కడుంది?) వన్నెచిన్నెలకు భ్రమించక వనజాక్షుడైన శ్రీహరిపై ఆ చిత్తము వున్నచో అదొక్కటేచాలు.

ఇందరి వాదములు (అందరిని వాదములో) యెట్ట గెలిచినా (యెన్ని విధాలుగా జయించినా), కందేగాక (ఉద్రేకంతో తపించిపోవటమే కాని) గరిమయేది (ఔనత్యం యెక్కడ వున్నది? లక్ష్మీదేవిని యేలుకొనిన శ్రీవేంకటేశ్వరుడు చూపే పొందికైన మహిమల పొడవు (అతిశయమే) చాలుకదా! తక్కినవన్నీ యెందుకు?



**సంఖ్య : 216 సంపుటము : 5 పుట : 147 రాగం : ముఖారి**

పల్లవి: ఎండలు రేయెండలుగా నిరువంకఁ జూచువాఁడు
కొండలుఁగోట్లునయిన గుణములవాడు
చ. 1: పాలవెల్లి కొండమీఁదఁ బల్లెగట్టినవాఁడు
పాలలోని పాపఁడన్న ప్రాణమైనవాఁడు
పాలఁబుట్టినట్టికూడు పంచిపెట్టినవాఁడు
పాలునేయి ముచ్చిలించి బదికినవాఁడు
చ. 2: ఆలపోతువానితోడ నంటినమేనివాఁడు
ఆలఁగాపరులతోడ నాడినవాఁడు
ఆలజాలమైన నీటనలరఁ దేలినవాఁడు
ఆలపోతు కొండమీఁద నను వైనవాఁడు
చ. 3: పాఁపరేని మేను దన పాను పు సేసినవాఁడు
మోఁపరయి సకలము మోచినవాఁడు
కోపము శాంతములేని కొండలకోనేటివాఁడు
పాపముఁ బుణ్యము లేక బదికినవాఁడు

**అవతారిక :**

నేను ఇదివరలో ప్రయత్నించి, ఆనాడు సాధ్యం కాక వదలిపెట్టిన అన్నమయ్య కీర్తన ఇది. తెలుగు తేలిక అనుకొనే తెలివిలేని తులువలకు "తెలుగదేలయన్న దేశంబు తెలుగేను" అన్న శ్రీకృష్ణదేవరాయలను గుర్తు తెచ్చే తెలివైన కీర్తన ఇది. దీనినింత కంటే వివరించే తెలివి నాకు లేదని మీకీపాటికి తేలికగా తెలిసిపోయేవుండాలి.

**భావదీపిక :**

ఈస్వామి, యెండలు (సూర్యుడు) రేయెండలు (చంద్రుడుగా) రెండువైపులా చూచువాడు. కోట్లాది సమున్నతమైన గొప్ప గుణములున్న దేవదేవుడీతడే.

పాలవెల్లి కొండవున్న శ్వేతద్వీపం మీద పల్లెగట్టినవాడు (నివాసమున్నవాడు). పాలలో పాపడన్న (వెన్న అంటే) ప్రాణమైనవాడు. పాలపుట్టిన కూడు (అమృతం) పంచిపెట్టిన మోహినియైనవాడు. పాలునెయ్యి దొంగిలించిన కృష్ణయ్యయైనవాడు ఇతడే.

ఆలపోతువాని (వృషభాసురుని) తోడ అంటినమేని వాడు (బలరామావతారుడు) ఆవులను కాచే గొల్లలతో ఆడుకొన్నవాడు. ఆలజాలమైన నీట (సాగరతరగలలో) మఱ్ఱి ఆకుపై తేలిన శిశువు. ఆలపోతుకొండ (వృషభాద్రి మీద) అనువుగావున్న ఏడుకొండలవాడు.

పాపరేని (ఆదిశేషుని) మేను తన పాన్పు అయినవాడు. మోపరయి (భారం వహించి) పొట్టలో భువనాలు మోస్తున్నవాడు. కోపమూ శాంతములను గుణాతీతుడైన శ్రీవేంకటేశ్వరుడు. పాపపుణ్యరహితునిగా బ్రతికిన దేవదేవుడు.

**సంఖ్య : 32 సంపుటము : 1 పుట : 21 రాగం : గుండక్రియ**

పల్లవి: ఎంతటివారలు నెవ్వరును హరిఁ
జింతిచక నిశ్చింతులు గారు
చ. 1: అతిజితేంద్రియులు ననశనవ్రతులు-
నతుల తపోధనులగువారు
చతురానన గురుస్మరణము దొరకక
తతి నూరక పుణ్యతములు గారు
చ. 2: అనఘులు శాంతులు నధ్యాత్మతతులు
ననుపమ పుణ్యులు యాజకులు
వనజోదరు ననవరతముఁ దలుచక
వినుతి స్మృతికిని విభుదులుగారు
చ. 3: దురిత విదూరులు దుర్మతిహీనులు
నిరతానందులు నిత్యులును
తిరువేంకటగిరిదేవుని గొలువక
పరమార్గమునకు బ్రహ్మలు గారు

**అవతారిక :**

హరి భక్తిలేనిదే యెంతటివారికైనా నిశ్చింత కలుగదు అంటున్నారు అన్నమయ్య. నిశ్చింతలేకపోతే, ఇంద్రియనిగ్రహం లేక పుణ్యసాధన జరుగదు. శాంతులు కానివారు సోమయాజులైనా లాభంలేదు. ఎల్లప్పుడు హరిని స్మరించకపోతే యెంత వేదం చదివినా నిరుపయోగమే. వేంకటపతి దయలేక బ్రహ్మత్యమే రాదు అంటున్నారు.

**భావదీపిక :**

ఎంతటివారలైనా, యెవ్వరైనా శ్రీహరిని ధ్యానించక నిశ్చింతులు (ఆశావిరహితులు)కారు, కాలేరు. ఎంతో జితేంద్రియులైనా, అనిశనవ్రతులు (ఎల్లప్పుడు వ్రతదీక్షాపరులు), సాటిలేని తపోధనులు, అయినాకానీ చతుర్ముఖబ్రహ్మ తండ్రి శ్రీహరిని స్మరించక వూరకనే పుణ్యతములు కాలేరు.

అనఘులు (పాపరహితులు), శాంతమూర్తులు, ఆధ్యాత్మచింతనాదక్షులు, సాటిలేని పుణ్యాత్ములు అనేక యజ్ఞములు చేసిన యాజకులు అయినాసరే, నళిననాభుని నిరంతరమూ స్మరించక హరిని స్తుతించే వేదములను ఆకళింపుజేసుకొనజాలరు.

చెడ్డపనుల దరికి చేరని దుర్మతిహీనులు (చెడు బుద్ధిలేనివారు) నిరంతరము ఆనంద స్వరూపులైన నిత్యులు, బ్రహ్మత్వాన్ని పొందగలరా? వారు తిరువేంకటాధీశుని కొలువనివారైతే పరమార్గపు చింతరానేరాదు. ఇకవారు బ్రహ్మలెల అవుతారు? కానే... కారు.



**సంఖ్య : 181 సంపుటము : 1 పుట : 121 రాగం : ధన్యాసి**

పల్లవి: ఎంత విభవము గలిగె నంతయును నాపదని
చింతించినది గదా చెడనిజీవనము
చ. 1: చలముఁ గోపంబుఁ దనుఁ జంపేటిపగతులని
తెలిసినది యదిగదా తెలివి
తలకొన్నపరనింద తనపాలి మృత్యువని
తొలఁగినది యదిగదా తుదగన్నఫలము
చ. 2: మెఱయు విషయములే తనమెడనున్నవురులుగా
యెఱిఁగినది యదిగదా యెరుక
పఱివోనియాస దనుఁ బట్టుకొను భూతమని
వెఱచినది యదిగదా విజ్ఞానమహిమ
చ. 3: యెనలేని తిరువేంకటేశుఁడే దైవమని
వినఁగలిగినది గదా వినికి
అనయంబు నతని సేవానందపరులయి
మనఁగలిగినదిగదా మనుజులకు మనికి

**అవతారిక :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో మానవునికి యెంత వైభవము కలుగుతుందో దాని వెన్నంటే అంత ఆపదకూడా వుంటుంది. ఇది గ్రహిస్తేనే గదా! చెడని జీవితము గడుపగలుగుతాడు అంటున్నారు. ఈ కీర్తన విని కనీసం ఒక్కరన్నా మనుజుని "మనికి" గడిపితే, అన్నమయ్య ద్వారా నా కృషి ఫలించినట్లే.

**భావదీపిక :**

ఓ మానవులారా! మనిషికి యెంత విభవము (వైభవం) కలిగెనో, అంతటి ఆపదకూడా దాని వెన్నంటి వుంటుంది. వానికి చెడులేని జీవనము అట్లా చింతిస్తేనే దొరుకుతుంది.

మనిషికి నిజమైన తెలివియెప్పుడంటే చలము (మొండిపట్టు), కోపము తనను చంపేటి పగవారని తెలిసినప్పుడే వాడికి తుదగన్న ఫలము (చిట్ట చివరి సత్ఫలితము), తానుచేసిన "పరనిందయే" తనపాలి మృత్యువని దానినుంచి తొలగినప్పుడే కలుగుతుంది.

నిజమైన యెఱుక (జ్ఞానము) యెప్పుడు వస్తుందంటే పైకి మెరిసే విషయవాంచలే తన మెడకు చుట్టుకొన్న వురులు అని తెలియుటయే. అంతులేని ఆశయే తనను పట్టుకొన్న భూతమని దానికి భయపడటమే నిజమైన విజ్ఞానము.

శ్రీవేంకటేశ్వరుడే సాటిలేని దైవము అని వినగలిగినదే నిజమైన వినికి (వేదము). అనయంబు (యెల్లప్పుడు) అతని సేవలో ఆనందం పొందగలవారగుటయే మానవునిగా జీవించటం అంటే. ఇప్పుడాలోచించండి, మనం మనుష్యులమా?

**సంఖ్య : 138 సంపుటము : 1 పుట : 212 రాగం : సామంతం**

పల్లవి: ఎక్కువ కులజుఁడైన హీన కులజుఁడైన
నిక్కమెరిఁగిన మహా నిత్యుఁడే ఘనుఁడు

చ. 1: వేదములు చదివియును విముఖుఁడై హరిభక్తి
యాచరించని సోమయాజికంటె
యేదియునులేని కులహీనుఁడైనను విష్ణు
పాదములు సేవించు భక్తుఁడే ఘనుడు

చ. 2: పరమగువేదాంతపఠన దొరికియు సదా
హరిభక్తిలేని సన్యాసికంటె
సరవి మాలిన యంత్యజాతికులజుఁడైన
నరసి విష్ణునివెదకు నాతఁడే ఘనుఁడు

చ. 3: వినియుఁ జదివియును శ్రీ విభునిదాసుఁడుగాక
తనువు వేఁపుచునుండుతపసికంటె
యెనలేని శ్రీవేంకటేశుప్రసాదాన్న-
మనుభవించినయాతఁ డప్పుడే ఘనుడు

**అవతారిక :**

మానవునికి ఘనతపుట్టుక వలన రాదంటున్నారు అన్నమయ్య. గొప్ప కులమువాడని హీన కులమువాడని యెంచుట అవివేకము. సత్యము నెరిగిన మహానిత్యుడే ఘనుడు. నరులలో హరిభక్తిలేనివాడు సోమయాజి అయితేనేం? వేదాంతి అయితేనేమి? గొప్పతపసి అయితేనేమి? నిజానికి వీళ్ళందరికన్నా శ్రీవేంకటపతి ప్రసాదాన్నము తిన్న వాడే ఘనుడు.

**భావదీపిక :**

ఎక్కువ కులంలో పుట్టినా, తక్కువ కులంలో పుట్టినా ఘనత వస్తుందనుకొంటే పొరబాటే. నిజము దెలిసినచో మహానిత్యుడు (నిత్యము హరినే శరణన్నవాడు) మాత్రమే ఘనుడు.

సోమయాజిగారు యెన్ని వేదాలు చదివినా హరిభక్తియందు విముఖుడై ఆచరించకపోతే వానికంటే యేమీ నేర్వని కులహీనుడైనప్పటికీ విష్ణుపాదములను సేవించే భక్తుడైతే వాడే ఆ సోమయాజులు కంటే ఘనుడు.

గొప్ప వేదాంతి అని పేరు గాంచిన సన్యాసి సదా వేదాంతపఠనము జరిపినప్పటికీ తనకు హరిభక్తిలేకపోతే వానికంటే సరవిమాలిన (తీరుతెన్నూలేని) కడజాతి వాడైనప్పటికీ అతడే విష్ణుని వెదకుటకు పూనుకొంటే ఘనుడవుతాడు.

శ్రీవల్లభుని దాసుడు గాని వాడు ఎంత చదివినా, యెంతవినినా, ఎంతఘోరతపస్సు చేసినా నిరుపయోగమవుతుంది. ఇదంతా వ్యర్థమే. శ్రీవేంకటేశ్వరుని ప్రసాదాన్నం ఆరగించినవాడు తక్షణమే ఘనుడవుతాడు. తక్కిన ఘనతలన్నీ శుద్ధదండుగ.



**సంఖ్య : 502 సంపుటము : 1 పుట : 336 రాగం : పాడి**

పల్లవి: ఎదుట నెవ్వరు లేరు యింతా విష్ణుమయమే
వదలక హరిదాసవర్గమైనవారికి

చ. 1: ముంచిన నారాయణమూర్తులే యీజగమెల్ల
అంచితనామములే యీయక్షరాలెల్లా
పంచుకొన్న శ్రీహరిప్రసాద మీరుచులెల్లా
తెంచివేసి మేలు దాని దెలిసేటివారికి

చ. 2: చేరి పారేటినదులు శ్రీపాదతీర్థమే
భారపుయీ భూమెత నీపాదరేణువే
సారపుఁగర్మములు కేశవుని కైంకర్యములే
ధీరులై వివేకించి తెలిసేటివారికి

చ. 3: చిత్తములో భావమెల్లా శ్రీవేంకటేశుఁడే
హత్తినప్రకృతి యెల్లా నాతనిమాయే
మత్తిలి యీతనికంటే మరి లే దితరములు
తిత్తి దేహపుబ్రదుకు తెలిసేటివారికి

**అవతారిక :**

“అంతా విష్ణుమయం” అని నమ్మిన అన్నమయ్య హరిదాసుల తత్వాన్ని వివరిస్తున్నారు. “నారాయణ” అనే నామంలోని ప్రతి అక్షరము వారికి నారాయణ మూర్తియే. నదులన్నీ ఆకాశగంగరూపాలే మనస్సులో పొడమిన ప్రతి భావము శ్రీవేంకటేశ్వరుడే.

**భావదీపిక :**

హరిదాసునికి యెదుట యెవ్వరూలేరు (కనిపించరు). ఇంతా విష్ణుమయమే (అంతా విష్ణుమయమే). హరిదాసుల వర్గములో జేరిన వారందరి పరిస్థితీ ఇదే సుమండీ!

వారికి ఈ జగమంతా అతిశయించిన నారాయణమూర్తులే, ఏ అక్షరం చూచినా నారాయణ నామమే, ఏ పదార్థం రుచిచూచినా అది శ్రీహరి నివేదించిన ప్రసాదమే. తనకి మేలు, కీడు వొక్కటేయైనవారికి తానే హరికి అని తెలుస్తుంది.

అట్టివారికి భూమిపై పారే నదులన్నీ శ్రీపాదతీర్థమే (ఆకాశగంగయే). ఘనమైన భూమండలమంతా శ్రీహరి పాదరేణువే. అతను కర్మచేసినా శ్రీపతికి కైంకర్యం చేస్తాడు. ధీరులై వివేకముతో సర్వమూ తెలిసిన వారికి ప్రతిదీ హరి నైవేద్యమే.

వారి చిత్తములోయే భావము కలిగినా అందులో శ్రీవేంకటేశ్వరుడుంటాడు. ఈ ప్రకృతి అంతా హరిమాయ వలన సృజించబడినదే. అసలు జీవనగమ్యం తెలిసిన వారికి ఈ దేహము తొమ్మిది రంధ్రములున్న తోలుతిత్తి హరివుంటేనే ఇది “ప్రాణి”. అతను లేక మరెవ్వరూ లేరు.

**సంఖ్య : 74 సంపుటము : 1 పుట : 50 రాగం : రామక్రియ**

పల్లవి: ఎవ్వఁడో కాని యెరఁగరాదు కదు-
దవ్వులనే వుండు తలుపులోనుండు
చ. 1: ఎడయవు తనరెక్క లెగసిపోలేఁడు
కదు దాఁగుఁగాని దొంగయుఁ గాడు
వడిఁ గిందుపడును సేవకుఁడునుఁ గాఁడు
వెడఁగుగోళ్ళు వెంచు విటుఁడునుఁ గాఁడు
చ. 2: మిగులాఁబొట్టివాఁడు మింటికినిఁ బొడవు
జగడాలు తపసివేషములును
మగువకై పోరాడు మరి విరక్తుఁడును
తగుఁగాపుఁబనులు నెంతయుఁ దెల్లఁదనము
చ. 3: తరుణుల వలపించు తగిలి పై కొనఁడు
తురగముఁ దోలు రౌతునుఁ గాఁడు
తిరువేంకటాద్రిపైఁ దిరుగు నెప్పుడును
పరమమూర్తియై పరగు నీఘనుడు

**అవతారిక :**

ఇది అన్నమయ్య చెప్పిన అద్భుతమైన దశావతార కీర్తన. గొప్పమేధావులనైనా తికమకబెట్టే ఒక చరణంవుంది ఇందులో. "తగఁగాపుఁబనుల నెంతయుఁదెల్లఁదనము"- అంటే యేమి? అంటే, తగినట్లుగా ఆవులిన్న కాచిన యెంతో తెల్లదనము గలవాడ- ఇంకెవరు? బలరాముడు. "తెల్లని దొర" అంటే బలరాముడు.

**భావదీపిక :**

ఈ దేవదేవుని అవతార వైభవమును యెవ్వడోగాని యెరుగలేడు. ఎంతో దూరముగా వుంటాడు. కానీ మన తలపులలోనే వుంటాడు.

తనకు రెక్కలున్నా విప్పలేడు, యెగిరిపోలేడు (మత్స్యావతారము). కొండక్రింద దాగివుంటాడు కాని దొంగమాత్రంకాడు (కూర్మావతారము). నేలక్రిందపడివుంటాడు కాని సేవకుడు కాడు (భూమినెత్తిన వరాహావతారం). వాడిగోళ్ళు తోరక్కుతాడు కాని విటుడుకాడు (నృసింహావతారము).

ఎంతో పొట్టివాడు కాని ఆకాశంకంటే పొడగైనవాడు (వామనావతారం). వేషమేమో తపస్విది చేసేవి పోరాటాలు (పరశురామావతారము). అడదాని కోసం యుద్ధం చేసినా ఇతడు విరక్తుడే (శ్రీరామావతారము). తగుఁగాపుఁబనుల నెంతయుఁదెల్లఁదనము (తగినట్లు ఆవులను కాచిన యెంతో తెల్లనివాడు, బలరామావతారం).

తరుణుల (త్రిపురాసురుల భార్యలను) వలపించినా వారిని చెరచడు (బుద్ధావతారము). తురగమును తోలినాడు కాని గుఱ్ఱపురౌతు కాదు (కల్కిఅవతారము). ఎప్పుడుచూచినా తిరువేంకటాచలముపై తిరుగుతూనే వుంటాడు. కాని పరము నిచ్చే మోక్షప్రదాతగా విలసిల్లే ఈ ఘనుడే శ్రీవేంకటేశ్వరుడు. పైన చెప్పినట్టి దశావతారములనెత్తినదీ ఈ దేవుడే.



**సంఖ్య : 15 సంపుటము : 1 పుట : 10 రాగం : వరాళి**

పల్లవి: ఎవ్వారులేరూ హితవు చెప్పఁగ వట్టి-
నొవ్వులఁ బడి నేము నొగిలేమయ్యా
చ. 1: అడవిఁ బడినవాఁడు వెడలఁ జోటులేక
తొడరి కంపలకిందు దూరినట్లు
నడుమ దురితకాననములతరిఁ బడి
వెడలలేక నేము విసిగేమయ్యా
చ. 2: తెవులువడినవాఁడు తినఁబోయి మధురము
చవిగాక పులుసులు చవిగోరినట్లు
భవరోగములఁ బడి పరమామృతము నోరఁ
జవిగాక భవముల చవులాయనయ్యా
చ. 3: తనవారి విడిచి యితరమైనవారి
వెనకు దిరిగి తా వెఱ్ఱైనట్లు
అనయము తిరువేంకటాధీశుఁ గొలువక
మనసులోని వాని మఱచేమయ్యా

**అవతారిక :**

అన్నమయ్య ఈ కీర్తనలో శ్రీవేంకటాధీశునికి ఆర్తితో ఇలా మొరవెట్టుకొంటున్నారు. ఇంతకాలము మాకు హితవు చెప్పుటకై యెవ్వరూ లేకుండా పోయారు స్వామీ! అందుకని అనేక బాధలను పొంది దుఃఖించామయ్యా! అడవులలో చిక్కుబడ్డవారిలా, రోగము వచ్చిన వాడిలా, అయిన వారిని వదలి పరులను పట్టుకొని పాకులాడే వాడిలా యెన్ని అగచాట్లు పడ్డాను!!! అని మొత్తుకొంటున్నారు.

**భావదీపిక :**

స్వామీ! వట్టి హితవు చెప్పగ (పట్టుకొని మంచిని బోధించుటకు) యెవ్వరూ లేకుండాపోయారు. అందుచేత మేము నొవ్వులబడి (బాధలను పొంది) నొగిలేమయ్యా! (దుఃఖములను పొందితిమయ్యా!).

అడవులలో చిక్కుపడినవాడు వెళ్లేదారిలేక, తొడరి (తొందరలో) ముళ్ళకంపలో దూరినట్లు, పాపకృత్యముల మధ్యలో పడి బయటకు వెళ్లే దారిలేక నేము (మేము) విసిగిపోయామయ్యా!

తెవులబడినవాడు (రోగం వచ్చినవాడు) తీపి పదార్థాలను తిన్నా రుచి అనిపించక పుల్లని పదార్ధములను తిన్నట్లుగా, భవరోగ (పుట్టుక అనే రోగాన్ని) పొంది పరమామృతమైన నీ నామము నోటికి రుచించక పుట్టుకలే రుచియని అనేక జన్మలలో సతమతమైపోయానయ్యా!

వెఱ్ఱివాడు తన ఆప్తులను వదలి పరులవెంట తిరిగినట్లు, దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని పూజించక యెల్ల వేళలా అంతర్యామిగా నా మనస్సులోనే నిరంతరమూ వున్న వానిని ధ్యానించక మఱచితిమయ్యా! నన్ను మన్నించి నీదరి చేర్చుకో ప్రభూ!

**సంఖ్య : 77 సంపుటము : 1 పుట : 53 రాగం : గుండక్రియ**

పల్లవి: ఏఁటి విజ్ఞాన మేఁటి చదువు
గూఁటఁబడి వెడలుగతిగురుతు గనలేఁడు

చ. 1: ఏడుమడుకలచర్మ మింతయునుఁ దూంట్లై
గాడుబెట్టుచుఁజీము గారఁగాను
పాడైన యిందులో బ్రదుకుగోరీఁ బ్రాణి
వీడఁదన్నుక చనెడి వెరవు గనలేఁడు

చ. 2: కడుపునిండిన మహాకష్టంబు నలుగడల
వెడలుచును బెనుమురికి వేయఁగాను
యిడుమఁ బొందుచు సుఖంబిందుకే వెదకీని
వొడలు మోవఁగ జీవుఁడోపననలేఁడు

చ. 3: వుదకమయమగుకన్ను లురికి యేమైనఁగని
మదవికారము మతికి మరుపఁగాను
యిది యెరిఁగి తిరువేంకటేశుఁగని జీవుఁడా-
సదమలానందంబు చవిగానలేఁడు

**అవతారిక :**

అన్నమయ్య ఈ చక్కటి అధ్యాత్మిక కీర్తనలో ప్రాణి దేహమును పొందిన తరువాత కుదుటబడి దాంట్లోనే కొట్టుమిట్టాడుతుంటాడు. ఏడు జానల పొడుగు దేహం- దానికి తొమ్మిది తూట్లు-దాని నిండా చీమూనెత్తురు-కడుపు నిండకపోతే ఏడుస్తాడు-నిండితే కోరికల కలలుకంటాడు-నీళ్ళ నిండిన కళ్ళతో, మదించినమనస్సుతో చచ్చేదాకావుంటాడు. కాని యెన్నడూ శ్రీవేంకటేశ్వరుని నిర్మలానందం చవి చూడలేదు అంటున్నారు.

**భావదీపిక :**

ఎక్కడి విజ్ఞానము యెక్కడి చదువు? ఈ జీవుడు గూడబడి (కుదుటపడి) ఈ దేహంలోంచి బైటకు యెట్లాపోవాలో, గురుతుగనలేడు (జాడదెలియలేడు).

వీడి దేహము పొడుగు ఏడుమడుకలు (జేనలు). దీంట్లో అంతయునూ తూంట్లే (రంధ్రాలే). గాడబెట్టుచు (క్షోభపెడుతూ) చీముకారుతుందీ చర్మము. ఈ పాడు దేహంలో ప్రాణి బ్రతుకుకోరుతుంటాడు. అన్నుకవీడదు (పరవశత్వము పోదు). వెరవు గనలేడు (ముక్తిబాట కనలేడు).

వీడికి కడుపు నిండగానే అన్నివైపులనుంచి కష్టాలు మొదలవుతాయి. నలుదిక్కులకూ పోయి పెద్దమురికి అంటుకొన్నా బాధపడక ఇందులేనే గొప్ప సుఖంవుంది అని లేని సుఖం కోసం వెతుకుతుంటాడు. కాని యెన్నడూ జీవుడు ఈ దేహంమోయలేననుకోడు.

ఉదకమయమైన వీడి కన్నులు వూరకనే అనవసరమైన వాటినెల్లా చూచి మదమును, వికారమును వీడి మనస్సుకు అంటిస్తాయి. కొందరికి ఇదంతా తెలుసు. జీవుడు అహంకరించి, తిరువేంకటేశ్వరుని చూచి కూడా అమందానందమును చవిగానలేడు (రుచిచూడలేదు) ఎంత దౌర్భాగ్యుడు!!!



**సంఖ్య : 95 సంపుటము : 1 పుట : 65 రాగం : శ్రీరాగం**

పల్లవి: ఏది జూచినఁ దమకు యిన్నియును నిటువలెనె
వేదువిడిచిన కూడు వెదకినను లేదు

చ. 1: ఏకాంతసౌఖ్యంబు లెక్కడివి ప్రాణులకు
పైకొన్నదుఃఖముల పాలుపడెఁ (డి?) గాక
యేకమగు పుణ్యంబు లేదఁగల విందరికి
కైకొన్నదురితములు కలపాటిగాక

చ. 2: హితవైనమమకార మెందుఁగల దిందరికి
ప్రతిలేని విరహతాపము కొలందిగాక
మతిలోని వేడుకలు మరియేమి మనుజులకు
జితమైన దైవమిచ్చిన పాటిగాక

చ. 3: యిరవైన దైవకృప యేల దొరుకునుఁ దమకు
పరమైనకర్మంబు పరిపాటిగాక
యెరవైన పెనుబంధ మేల వీడెడు నాత్మఁ
దిరువేంకటేశుకృప తిరమైనఁ గాఁక

**అవతారిక :**

ఏది చూచినా మనకు అన్నీ ఇట్లానే వుంటాయి. దుర్గంధంలేని "కూడు" దొరకటం యెంత కష్టమో నిర్వికార సౌఖ్యం, నిష్కామ పుణ్యములు, హితము వాంఛించే మమకారము, అంతఃకరణ అనందం, దైవకృప ఇవన్నీ శ్రీవేంకటేశ కృప స్థిరమైతే తప్ప దుర్లభం అంటున్నారు అన్నమయ్య.

**భావదీపిక :**

ఇన్నియును ఇటువలె (అన్నీ ఇట్లానేవుంటాయి) తమకు (మనకు) యేదిచూచినా ఇంతే. వేదువిడచిన (దుర్గంధరహితమైన) కూడు వెదకినా దొరకదు.

ప్రాణులకు, యేకాంత సౌఖ్యము లెక్కడివి? (నిర్వికార సుఖము లభ్యమౌతుందా?) వారికెప్పుడూ పైబడ్డ దుఃఖమేవుంటుంది) అందరికీ నిష్కామ పుణ్యం దొరుకునా? ఎప్పుడూ పాపపంకిలమైన పాట్లేకదా! ప్రాణులకు.

పరహితమును కాంక్షించే మమకారం అందరికీ యెక్కడుంటుంది? సాటిలేని విరహతాపం మాత్రం యెంతోవుంటుంది. వీళ్ళకి మతిలోని వేడుకలు (అంతఃకరణానందం) మరియేది? దేవుడు ప్రసాదించిన కష్టాలు మాత్రం కోకొల్లలుగా వున్నాయి.

సుస్థిరమైన దైవకృప వీళ్ళకెందుకు దొఱుకుతుంది? వీడికి ప్రాప్తించిన కర్మఫలములు యెప్పుడు వీడికి పరిపాటే. అతిశయించిన ఘనమైన అనుబంధాలు వీడినెందుకు వదలుతాయి? ఆత్మలో శ్రీవేంకటేశ్వరుని కృపస్థిరమైతే తప్ప ఇవన్నీ జరిగే పనులు కావు.

**సంఖ్య : 128 సంపుటము : 2 పుట : 86 రాగం : బౌళి**

పల్లవి: ఏది వలసె నీవది సేయు యిందులోన నో జీవాత్మ
పాదగు మనలో నంతరాత్మయై పరగిన శ్రీహరి పనుపునను

చ. 1: మనవంటి జీవులే మహిలోన నొక కొన్ని
శునకములై కుక్కుటములై సూకరములు నైనవి
దినదినముఁ గర్మపాశములు దిరిగెడి దుర్దశ లటుచూడు
సనకాదులై కొందరు జీవులు శౌరిదాసులై రటుచూడు

చ. 2: కన్నులుఁ గాళ్ళు మనవలెఁ దనువులు గైకొని కొందరు నరులు
పన్నిన తొత్తులు బంట్లునై మనపనులు సేయుచునున్నారు
యెన్నఁగ శ్రీహరి నెఱఁగక యిడుములఁ బొరలెడి దది చూడు
మున్నె హరిదాసులై నారదముఖ్యులు గెలిచిన దది చూడు

చ. 3: యింతగాలమును యీపుట్టుగులనె యిటువలెఁ బొరలితి మిన్నాళ్ళు
యింతట శ్రీవేంకటేశుఁడు దలంచి యీ జన్మంబున మము నేలె
వింతల బొరలిన నరకకూపముల వెనకటి దైన్యములటు చూడు
సంతసమున ముందరిమోక్షము సర్వానందంబది చూడు

**అవతారిక :**

అన్నమయ్య ఈ కీర్తనలో జీవాత్మను హెచ్చరిస్తున్నారు. నీవు నీకు తగిన పనులు చేయుము. నీవు జీవులలో అంతర్యామిగా నెలకొనిన శ్రీహరి బంటువి. మాయవలన పాపపుణ్యాలు రెండూ నీవే చేసి ఒకసారి కుక్కవంచి జంతువయ్యావు. సనకాది ఋషులుగాను పుట్టావు. ఒకసారి బంటువైతే ఒకసారి నారదుని వంటి హరిభక్తుడయ్యావు. నేను కూడా అనేక జన్మలెత్తి నేటికి వేంకటపతి దాసుడనైనాను. ఇక నాకు జన్మలేదు.

**భావదీపిక :**

ఓ జీవుడా! ఇందులోన (ఈ శరీరం వున్నప్పుడే) యేది వలసె (అవసరమో) నీవు అది సేయుము. పాదుకొని మన లోపల అంతరాత్మయో వ్యవహరిస్తున్నది శ్రీహరి ఆజ్ఞచే కదా.

శునకములు, కోళ్లు, వరాహములు కూడా భూమిపై మనవంటి జీవులే. ప్రతి దినమూ కర్మపాశబద్ధులై అట్లా తిరిగే దుర్దశ కొందరికుంటే కొందరు జీవులు శౌరిదాసులై అటు చూడగా పరమాత్మ దయను సనకాదుల వలె పొందుతున్నారు.

కొందరు జీవులు నరులై మనవలనే కళ్ళు, కాళ్లు పొందారు. కాని వారు ఇతర మానవుల బంట్లు, తొత్తులు అయి మనకు వూడిగం చేస్తున్నారు. వారు పుట్టింది చావటానికేగాని యెన్నడూ శ్రీహరి నెరుగరు. కొందరు హరినెరిగి నారదుని వలె విఖ్యాత హరిదాసులైనారు.

మేము కూడా ఇన్నాళ్ళూ అట్టి వ్యర్థ పుట్టుకలలోనే గడిపినాము. ఈ జన్మలో శ్రీవేంకటేశుడు దయతలచి మమ్ము యేలినాడు. వెనకటి దైన్యపుబ్రతుకంతా నరకకూపంలో పొర్లితిమి. కాని నేడు జీవన్ముక్తిని పొంది సర్వానందభరితులమయ్యాము.



**సంఖ్య : 11 సంపుటము : 2 పుట : 8 రాగం : సామంతం**

పల్లవి: ఏమి సేయుదు నింక నిందిరాధీశ్వరుఁడా
నీమఱఁగు చొచ్చితిని నెరవేర్తు గాక

చ. 1: కడివోని జవ్వనము కలిమిలేమెఱుఁగునా
బడినుండి మిగుల రుణపరచుఁ గాక
అడియాసలెల్లాఁ బుణ్యముఁ బాప మెఱుఁగునా
వెడగుఁ దనలో దయ విడిపించుఁ గాక

చ. 2: వలపు వెఱ పెఱుఁగునా వాఁడిమొనలకునైన
బలిమిఁ దూరించఁ జలపట్టుఁ గాక
చలనమందిన మనసు జాతి నీతెఱుఁగునా
కలిసి హేయమున కొడిగట్టించుఁ గాక

చ. 3: యెలమి రతిపరవశము యెగ్గుసిగ్గెఱుఁగునా
బలిమిఁ దిట్లకు నొడఁబఱచుఁ గాక
యిలలోన శ్రీవేంకటేశ నీమాయ లివి
తలఁగించి యేలితివి దయసేతు గాక

**అవతారిక :**

శ్రీవేంకటేశుని మాయ మానవులను ఇష్టం వచ్చినట్లు ఆడిస్తుంటుంది. వాడు చేయగలిగింది వొక్కటే, ఇందిరాధీశుని మఱగుచొచ్చి శరణు కోరటం ఒక్కటే దారి అంటున్నారు అన్నమయ్య.

**భావదీపిక :**

ఓ ఇందిరారమణా ఇంక నేనేమి సేయుదునయ్యా! నీ మఱుగుచొచ్చితిని (నీ వెనుక చేరాను). అదే నా కర్తవ్యమని నెరవేర్తును గాక!

కడివోని (తగ్గని) యౌవనము కలిమిలేముల నెంచునా? మనవద్దనే వుంటి మనల్ని ఋణగ్రస్తులను చేస్తుంది. అడియాస పాపపుణ్యాల నెంచనిస్తుందా? తనలోవున్న దయను కూడా అది వెళ్ళగొడుతుంది.

వలపు భయము నెఱుగునా? వాడి కత్తి మొన అంచున నిలిపినా చలపట్టి (మొండితనంతో) అది మనల్ని దూరించు (నిందలపాలు చేస్తుంది). చలించి పోయే మనస్సు జాతి నీతి యెఱుగుతుందా? అతి మనల్ని తుచ్ఛమైన పనులనే చేయిస్తుంది.

రతిపారవశ్యము సిగ్గు లెక్కపెడుతుందా? ఎన్ని తిట్లు తినడానికైనా అది మనను ఒడబరుస్తుంది. మానవమాత్రలకు భూమిపైన నీ మాయ అర్థమవుతుందా ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! తలగించి (జాలితో చలించి) నీవే దయచూపాలి అంతే.

**సంఖ్య : 173 సంపుటము : 2 పుట : రాగం : ముఖారి**

పల్లవి: ఏరీతి నెవ్వరు నిన్ను నెట్టు భావించినాను
వారివారి పాలికి వరదుడవౌదువు
చ. 1: చేరికొల్చినవారికిఁ జేపట్టుఁ గుంచమవు
కోరి నుతించినవారికి కొంగుపైఁడివి
మేరతోఁ దలఁచువారి మేటినిధానమవు
సారపు వివేకులకు సచ్చిదానందుఁడవు
చ. 2: కావలెననేవారికి కామధేనువవు మరి
సేవసేసేవారికి చింతామణివి
నీవే గతెన్నవారికి నిఖిల రక్షకుఁడవు
వావిరి శరణువేఁడేవారి భాగ్యరాశివి
చ. 3: నిన్నుఁ బూజించేవారి నిజపరతత్త్వమవు
ఇన్నిటా నీదాసులకు నేలికెవు
యెన్నఁగ శ్రీవేంకటేశ యిహపరములకును
పన్ని కాచుకున్నవారి ఫలదాయకుఁడవు

**అవతారిక :**

భగవంతుడు నిరాకారుడు, నిరంజనుడు అయినప్పటికీ తనని నమ్మిన భక్తుడు యేరీతిగా భావిస్తే ఆ రీతిగా వారికి వరదుడవుతాడంటున్నారు అన్నమయ్య. ఆయన తన భక్తులకు కామధేనువు, కొంగుబంగారం, నిధానము చింతామణి, రక్షకుడు, భాగ్యదాత, పరతత్వము ఇహపరముల నొసగే ఫలదాత అంటున్నారు.

**భావదీపిక :**

ప్రభూ! నిన్ను యేరీతి నెవ్వరు యెట్లా కొల్చెదరో వారివారి నట్లే అనుగ్రహించి వరదాతవౌదువు.

నిన్ను చేరి యెవ్వరు కొల్చెదరో వారికి చేతపట్టుకొన్న కుంచము (కొలిచే పాత్ర) వంటివాడవు. కోరి నుతించిన వారి పాలి కొంగుబంగారానివి. మేరతో (సరిగా) తలచినవారికి ధనపుపాతరవు. వివేకమున్నవారికి సచ్చిదానంద స్వరూపుడవు.

నీవే కావాలనే వారి పాలిటి కామధేనువువంటి వాడవు. నీకు సేవ చేసేవారి పాలిటి చింతామణివి. నీవే గతి అని యెవరు ప్రార్థిస్తారో వారికి సర్వరక్షకుడవు. వావిరి (ఉత్కృష్టముగా) నీ శరణాగతులైన వారికి నీవు వారి భాగ్యరాశివి.

నిన్నెవరైతే పూజిస్తారో వారి పాలిటి పరతంత్రుడవు (వారి ఆధీనములో వుండేవాడవు) అన్ని విధములా నీదాసులపాలిటి యేలికవు (పాలకుడవు). ఎంచిచూస్తే శ్రీవేంకటేశు డవైన నీవే ఇహపరములలో పాపపుణ్య ఫలముల నొసగి ఒక కంట కనిపెట్టేవాడివి.



**సంఖ్య : 167 సంపుటము : 5 పుట : 114 రాగం : ధన్యాసి**

పల్లవి: ఏవం దర్శయసి హితమతిరివ
కేవలంతే ప్రియసఖీవా తులసీ
చ. 1: ఘటిత మృగమద మృత్తికా స్థాపకం
పటు శరీరే తే ప్రబలయతి
కుటిల తద్ఘన భార కుచవిలిగ్నంవా
పిటర స్థలే మృత్ప్రీతా తులసీ
చ. 2: లలిత నవ ఘర్మలీలా విలసనో
జ్జ్వలనం తవ తనుం వంచయతి
జల విమల కేళీవశా సతతం
అలిక ఘర్మాంచిత విహారా తులసీ
చ. 3: సరస నఖచంద్రలేశా స్తే సదా
పరమం లావణ్యం పాలయతి
తిరువేంకటేశ తత్కరుణా గుణా వా
వర రూప నవచంద్ర వదనా తులసీ

**అవతారిక :**

సంస్కృతంలో అన్నమాచార్యులు వినిపిస్తున్న అద్భుతమైన కీర్తన ఇది. స్వామి తులసీమాలాలంకృతుడై శోభిస్తున్నాడని యెదపైనున్న తననీ (అలవేల్మంగను) కప్పివేస్తున్న తులసిపై కోపం ప్రదర్శిస్తున్నదా తల్లి. డా॥ పతంజలిగారి "కౌముది" నాకు వెన్నెలలో వెలుగుదివ్వె అయింది ఎంత అమాయక చక్రవర్తిలా, యెంత హితైషిలా ప్రవర్తిస్తున్నావు స్వామీ? నాకు నీ నటనలు తెలియవా? నీ ప్రియసఖి "తులసి" అని నాకు తెలియదా?

**భావదీపిక :**

ఆహా! యెంత అమాయక చక్రవర్తిలా, హితకారిలా కనబడుతున్నావు స్వామీ? నాకు నీ అసలు సంగతి తెలియదా? నీదంతా వట్టి నటన. నీ అసలు ప్రియసఖి తులసీదేవియే.

ఆమెకు తిలకంమట్టి. తమరికీ తిలకం మట్టియేగా? (కస్తూరి మట్టితో కలుపుతారు). గునపంతో తవ్వేటప్పుడు దానికి అంటుకొన్న మట్టిని ఆమె బిగువైన సొగసైన కుచములకు పూసుకొంటుంది. నీవు కస్తూరిని ఒంటిపై పూసుకొంటావు. నీది మరీచోద్యం.

నీ చెమటలను పీల్చేయాలని తులసీ మాలలతో నీ ఒళ్ళు కప్పుతున్నారా? కాదు కాదు. ఆమె స్వచ్ఛమైన నీ స్వేదజలములలో జలక్రీడలాడుతున్నది స్వామీ! నీకు చెమట తగ్గించటం కేవలం మిష. ఆ మిషతో నిన్ను కౌగలించి పరవశిస్తోంది ఆమె. తుమ్మెదవంటి నీమేను జలజలా చమరిస్తుందా? పాపం!!

ఓ శ్రీవేంకటేశా! కరుణానిధీ! చంద్రబింబమువంటి మనోహరమైన తన వదనముతో వయ్యారాలొలికిస్తూ ఆమె నీ ఒంటిమీద కనుపించే నఖక్షతాలను నాకు కనబడనీయకుండా కప్పివేస్తూ నిన్ను యెంత చక్కగా యేలుతున్నదయ్యా!!!

**సంఖ్య : 247 సంపుటము : 2 పుట : రాగం : కాంబోది**

పల్లవి: ఐనట్టయ్యీఁ గాక హరికల్పితము లివి
మానేటి వేఁటివో మానని వేవో

చ. 1: వొక్కరు తలఁచినట్టు వొకరి తలుపు రాదు
పక్కన నందరికి బహుభావాలు
అక్కట మొద లొకటి అనలుఁ గొనలు వేరు
యెక్కడని తగిలేది యేమిసేసేది

చ. 2: పొరుగువాని చేఁత ఆపొరుగువాఁడు మెచ్చఁడు
నరుల కర్మములు నానావిధాలు
గరిమ నన్నమొక్కటే కడుపుతనివి వేరు
కరుణించౌనన నేవి కావన నేవి

చ. 3: కడఁగి దరిద్రునిమాట కలవాని కింపుగాదు
బెడఁగు జీవుల పొందు పెక్కురీతులు
కదు శ్రీవేంకటేశుఁ డొక్కఁడు జగత్తులు వేరు
వొడిఁగట్టుకొనే దేది వొల్లననే దేది

**అవతారిక :**

అన్నమయ్య ఈ కీర్తనలో హరియేది యెట్లా తలచుకొంటే, అది అట్లా అవుతుంది. కొన్ని జరుగుతాయి, కొన్ని జరుగవు. ఎలాగైతే వొకేవొక శ్రీవేంకటేశ్వరుడున్నా జగములు రకరకాలుగా వున్నాయో, నేను వొడి కట్టుకొన్నా నాకు వొద్దు అన్నా యేదన్నా అవుతుంతా, ఆగుతుందా? అంటున్నారు.

**భావదీపిక :**

అయ్యలారా! ఇవన్నీ శ్రీహరి కల్పితములు. ఐనట్టయ్యీ (ఎలా అవాలనుంటే అలా అవుతాయి). కాకుండా మానేవేవి? కాకమాననివేమి? యెవడికి తెలుస్తుంది?

ఎందుకంటే ఒకరు ఆలోచించినట్లు యింకొకరు ఆలోచించరు. అందరి భావాలు ఒక్కలా వుండవు కదా! అయ్యో! మొదలు ఒక్కటే అయినప్పటికీ లతలు తీగెలు సాగి వేర్వేరు తీగెలవుతుంది. దేని మొదలేదో? దేనిని తగలను? యేమి చేయను?

ఆ పొరుగునున్న వాడి పని యీ పొరుగువాడు మెచ్చడు నరులు చేసే పనులు నానా విధాలు. అన్న మొక్కటే వున్నా యెవడాకలివాడిది. శ్రీహరి కరుణించి దేనిని అవునంటాడో, నిరసించి దేనిని కాదు అంటాడో ఎవడికి తెలుసు?

దరిద్రుడు యేమి చెప్పినా అది “కలవానికి” (ధనికునికి) ఇంపుగా నుండదు. బెడగు (తప్పుడు) జీవుల పొందులు రకరకాలుగా వుంటాయి. శ్రీవేంకటేశ్వరుడొక్కడే కాని ఆయన సృష్టించిన జగములు వేర్వేరు. దేనిని వొడిగట్టు కొనేది? దేనిని వొద్దు అనేది? నా చేతిలో యేముంది?



**సంఖ్య : 496 సంపుటము : 1 పుట : 332 రాగం : బౌళి**

పల్లవి: కనినవాఁడాఁ గాను కాననివాఁడాఁ గాను
పొనిఁగి వొరులకైతే బోధించే నేను

చ. 1: ధరణిఁ గర్మము గొంత తగినజ్ఞానము గొంత
సరికి సరే కాని నిశ్చయము లేదు
వొరిమె యెంచిచూచితే నొకటివాఁడాఁగాను
సరవి దెలియ కేమో చదివేము నేము

చ. 2: యీతల నిహము గొంత యింతలోఁ బరము గొంత
చేతులు రెండు చాఁచే చిక్కుట లేదు
యీ తెరువులో నొకటి నేరుపరచుకోలేను
కాతరాన కతలెల్లా గఱచితి నేను

చ. 3: దైవిక మొకకొంత తగుమానుషము గొంత
చేవలుచిగురువలెఁ జేసేను
యీవల శ్రీవేంకటేశుఁడిది చూచి నన్నుఁ గాచె
భావించలేక యిన్నాళ్ళు భ్రమసితి నేను

**అవతారిక :**

అన్నమయ్య చెబుతున్న ద్వంద్వవైఖరిలోనే మనమందరమూ బ్రతుకు వెళ్ళదీస్తున్నాం. అటు జ్ఞానులమనుకొని పరులకు నీతి బోధలు చేస్తుంటాం. కర్మమార్గములోనూ పోము, జ్ఞానమార్గంలోనూ పోము. ఇహము కొంత, పరము కొంత. నా ద్వంద్వ వైఖరి చూచి శ్రీహరి పోనిలే అని నన్ను రక్షించాడు. ఎంత భ్రమలోవున్నాను!!!

**భావదీపిక :**

నేను కనినవాడాగాను (జ్ఞానినీ కాదు), కానని వాడాగాను (అజ్ఞానినీ కాదు) పొనిగి (ఉత్సాహంతో) ఇంకొకరికైతే యెన్నో నీతిబోధలు చేస్తుంటాను నేను.

భూమిపై కొంత కర్మమార్గాన్ని, కొంత జ్ఞానమార్గాన్ని నేను అనుసరిస్తుంటాను. సరికి సరి (దేనికదే) కాని నిశ్చయంగా ఒక్కదాని వెంటపోను. అసలు విధానం తెలియక అనవసరమైనవన్నీ చదువుతూ కాలం గడిపేశాను.

ఇవతల ఇహము (ప్రాపంచిక జీవనం) కొంత, అవతల పరము (ఆధ్యాత్మికచింతన) కొంత, రెండు చేతులు చాచినా యేవొక్కటీ చిక్కటంలేదు. ఈ మార్గాలలో యేదో వొకదాన్ని యేర్పరచుకోలేక పోతున్నాను. కాతరాన (పిరికితనంతో) నేను అన్ని కథలను నమ్మాను.

దైవికంగా కొంత జరిగింది. మానుషము (మానవజన్మ) వలన కొంత జరిగింది. తెలిసీ తెలియక చేసితిని. దీనికి అంతూపొంతూ లేకుండా పోయింది. చివరికి శ్రీవేంకటేశ్వరుడికే నాపై దయకలిగి నన్ను చూచి కాచినాడు. దీన్నికూడా అర్థం చేసుకొనలేక, ఇన్నాళ్ళు భ్రమలో వుండిపోయాను.

**సంఖ్య : 247 సంపుటము : 1 పుట : 198 రాగం : భైరవి**

పల్లవి: చాల నొవ్వి నేయునట్టిజన్మమేమి మరణమేమి
మాలుగలపి దొరతనంబు మాన్పు టింత చాలదా
చ. 1: పుడమిఁ బాపకర్మమేమి పుణ్యకర్మమేమి తనకు
కడపరానిబంధములకుఁ గారణంబులైనవి
యెడపకున్న పసిఁడిఁసంకెలేమి యినుపసంకెలేమి
మెడకుఁ దగిలియుండి యెపుడు మీఁదుచూడరానివి
చ. 2: చలముకొన్న ఆపదేమి సంపదేమి యెపుడుఁ దనకు
అలమిపట్టి దుఃఖములకు నప్పగించినట్టిది
యెలమిఁ బసిఁడిగుదియయేమి యినుపగుదియయేమి తనకు
ములుగ ములుగఁ దొలితొలి మోఁదు టింత చాలదా
చ. 3: కర్మియైనయేమి వికృతకర్మియైననేమి దనకు
కర్మఫలముమీఁదకాంక్ష గలుగు టింత చాలదా
మర్మ మెరిఁగి వేంకటేశుమహిమలనుచుఁ దెలిసినట్టి
నిర్మలాత్ము కిహముఁ బరము నేఁడు గలిగెఁ జాలదా

**అవతారిక :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో చాల వేదన తప్పనిసరి అయినప్పుడు అది జన్మమైనా, మరణమైనా తేడా యేముంది? రెండూ కలసిపోయి అనుభవించే జీవి తానేదో “దొర’ అనుకోకుండా వినయంగా దేవునికి శరణాగతితోవుంటే చాలదా? అంటున్నారు. నిర్మలాత్ముడై తిరుమలేశుని దాసుడైతే ఇహపరములు రెండూ సాధించవచ్చును కదా!

**భావదీపిక :**

మానవులారా! అధికముగా వేదనజెంది అనుభవించునట్టిదైతే, అది జననమైనా, మరణమైనా తేడా యేమివుంటుంది? మాలుగలపి (కలివిడితనంతో) దొరతనంబు మాన్పుట (సమభావనతో తానే అధికుడననుకొకుంటే) అదిచాలదా?

దాటలేని బంధాలకు కారణమైనప్పుడు ఈ భువిలో పాపకర్మయేమిటి? పుణ్యకర్మయేమిటి? రెండూ అనుభవించక తప్పదు. సంకెళ్ళు పడినప్పుడు అవి ఇనుపవైతేనేమి, బంగారపు సంకెళ్ళైతేనేమి? మెడకు తగిలిస్తే ముందున్నది శూన్యమే కదా!

వదలకుండా పట్టుకొన్న ఆపదైనా, సంపదైనా అదిమిపట్టుకొని చివరకి దుఃఖములకే అప్పగిస్తాయి. గుదియలు (కాళ్ళకు వేసే నాలుగు మూరల గుంజ) బంగారందైనా, ఇముపదైనా తేడావుంటుందా? అది కాళ్ళకడ్డంపడి బాధించకుండా వుంటుందా?

కర్మిష్ఠియైనవాడు సక్రమకర్మలు చేస్తేయేమి, వికృతకర్మలు చేస్తేమేమి? వాడికి కర్మఫలము మీద కాంక్షవుంటే... అదిచాలదా వాడిని జన్మల చక్రబంధంలో చిక్కడానికి? శ్రీవేంకటేశ్వరుని మర్మము, మహిమ తెలిసికొని నిర్మలాత్ముడైతే వాడికి ఇహపరములు రెండూదక్కుతాయి. అదిచాలదా?



**సంఖ్య : 13 సంపుటము : 2 పుట : 9 రాగం : శుద్ధవసంతం**

పల్లవి: ఛీ ఛీ వివేకమా చిత్తపు వికారమా
యేచి హరిఁ గొలువక హీనుఁడాయ జీవుఁడు
చ. 1: బతికేనంటాఁ బోయి పయిఁడి వుచ్చుక తన–
పతి యవసరములఁ బ్రాణమిచ్చీని
బతు కందులోన నేది పసిఁడి యెక్కడ నుండు
గతి హరిఁ గొలువక కట్టువడె జీవుఁడు
చ. 2: దొడ్డవాఁడనయ్యేనని దొరలఁ గొలిచి వారి–
కడ్డము నిడుపు మొక్కు నతిదీనుఁడై
దొడ్డతన మేది యందు దొర యాడనున్నవాఁడు
వొడ్డి హరిఁ గొలువక వోడుపడె జీవుఁడు
చ. 3: చావనేల నోవనేల సారెఁ గిందుపడనేల
యీవల శ్రీవేంకటేశుఁడింట నున్నాఁడు
దేవుఁ డాతఁడే నేఁడు తెలిసి కొలిచేఁ గాని
భావించ కిన్నాళ్ళదాఁకా భ్రమఁబడె జీవుఁడు

**అవతారిక :**

అన్నమయ్య యేమంటున్నారో వినండి. ఛీ ఛీ ఈ జీవుడు హరిని కొలువనందున చిత్తవికారమును బొంది వివేకము నశించి ప్రతి అవసరానికీ పైడి కావాలంటాడు. మిడిమేలపు దొరను గొలిచి మిడుకుతుంటాడు. శ్రీవేంకటేశ్వరుడు యెదురుగా వున్నా ఆయనను స్మరించక జీవుడు భ్రమలోనే వున్నాడు.

**భావదీపిక :**

ఛీ ఛీ!! వివేకమా! మనోవికారమా! యేచి (మిడిసిపడి) జీవుడు శ్రీహరిని కొలువక హీనుడైపోయాడు.

బ్రతుకుటకారాటపడి, ప్రతి అవసరానికి పైడి (బంగారం) కోసం ప్రాణమిచ్చాడు. నిజానికి బంగారంలో బ్రతుకువున్నదా? హరిని గొలువనందువలన జీవుడు అల్పమైన వస్తువులకు కట్టుబడి హీనుడైనాడు.

ఊరిలోని దొరను గొలిస్తే తాను దొడ్డవాడైపోదామని దొరకాళ్ళకు అడ్డంగాను, నిలువుగానూ మొక్కి అతిదీనుడై లొంగివుంటాడు. ఆలోచిస్తే ఆ దొర శాశ్వతుడా? వాడి మంచితనం శాశ్వతమా? కానేకాదు. ఒడ్డి (పూని) హరిని గొలువక ఈ జీవుడు వోడుపడెను (సంకోచపడ్డాడు).

చావటం దేనికి? నొచ్చుకోవటం దేనికి? ప్రతిసారి క్రిందపడి లొంగివుండటం దేనికి? ఇప్పుడు శ్రీవేంకటేశ్వరుడు ఇంటనున్నాడు (హృదయంలోనే వున్నాడు) నాలోని జీవుడు భ్రమపడి ఇన్నాళ్లు దీనిని భావించలేకపోయినా, నేడు ఆయనే దేవుడని తెలిసికొలుస్తున్నాడు.

**సంఖ్య : 115  సంపుటము : 2  పుట : 77  రాగం : శంకరాభరణం**

పల్లవి: చీచీ వో జీవుఁడా చింతించుకో జీవుఁడా
ఆచందాన కీచందము అరుహమా జీవుఁడా

చ. 1: వుత్తముఁడయిన హరి వుండేటి యాతుమలోన
తత్తరపుఁ గాంతలను తలపోసేదా
వొత్తి నారాయణనామ ముచ్చరించే నోరను
రుత్త యధరపుఁదోలు రుచిగొనేదా

చ. 2: పొందుగాఁ గోవిందునిఁ బూజించేటి చేతులను
సందడిఁ జన్నులమీఁద జాఁచబొయ్యేదా
కందువ దేవునిరూపు కనుఁగొనే చూపులు
ముందరి మర్మపుటంగములమీఁదు బెట్టేదా

చ. 3: వేవేలు విష్ణుకథలు వినియేటి చెవులను
ఆవటించి యాడసుద్దులాలకించేదా
శ్రీవేంకటేశ్వరుని సేవించే యీజీవనము
భావించక విషయాల పాలు సేసేదా

**అవతారిక :**

జీవుడు యౌవనమదంలో తను గతంలో యేమిటో మఱచి మళ్ళీ స్త్రీలోలుడై చేయరాని హేయమైన పనులు చేస్తూ, స్త్రీల కబుర్లు వింటూ గోవిందుని పూజించక ఎక్కిన నిచ్చెనపై నుండి పడిపోయి మళ్ళీ మొదటికే వస్తాడు. అన్నమయ్య శ్రీవేంకటేశుడు కాక ఇదంతా అవసరమా అంటున్నారు.

**భావదీపిక :**

ఓ జీవుడా ఛీ చీ!! చింతించుకో (ఆలోచించుకో). ఆచందానకు (నీ గతజన్మ ఉన్నతికి) ఈ చందము (ఇప్పటి నీ కాముకత్వం) అరుహమా (తగినదేనా?).

నీ ఆత్మలో ఉత్తముడైన శ్రీహరి వుండేవాడు. మరి ఇప్పుడు నిన్ను తత్తర పెట్టే కాంతల గురించి ఆలోచిస్తున్నావు. నారాయణుని పేరును వుచ్చరించవలసిన నోటితో, రుత్త అధరాల (నాశనం చేసే పెదవుల) తోలు రుచిగా వుందని చప్పరిస్తున్నావు. జీవుడా! యేమిటిరా?

లక్షణంగా గోవిందుని పూజించిన చేతులతో కలవరపెట్టే పడతుల పయోధరలాపై చాచివుంచాలని ఆశపడుతున్నావు. కందువదైవము (నేర్పరియైన పరమాత్మను) రూపమును చూడవలసిన కళ్ళతో స్త్రీల మర్మాంగాలను చూచి తపించిపోతున్నావు. జీవుడా! యేమిటిరా?

అనేక విష్ణుకథలు ఆ జన్మలో విన్నావు. ఇప్పుడు ఆవటించి (సంగ్రహించి) ఆడువారి మాటలు వింటున్నావు. ఛీ ఛీ!! అవును, శ్రీవేంకటేశ్వరుని సేవించిన ఈ జీవితాన్ని నేడు ఆలోచించక విషయసుఖముల పాలు చేసేదా!!!



**సంఖ్య : 133  సంపుటము : 1  పుట : 91  రాగం : వంశి**

పల్లవి: చూడఁ జూడ మాణిక్యాలు చుక్కలవలె నున్నవి
యీడులేని కన్నులవె యిన చంద్రులు

చ. 1: కంటిఁ గంటి వాఁడెవాఁడె ఘనమైన ముత్యాల-
కంటమాలలవే పదకములు నవె
మింటి పొడవైనట్టి మించుఁ గిరీటంబదె
జంటల వెలుఁగు శంఖచక్రా లవె

చ. 2: మొక్కుమొక్కు వాఁడె వాఁడె ముందరనే వున్నాఁడు
చెక్కులవే నగవుతో జిగిమో మదె
పుక్కిట లోకములవె భుజకీర్తులును నవె
చక్కనమ్మ అలమేలు జవరాలదె

చ. 3: ముంగై మురాలును నవె మొలకఠారును నదె
బంగారు నిగ్గులవన్నె పచ్చబట్టదె
యింగితమెరిఁగి వేంకటేశుఁడిదె కన్నులకు
ముంగిటి నిధానమైన మూలభూతమదే

**అవతారిక :**

సర్వాభరణ భూషితుడైన శ్రీవేంకటేశ్వరుని మనోజ్ఞంగా వర్ణిస్తున్నారు అన్నమయ్య. సూర్యచంద్రులు నేత్రాలుగాగల స్వామికి కిరీటంలో పొదిగిన మాణిక్యాలు నక్షత్రాలవలె మెరుస్తున్నాయి. "ముంగైమురాలు" అంటే ముంజేతికి పెట్టుకొన్న కడియాలు అని అర్థం. కడియాలు అంటే అని అడిగే వారికొక నమస్కారం.

**భావదీపిక :**

స్వామివారి సమున్నతమైన కిరీటంలో నున్న మేటి మాణిక్యాలు పరిశీలనగా చూస్తే ఆకాశంలో చుక్కలు (నక్షత్రాలు)వలె మిలమిలా మెరుస్తున్నాయి. ఈడులేని (సాటిలేని) ఆ కన్నులు జగతికి వెలుగునిచ్చే సూర్యచంద్రులే.

వాడే ఘనమైన ముత్యాల కంఠమాలలతో నున్నాడు. గొప్పపతకములను ధరించిన వాడిని నా కనులారా కంటిని. ఆ కిరీటము ఆకాశాన్ని తాకుతున్నట్లుంది. జంటగా వెలుగులు చిమ్ముతున్న ఆ శంఖచక్రాలు ముచ్చటగా నున్నవి.

మన ముందరలే వున్న వాడికి మొక్కండి, మొక్కండి. నవ్వులొలుకుతున్న ఆ చెక్కిళ్ళను చూడండి. జిగి (కాంతివంతమైన) ఆ మోము (ముఖము) చూడండి. లోకములన్నీ ఆయన పుక్కిటిలోవున్నాయి స్వామి భుజకీర్తులను చూడండి. ఆయన యెదపైనున్న చక్కనమ్మే అలమేలుమంగ.

ముంజేతి కడియాలను చూడండి. నడుముకువ్రేలాడే కఠారు (ఖడ్గము) అదిగో. బంగారు రంగులో ఆ పచ్చబట్టు (పీతాంబరం) చూడండి. మన కన్నులముందు నిధానమైన, మూలభూతి (ఆదిదేవుడు) ఇదిగో ఇంగితమెరిగిన ఈ శ్రీవేంకటేశ్వరుడు.

**సంఖ్య : 29 సంపుటము : 3 పుట : రాగం : లలిత**

పల్లవి: చూడ వేడుకలు సొరిది నీ మాయలు
తోడనే హరిహరి దొరసీనిదివో
చ. 1: పుట్టేటి జీవులు పొదలేటి జీవులు
జట్టి గొని రిదియే జగమెల్లా
కట్టిడి కర్మము కాయజు మర్మము
నెట్టుకొన్న దిదె నిఖిలంబెల్లా
చ. 2: మునిగేటి ధనములు మోచేటి ధనములు
కలిమి మెరసె లోకంబెల్లా
పొలసి వేగుటలు పొద్దు గుంకుటలు
కలిగిన విదివో కాలంబెల్లా
చ. 3: తగిలేటి పురుషులు తమకపు కాంతలు
బగి వాయనిదీ బదుకెల్లా
అగపడి శ్రీవేంకటాధిప నీ కృపఁ
దెగని జీవనము దినదిన మెల్లా

**అవతారిక :**

అన్నమయ్య శ్రీహరి మాయావిలాసానికి అబ్బురపడుతున్నారు. ఇంతమంది జీవులెలాపుడుతున్నారు, యెలా తిని పెరుగుతున్నారు? ఎలా మదనతాపానికి గురియై కర్మలవలయంలో ఇరుక్కుంటున్నారు? అందర్నీ ఆడించే "ధనం" యెక్కడిది? రాత్రింబగళ్ళేమిటి? తగులుకొనే పురుషులు బుగులు పుట్టించే స్త్రీలు, ఈ బ్రతుకంతా ఇంతేనా? ప్రభూ! నీ కృపకలిగేదాకా ఇదింతే.

**భావదీపిక :**

ప్రభూ! నీ సొరిది మాయలు(మహిమల వరుస) చూస్తే గొప్ప వేడుకగావుంటుందయ్యా! ఇదిగో అవన్నీ మా మీదే దొరసీని (జరుగుతున్నాయి) హరిహరీ! యేమిటయ్యా?

జీవులు పుడుతూనేవున్నారు. కొన్ని వర్థిల్లుతూనే వున్నాయి. జగము అంటే జీవులు అతిశయించుటయేనా? కట్టడిచేసే "కర్మము" యెక్కడిది? మన్మథలీలా మర్మమేమిటి? ఈ సృష్టియంతా ఇలా నెట్టుకొస్తుంటుందా?

ఈ ధనం యెక్కడిది? కొందర్ని మునిగిపోయేటట్లు చేస్తుంది. కొందర్ని మోస్తుంది. లోకమంతా ఈ కలిమి మెరపులకి లోబడుతున్నారు. కాలము అనేది యెలా వచ్చింది. తెల్లవారుటలు, ప్రొద్దుగుంకుటలు యెలా క్రమం తప్పక కలుగుతున్నాయి?

పురుషులు అనాదిగా తగులుకొంటూనేవున్నారు. కాంతలు తన్మయత్వం కలిగిస్తూనేవున్నారు. ఈ బ్రతుకంతా బగివాయుటలేదు (విడిచిపెట్టుటలేదు). శ్రీవేంకటేశ్వరా! ఇటువంటి నా బ్రతుకులో నీ కృపకలిగి జీవనమంతా దినదినమూ తెగని శాంతినిస్తున్నది.



**సంఖ్య : 117 సంపుటము : 1 పుట : 80 రాగం : భైరవి**

పల్లవి: చూడుఁ డిందరికి సులభుఁడు హరి-
తోడు నీడయగు దొరముని యితఁడు
చ. 1: కైవల్యమునకుఁ గనకపు తాపల-
త్రోవై శ్రుతులకుఁ దుదిపదమై
పావన మొక రూపమై విరజకు
నావై యున్నాఁడిదె యితఁడు
చ. 2: కాపాడఁగ లోకములకు సుజ్ఞాన-
దీపమై జగతికిఁ దేజమై
పాపా లడఁపఁగ భవపయోధులకు
తేపై యున్నాఁడిదే యితఁడు
చ. 3: కరుణానిధి రంగపతికిఁ గాంచీ-
వరునకు వేంకటగిరి పతికి
నిరతి నహోబల నృకేసరికిఁ ద-
త్పరుఁడగు శఠగోప(ం) ముని యితఁడు

**అవతారిక :**

సులభుడైన శ్రీహరి తోడు నీడయగు "దొరముని" అంటున్నారు అన్నమయ్య తగు గురువుని. ఇటువంటి నూతన పదప్రయోగం ఆనాటి వారికేమోగాని ఈనాటి నా వంటి పరిమిత భాషాజ్ఞానులకు అంత సులభగ్రాహ్యం కాదు. శ్రీవేంకటగిరీశుడే అహోబల నరకేసరికి తత్పరుడైన తన గురుపుంగవులు శఠగోపం మునీ అని అంటున్నారు.

**భావదీపిక :**

మానవులారా! ఇతడు (శఠగోపయతి) సులభసాధ్యుడైన శ్రీహరి తనకుతోడు నీడగా వున్న దొరముని (యతీశ్వరుడు) చూడగా అందరికీ ఈయన సులభుడు.

ఈయన మోక్షమునకు బంగారపు తాపడము చేసిన త్రోవ. వేదములకు తుదిపదము జ్ఞానమునకు నిలయము. పుణ్యమే రూపుదిద్దుకున్న విరజానది (వైకుంఠం లో ప్రవహించేనది) లోని నావయైయున్నాడితడు. ఈయనే గురువు శఠగోపయతీంద్రులు.

లోకులను కావాడుటకు సుజ్ఞానదీపై ఈజగతికే తేజమై, పాపములను నిర్మూలించగా భవసాగరములను దాటుటకు తెప్పయైన మహానుభావుడే ఈ శఠగోపమౌని.

ఈయన కరుణానిధి. శ్రీరంగనాథునికి, కంచిలోని వరదరాజస్వామికి, తిరుమల శ్రీవేంకటేశ్వరునికి, శ్రేష్టుడైన అహోబిలనృసింహునికి తత్పరుడు (ఆశకలవాడు) అయిన మా గురువు శఠగోపముని అతనికతడే సాటి.

**సంఖ్య : 23 సంపుటము : 2 పుట : 16 రాగం : శ్రీరాగం**

పల్లవి: చెల్లఁబో యీజీవు లిలఁ జేసిన పాప మెంతో
వుల్లమున నున్న హరి వూరికే దవ్వాయ
చ. 1: కన్నచోటనే హరి కలఁడన్నవారికి
విన్నచోటనే విష్ణుడు వివేకులకు
వున్నతిఁ గొలువలేక వొద్దనుండఁగాఁ గొందరు
మిన్నుమీఁద వెదకేరు మితిమీఱఁ జదివి
చ. 2: పట్టినదే బ్రహ్మము పరమార్థవేత్తలకు
తిట్టులోనా దైవము దివ్యులకును
ముట్టి చేత మొక్కలేరు ముందటనే వుండఁగాను
బట్టబయలు పాకేరు బహుకర్మవిదుల
చ. 3: ఊపిరిలో దేవుఁడున్నాఁడు యోగీంద్రులకు
దాపున నున్నాఁడు హరిదాసులకును
యేపున శ్రీవేంకటేశు నేచి శరణనలేక
చాపలాన వెదకేరు సకలదేవతల

**అవతారిక :**

అన్నమయ్య యెంతో వ్యధజెందుతున్నారు. అయ్యయ్యో యెంత పాపం చేశారోగాని ఈ జీవులకు శ్రీహరి దూరమై పోయాడు కదా! వివేకం లేక అంతర్యామిని బయట వెదకుతున్నారు. ఏవేవో కర్మలు చేసి ఆయన మెప్పుపొందాలని చూస్తారు. కాని ఎన్నటికీ "త్వమేవ శరణం" అనలేరు.

**భావదీపిక :**

అయ్యయ్యో!! ఈ జీవులీ ప్రపంచంలో యెంత పాపము మూటకట్టుకొంటున్నారు!! ఊరకనే వారి మనస్సులలో అంతర్యామిగా వున్న శ్రీహరికి దూరమవుతున్నారు కదా!

హరివున్నాడని నమ్మేవారికి ఆయన వారున్న చోటనే కలడు. వివేకవంతులకు విష్ణువు వున్నచోటనే వున్నాడు. వేదవేదాంగాలు చదివినవారు కూడా తమ వద్దనే వున్న హరిని కొలువలేక ఆకాశం మీద వెదకెదరు.

పరమార్థము నెఱిగిన వారికి పట్టుకున్నదే బ్రహ్మము. దివ్యపురుషులు దైవనింద చేసినా అది శ్రీహరి సన్నుతిలాగే వుంటుంది. తమ ముందటనే వున్నప్పటికీ శ్రీహరిని చేకొని మొక్కలేరు. బాహ్యకర్మలు అనేకము చేసి కర్మ బంధాలలో తగులుకొంటారు.

యోగీంద్రులకు ఉచ్ఛ్వాస నిశ్వాసల్లోనే పరమాత్మవున్నాడు. హరిదాసులకు వారి దగ్గరనే వున్నాడు. ఏపున (విజృంభించి) శ్రీవేంకటేశ్వరుని, యేచి (అతిశయముగా) శరణు అని వేడుకోలేక చాపలాన (చాపల్యంతో) అందరు "దేవుళ్ళను" వెదకుతుంటారు.



**సంఖ్య : 320 సంపుటము : 1 పుట : 214 రాగం : ముఖారి**

పల్లవి: జనులు నమరులును జయలిడఁగా
ఘనుఁడదె వుయ్యాలగంభముకాడ
చ. 1: వదలక వలసినవారికి వరములు
యెదురెదురై తానిచ్చుచును
నిదురలేక పెనునిధినిధానమై
కదలఁ డదే గరుడగంభముకాడ
చ. 2: కోరినవారికి కోరినవరములు
వోరంతప్రొద్దు నొసుగుచును
చేరువయై కృపసేసీ నిదివో
కూరిముల నడిమిగోపురమాడ
చ. 3: వడి వేంకటపతి వరములరాయఁడు
నుడుగఁగాళ్ళుఁగన్నులు సుతుల
బడిబడి నొసఁగుచు బ్రాణచారులకు
కడిమి నీడ దిరుగని చింతాడ

**అవతారిక :**

శ్రీ వేంకటేశ్వరుని అనేకమంది అనేక కోరికలతో అనేక రకాలుగా అనేక దీక్షలతో సేవిస్తుంటారు అంటున్నారు అన్నమయ్య. నరులైనా, అమరులైనా ఆయన పవ్వళించే వూయల స్తంభం దగ్గర గుమ్మిగూడతారు. ప్రాణాచారాలు పడేవాళ్ళకి కొడుకుల్నిస్తాడట యెందుకంటే వాళ్ళకి ఆ చింత నీడలాగ వెంటాడుతుందట.

**భావదీపిక :**

ఒక పక్క విపరీతమైన కోలాహలం. జనులును, అమరులును జయజయ ధ్వానములను చేస్తున్నారు. అదిగో ఘనుడైన తిరుమలేశుని ఊయల స్తంభము వద్ద యెంత ఉత్సాహంగా వున్నారో చూడండి.

వదలలేక వదలిపోతున్న భక్తులకు తానే యెదురేగి నిద్రను కూడా మఱచి పెన్నిధి వలె అనేక వరములిస్తున్నాడు. గరుడ ధ్వజము దగ్గర నుండి కదలక ఆ శ్రీవేంకటేశ్వరుడు వరాలిస్తూనే వున్నాడు.

కోరినవారికి కోరిన వరములిస్తున్నాడు. అంతేకాదు, ఓరంతప్రొద్దు (రోజంతయూ) ఇస్తూనే వున్నాడు. వారి మీద అంతులేని కృప కలుగుటచేత ఇదిగో వాళ్ళకు ఆ తిరుమల గోపురముల నడుమ గొప్ప ప్రీతితో వరములిస్తున్నాడు.

శ్రీవేంకటేశుడు వడిగా వరములిచ్చే రాయుడు. కాళ్ళు వుడిగిపోయిన (చచ్చుబడ్డ) వాళ్ళకి, కళ్ళులేని వాళ్ళకి, కొడుకులు లేని వాళ్ళకి వడివడిగా కావలసినవి ఇస్తాడని కొంతమంది ప్రాణాచారాలు పడుతున్నారు. అయినా వాళ్ళని చింత విడచుటలేదు.

**సంఖ్య : 396 సంపుటము : 2 పుట : 267 రాగం : భవుళి**

పల్లవి: జలజనాభ హరి జయ జయ
యిల మానేరము లెంచకువయ్యా
చ. 1: బహుముఖముల నీ ప్రపంచము
సహజగుణంబుల చంచలము
మహిమల నీ విది మరి దిగవిడువవు
విహరణ జీవులు విడువఁగఁగలరా
చ. 2: పలునటనలయీ ప్రకృతి యిది
తెలియఁగఁ గడునింద్రియవశము
కలసి నీ వందే కాఁపురము
మలినపుజీవులు మానఁగఁగలరా
చ. 3: యిరవుగ శ్రీవేంకటేశుఁడ నీమాయ
మరలుచ నీవే సమర్థుఁడవు
శరణనుటకే నే శక్తుఁడను
పరు లెవ్వరైనాఁ బాపఁగఁగలరా

**అవతారిక :**

అన్నమయ్య పద్మనాభుడైన శ్రీహరికి శరణాగతి పలుకుతున్నారు. స్వామీ! నీకు జయము జయము ఈ ప్రపంచము, ప్రకృతి, మాయ అన్నీ నీ కల్పితాలే. వీటిని నిరోధించటం అల్పులమైన ఈ జీవుల వల్లయేమవుతుంది? వీటి ప్రభావం వలన యెన్నో నేరాలు చేస్తున్నాం. మాపై కృపతో వాటిని లెక్క పెట్టకు అంటున్నారు.

**భావదీపిక :**

జలజనాభుడవైన శ్రీహరీ! నీకు జయము జయము, ఇల (భూమి మీద) మా నేరములు అసంఖ్యాకము. వాటిని యెంచి లాభమేమిటి? ఎంచకువయ్యా!

నీవే సృష్టించిన ఈ ప్రపంచము బహుముఖముల (అనేక రకాలుగా)వున్నది. చంచలత్వము దీని సహజ గుణం. నీ మహిమలతో అతిశయించిన దీనిని నీవు విడువవు. నీ మహిమతో విహరించే జీవులు మరింక యెట్లు దీనిని విడువగలరయ్యా?

ఎన్నో నటనలతో ఈ "ప్రకృతి" విలసిల్లుతున్నది. ఇదంతా మా ఇంద్రియాలను ప్రభావితం చేస్తున్నది. నీవు అంతరాత్మరూపంలో మాలోనే కాపురము వున్నావు. నీవు స్వచ్ఛమే. కాని మేము మలిన జీవులము కదా! ఈ ఇంద్రియాల ఉద్ధతిని మానగలమా (కాదనగలమా?)

మాలో స్థిరపడిన ఓ శ్రీవేంకటేశ్వరా! నీ మాయను మరలించటానికి నీవే సమర్థుడవు. నేను నీకు శరణాగతి చేయుటకు మాత్రమే శక్తి కలిగివున్న వాడను. నా కష్టాలను పరులెవ్వరైనా బాపగలరా? (తీర్చగలరా తండ్రీ?)



**సంఖ్య : 197 సంపుటము : 1 పుట : 132 రాగం : నాట**

పల్లవి: తనకేడ చదువులు తనకేడ శాస్త్రాలు
మనసు చంచలబుద్ధి మానీనా
చ. 1: జడ్డుమానవుఁడు చదువఁజదువ నాస
వడ్డివారుఁగాక వదలీనా
గుడ్డికుక్క సంతకుఁబోయి తిరిగిన
దుడ్డుపెట్లే కాక దొరకీనా
చ. 2: దేవదూషకుఁడై తిరిగేటివానికి
దేవతాంతరము తెలిసీనా
శ్రీవేంకటేశ్వరుసేవాపరుఁడుగాక
పావనమతియై పరగీనా

**అవతారిక :**

అన్నమాచార్యులవారు ఈ చిన్న కీర్తనలో చక్కటి సూక్తిని చెబుతున్నారు. చంచల మనస్కుడైన మానవుడు యెన్ని శాస్త్రాలు చదివినా, యెంత గొప్ప చదువు చదివినా నిష్ప్రయోజనం అని చెబుతున్నారు. శ్రీవేంకటేశుని సేవకుడు కానివాడు యేనాటికీ పుణ్యాత్ముడు కాలేడంటున్నారు.

**భావదీపిక :**

అయ్యలారా! తనకేడ చదువులు శాస్త్రాలు. వాటి వల్ల వాడికి కలిగే ప్రయోజనమేమి? స్థిర మనస్కుడవటమే చదువులు (వేదములు) శాస్త్రముల వలన ప్రయోజనం. స్వతహాగా చంచలమనస్కుడైతే వేదాలు శాస్త్రాలు చంచల బుద్ధిని మాన్పుతాయా?

జడ్డుమానవుడు (బుద్ధి మాంద్యం గల మనిషి) వేదములు చదివినా ఆశ వడ్డి వారుగాక (అధికము కాకుండా) వుంటుందా చెప్పండి. గుడ్డి కుక్క తాను పోయే దారి తెలియక సంతకు పోయి తిరిగితే దుడ్డు కఱ్ఱతో కొట్టక గౌరవించి ఆదరిస్తారా?

దైవనింద చేస్తూ తిరిగే వానికి దేవతాంతరము (దేవతలలో తారతమ్యం) తెలుస్తుందా? వాడు గుడ్డి కుక్కలాంటివాడే. శ్రీవేంకటేశ్వరుని సేవాతత్పరుడు కాని వాడు యేనాటికీ పావన మనస్కుడు (పుణ్యాత్ముడు) కాలేడు.

**సంఖ్య : 147 సంపుటము : 2 పుట : రాగం : లలిత**

పల్లవి: తలగరో లోకులు తడవకరో మమ్ము
కలిగినదిది మా కాఁపురము

చ. 1: నరహరికీర్తన నానిన జిహ్వ
వొరుల నుతింపఁగ నోపదు జిహ్వ
మురహరు పదములు మొక్కిన శిరము
పరుల వందనకుఁ బరగదు శిరము

చ. 2: శ్రీపతినే పూజించిన కరములు
చోఁపి యాచనకుఁ జొరవు కరములు
యేపున హరికడ కేఁగిన కాళ్ళు
పాపుల యిండ్లకుఁ బారవు కాళ్ళు

చ. 3: శ్రీవేంకటపతిఁ జింతించు మనసు
దావతి నితరముఁ దలఁచదు మనసు
దేవుఁడతని యాధీనపు తనువు
తేవల నితరాధీనము గాదు

**అవతారిక :**

తలగరో అంటే "తొలగండిరా" అని అర్థం. తడవకురో అంటే "స్పృశించకండిరా" అని అర్థం. ఈ మా సంసారం ఇట్లాగే వుంటుంది. నా మాట విని దీనినుంచి తొలగిపోండి, దీనిని తాకవద్దు అంటున్నారు అన్నమయ్య. ఎందుకో తెలుసుకోవాలంటే కీర్తన ఆసాంతం వినవలసిందే.

**భావదీపిక :**

ఓ అయ్యలారా! లోకుల్లారా! తలగరో (తొలగండయ్యా!) తడవకురోమమ్ము (మమ్మల్ని తాకవద్దు) మా కాపురము (సంసారము) కలిగినదిది (ఇట్లాగే వుంటుంది).

నరహరి కీర్తనలలో నానిన మా నాలుక పరులను కీర్తించుట కంగీకరించదు. మా నాలుకదారి అదే. మురహరి పదములకు మొక్కే మా శిరస్సు పరులకు వందనము చేయుటకు అంగీకరించదు.

మా కరములు (చేతులు) శ్రీపతినే పూజిస్తాయి. చోఁపి(చొప్పించి) యాచించుటకు మాకరములు జొరవు (జొరబడవు). అతిశయముగా శ్రీహరికడకేగిన మా కాళ్లు పాపుల ఇండ్లకు బారవు (పరుగులు తీయవు).

శ్రీవేంకటపతిని మాత్రమే చింతించే నా మనస్సు దావతి (అత్యాశక్తితో) ఇతరములను తలచుటకు అంగీకరించదు. ఈ నాతనువు దేవుడైన ఆయన ఆధీనమైయున్నది. ఇక నా తనువు తేవల (ఉత్తవముగా) పరుల ఆధీనము కానేరదు.



**సంఖ్య : 70 సంపుటము : 1 పుట : 48 రాగం : దేవగాంధారి**

పల్లవి: తలఁచినవిన్నియుఁ దనకొరకేఁ వెలిఁ
దెలియుట దనలోఁ దెలియుట కొరకే

చ. 1: ఉదయమందుట భవముడుగుట కొరకే
చదువుట మేలువిచారించు కొరకే
బ్రదుకుట పురుషార్థపరుఁడౌట కొరకే
యెదిరిఁ గనుట తన్నెఱుఁగుట కొరకే

చ. 2: తగులుట విడివడఁదలుచుట కొరకే
నొగులుట కర్మమనుభవించు కొరకే
చిగురౌట కొమ్మయి చెలఁగుట కొరకే
బెగడుట దురితము పెడఁబాయు కొరకే

చ. 3: యీవలఁ జేయుట ఆవలి కొరకే
ఆవలనుండుట యీవలఁ కొరకే
యీవలనావల నెనయఁ దిరుగుటెల్ల
శ్రీవేంకటేశ్వరుఁ జేరుట కొరకే

**అవతారిక :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన పల్లవిని అర్థం చేసికొవటం క్లిష్టమే. అన్నమయ్య కాలంలో "అన్నియు తనకొరకే" అనే మాటను "ఇన్నియు తన కొరకే" అని ప్రయోగించేవారు. నాకు ఈ పల్లవి ఇలా అర్థమైంది. మనిషి ఏ ఆలోచన చేసినా, అది కేవలం తన కొరకే తన బయట జరిగేవి తెలుసుకొంటే కాని తన అంతరాత్మడైన హరిని తెలియలేదు. దీనినే వేమన "కామి కాక మోక్షగామి కాడు" అన్నాడు.

**భావదీపిక :**

జనులారా! తలచినవి అన్నియును తన స్వప్రయోజనం కొరకే సుమా! వెలి (బాహ్యప్రపంచంలో) జరిగేవి తెలుసుకోవటం కూడా తనలోని అంతర్యామిని తెలియుట కొరకే.

ఉదయమందుట (పుట్టుట) భవముడుగుట (పుట్టుక లేకుండుట) కొరకే. ఎంత చదివినా దాని ప్రయోజనం మంచిచెడ్డలు తెలియుట కొరకే. జీవించుట ధర్మార్థకామమోక్ష సాధన కొరకే. ఎదిరి (ఎదుట వారిని) పరిశీలించుట తాను యెట్టివాడో తెలియుట కొరకే.

దేనినైనా తగులుకొంటే అది వియోగం కొరకే సుమా! నొగులుట (బాధపడుట) పూర్వకర్మ అనుభవించుట కొరకే. చిగురించినది కొమ్మగా మారుట కొరకే. బెగడుట (భయపడుట) పాపము నుండి దూరంగా వుండుట కొరకే.

ఈవల జేయుట (ఇహలోకంలో చేసేదంతా), ఆవల కొరకే (పరలోకంలో అనుభవించటానికే). ఆవల నుండుట (ఆ పరలోకంలో వుండటం కూడా) ఈవల కొరకే (మళ్ళీ ఇక్కడ పుట్టడానికే). ఇహపరలోకాలలో ఈ చక్రభ్రమణం అంతా చిట్టచివరకు శ్రీవేంకటేశ్వరుని చేరుట కొరకే.

**సంఖ్య : 193 సంపుటము : 1 పుట : 128 రాగం : సామంతం**

పల్లవి: తానే కాకెవ్వరు మాకు దాతయు దైవము తన
లోనఁ బెట్టుకొని మాకు లోనైనవాఁడు
చ. 1: చదవించి, కూడువెట్టి, జారకుండ నిల్లుగట్టి
బెదురులేని బుద్ధి పిన్ననాఁడే చెప్పి
యెదరి నడిగి, ద్రవ్యమిది గొమ్మనుచు నిచ్చి
పదిలమై తమ్ముఁ బాలించువాఁడు
చ. 2: మోహవియోగమ్ము, మోహానురాగమ్ము
దేహవిభాగంబు దెలిపిన కలికి
ఐహికమున వేంకటాధీశుఁడై సర్వ-
దేహరక్షకుఁడై తిరుగుచున్నాఁడు

**అవతారిక :**

అన్నమయ్య కీర్తనలలో వొకనొక విశిష్ఠత శ్రీహరి దశావతార ప్రస్తుతి. అదియెంత గూఢంగా వుంటుందంటే తెలిసిన వారు ఇందులో దశావతార వర్ణన వున్నదని చెప్పేదాకా తెలియదు. వర్ణన విస్తృతంగా వుంటేయేమో గాని, ఈ కీర్తనలో వలె క్లుప్తంగా వుంటే నాబోటి వాడిపని "కుడితిలో పడ్డ ఎలుక" మాదిరి. మీరే చూడండి.

**భావదీపిక :**

మాకు తానే కాక (శ్రీహరి తప్పించి) యెవ్వరుదాత? ఎవ్వరు దైవము? మమ్మల్ని తనలోనే పెట్టుకొన్న ఘనుడు మా శరణాగతి వలన మాకే లోనైన వాడు (లొంగియున్నవాడు).

చదివించి (వేదములను రక్షించిన మత్స్యావతారము) కూడువెట్టి (అమృతాన్ని ఇప్పించిన కూర్మావతారము), జారకుండనిల్లు గట్టి (భూమిని నిలిపిన వరాహావతారము), బెదురులేని బుద్ధి పిన్ననాడే చెప్పి (బాల ప్రహ్లాదునికి అభయము నొసగిన నరసింహావతారము), యెదిరినడిగి (శత్రువుని యాచించిన వామనుడు), ద్రవ్యమిది గొమ్మని నిచ్చి (సిరిసంపదలతో సహా భూమండలాన్ని దానం చేసిన పరశురామావతారుడు), పదిలమై తమ్ముని పాలించిన వాడు (జాగ్రత్తగా తమ్ముడు లక్ష్మణుని రక్షించిన శ్రీరామావతారము)

మోహవియోగమ్ము గోపికలకు గల్పించిన శ్రీకృష్ణావతారము), మోహనురాగములతో త్రిపురాసురుల భార్యల శీలభంగము చేసిన బుధావతారము), దేహవిభాగంబుదెలిపిన కల్కి అవతారము. ఇహలోకంలో సర్వదేజులను (సమస్త జీవులను రక్షించువాడై తిరుగుచున్న ఈ శ్రీవేంకటేశ్వరుడే ఆదశావతారమూర్తి అని మళ్ళీ చెప్పవలెనా?



**సంఖ్య : 128 సంపుటము : 1 పుట : 88 రాగం : గుండక్రియ**

పల్లవి: తానే తెలియవలె తలఁచి దేహి తన్ను
మానుపువారలు మరి వేరీ
చ. 1: కడలేని భవసాగరము చొచ్చినతన్ను
వెడలించువారలు వేరీ
కడుబందములచేతఁ గట్టుపడినతన్ను
విడిపించువారలు వేరీ
చ. 2: కాఁగినినుము వంటికర్మపు తలమోపు -
వేఁగు దించేటివారు వేరీ
మూఁగిన మోహపుమూఁకలు తొడిఁబడ
వీఁగఁ దోలేటివారలు వేరీ
చ. 3: తిరువేంకటాచలాధిపునిఁ గొలువుమని
వెరపు చెప్పెదువారు వేరీ
పరివోని దురితకూపములఁ బడకుమని
వెరపు చెప్పెడివారు వేరీ

**అవతారిక :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనకు "ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి. ఆ నిశ్చయములేని వారిని (దేహులను) వారి అవలక్షణాలనుంచి విడగొట్టే వారెక్కడుంటారు?" అని ప్రశ్నిస్తున్నారు. చివరకు శ్రీవేంకటేశ్వరుని శరణు కోరమని కూడా చెప్పేవారుండరు. ఆయనకే మనపై దయకలగాలి అంతే. అదెల్లా సాధ్యం?

**భావదీపిక :**

ఈ ప్రపంచంలో దేహి (దేహముదాల్చిన ప్రాణి) తలచి (తానెవరో తన గమ్యమేమిటో ఆలోచించి) తానే తెలుసుకోవాలి. మానపువారట (వాడి అజ్ఞానాన్ని తొలగించువారు) మరివేరే (యెక్కడుంటారు?).

కడలేని (అంతుపొంతూలేని) భవసాగరమున చొచ్చియున్న వాడిని వెడలించు (బయటకు తీసే) వారు యెక్కడున్నారు? అనేక భవబంధములచేత కట్టుపడిన వానిని విడిపించేవారు యెక్కడవున్నారు?

ఈ దేహియొక్క కర్మఫలమెట్టిదంటే, ఎట్టగా కాల్చిన ఇనుపగుండులాంటిది. దాన్ని వాడే తలకెత్తుకొని యోయాలి.దాని 'వేఁగు'' (తపన) తొలగించేదెవరు? వీడిని మోహపుమూకలు తొడిబడ (విచలుతుని చేస్తే) వాటిని పారద్రోలేవారేరీ?

ఈ ప్రాణికి నాయనా! చెడిపోతున్నావు, ఇకనైనా శ్రీవేంకటేశ్వరుని శరణమని వేడుకోరా అని వెరపు (ఉపాయం) చెప్పేవారు యేరీ? పరివోని దురితాల కూపములలో (అపరిమితమైన పాపపురొంపిలో) పడకుండా వెరపు ఇది అని చెప్పేవారేరి?

**సంఖ్య : 317  సంపుటము : 1  పుట : 212  రాగం : నాట**

పల్లవి: తెలిసినఁ దెలియుఁడు తెలియనివారలు
తొలఁగుఁడు బ్రహ్మాదులె యెరుఁగుదురు

చ. 1: వరదుఁ డఖిలదేవలతకు వంద్యుఁడు
గరదుఁడసురలకుఁ గంటకుఁడు
పరమాత్ముఁడంబుజభవ శివాదులకుఁ
బరులకెల్ల మువ్వురలో నొకఁడు

చ. 2: దేవుఁడు సనకాదిమునులకునుఁ, బర-
దైవ మఖిలవేదములకును
కైవల్యమొసఁగుఘననిధి, విధికిమ-
హావిధి, జడులకు యాదవకులుఁడు

చ. 3: ఆద్యుఁడచలుఁడు మహాభూత మితఁడ-
భేధ్యుఁడ సాధ్యుఁడు భీకరుఁడు
సద్య:ఫలదుఁడు సకలమునులకును
వేద్యుఁడితఁడె పో వేంకటవిభుఁడు

**అవతారిక :**

శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మాదులు మాత్రమే తెలియుదురు తమకేమీ తెలియదని తెలిసినవారలు తెలియుటకు యత్నించెదరు. తెలియని వాళ్ళు తెలుసుకోలేరు కనుక తొలగుడు, అంటున్నారు అన్నమయ్య.అందరికీ ఆద్యుడు, దేనికీ చలించనివాడు, ఈ మహాభూతము అభేద్యుడు, అసాధ్యుడు, తగినంత ఫలమునొసగే వేత్త అంటున్నారు.

**భావదీపిక :**

పరమాత్ముని తెలిసినవారు (ఏమీ తెలియమని తెలిసిన వారు) తెలియుడు (తెలియండి) తెలిసినివారలు తొలగిపోండి. ఎందుకంటే బ్రహ్మాదులే ఆయనను తెలియగలరు.

స్వామి, వరదుడు అఖిలదేవతలకు పూజనీయుడు,అసురులకు గరదుడు (విషము పెట్టువాడు) మరియు కంటకుడు (ముల్లువంటివాడు) అంబుజభవునకు (బ్రహ్మకు) శివునకు ఇతడే పరమాత్మ, తక్కిన సామాన్యులకు ఆ ముప్వురు త్రిమూర్తులలో వొకడు.

సనకసనందనాది మునులకు ఇతడే దేవుడు. వేదములన్నీ కీర్తించే పరదైవంబీతడే. మోక్షదాత ఈ ఘననిధియే. విధిని శాసించే మహావిధి ఈ స్వామియే. దుర్యోధనాది జడులకు మాత్రం ఇతడివేమికాదు కేవలం యాదవుడు.

అన్నింటికీ ఆదిమూలమైన ఇతడు అచలుడు. భూతములకు (జీవులకు) మహాభూతమితడే. అంతేకాదు ఇతడభేద్యుడు, అసాధ్యుడు మరియు భీకరుడు, సకలమునకు తగినంత ఫలము నొసగేవాడు. ఈ శ్రీవేంకటేశ్వరుడే పో! వేదవేద్యుడు.



**సంఖ్య : 495  సంపుటము : 1  పుట : 332  రాగం : శ్రీరాగం**

పల్లవి: తెలిసిన బ్రహ్మోపదేశ మిదే
సులభ మనుమ (చు) నిదే చూచీఁగాక

చ. 1: పుట్టించినహరి పూరి మేపునా
గట్టిగా రక్షించుఁగా కతఁడు
కట్టడిజీవుఁడు కానక నోళ్లు
తెట్టఁ దెరువునకు తెఱచీఁ గాక

చ. 2: అంతరాత్మ తనునట్టే మఱచేనా
చింతలోఁ బెరరేఁచీఁగాక
పంతపుజీవుఁడు భ్రమసి సందుసుడి
దొంతులు దొబ్బుచుఁ దూరీఁగాక

చ. 3: నొసల వ్రాసినవి నోమించుఁగా కతఁ-
డెసగిన శ్రీవేంకటేశ్వరుఁడు
విసుగక జీవుఁడు వీరిఁడిమాయల-
నసురుసురయి తా నలసీఁగాక

**అవతారిక :**

నాకు తెలిసిన బ్రహ్మోపదేశము ఇదే నంటున్నారు అన్నమయ్య. పుట్టించేది, తిండిపెట్టించేది, రక్షించేది హరియే. జీవుడు నోరు బార్లా తెరిచినంత మాత్రాన యేమవుతుంది? అంతరాత్మగా ఆ హరియే అన్నీ ప్రేరేపిస్తాడు. నొసట వ్రాసింది నోమించి తీరుతాడు. జీవుడేమో ఉస్సురుమని అలిసిపోతూనేవుంటాడు.

**భావదీపిక :**

(నాకు) తెలిసిన బ్రహ్మోపదేశము ఇదే సుమండీ! ఇదే అత్యంత సులభమని గ్రహింతురుగాక!

ఈ జీవులను పుట్టించిన శ్రీహరియే పూరి (తిండి) మేపుతున్నాడాలేదా? అతడే గట్టిగా రక్షించుచున్నాడు కదా! తాము కట్టడిలో వున్నామని తెలియని జీవులు ఇది గ్రహించక నోళ్ళు తెట్టతెరవున (బార్లా) తెరచివుంచుతారు అంతే.

మన అంతరాత్మయెవరు? హరియేకదా! ఆయన మనకు చింతకలిగితే ప్రేరేపించి యేదో మార్గం చూపిస్తాడు. పంతము స్వభావంగా కల జీవుడు భ్రమ పొంది సందుసుడి (మధ్యలో దూరి) వరుసగా దొబ్బుచు (ముందుకు తోస్తూ) తానే చేస్తున్నానను కొంటాడు.

శ్రీవేంకటేశ్వరుడనబడే అతడు తానే మన నొసటి మీద వ్రాసినవి నోమించు (చేయిస్తుంటాడు). పాపం విసుగులేని జీవుడు వీరిడి మాయలన్ (మూర్ఖంగా మాయలకు) చిక్కి ఉసురుసురయి (నీరసించి) తాను అలసిపోతుంటాడు. పాపం, ఆ కథ ఇంతే.

**సంఖ్య : 119 సంపుటము : 1 పుట : 82 రాగం : ఆహిరి**

పల్లవి: తోరణములే దోవెల్లా
మూరట బారట ముంచినలతల
చ. 1: కూరిమిమటములు గోపురంబులును
తేరుపడగెలే తెరువెల్లా
కోరినపండ్లు గురిసేటితరువులు
తోరములైనవెదురుజొంపములు
చ. 2: ఆటలుఁ దిరుపులు నందపుటురువులు
పాటలు వనవైభవమెల్లా
కూటువ నెమళ్ళ కోవిల గుంపుల
పేటలఁ దేటలపెనుఁగూటములు
చ. 3: వింజామరలును విసనకఱ్ఱలును
గొంజెగొడుగులే కొండెల్లా
అంజనగిరిరాయుడు వేంకటపతి
సంజీవని పరుషల కొదవఁగను

**అవతారిక :**

అన్నమయ్య తిరుమలలో ఇంటింటి ముందు త్రోవ అంతా తోరణాలు వ్రేలాడగట్టబడినవని చెబుతున్నారు. అవి లతలతో చేయబడినవి కాబట్టి కొన్ని మారెడున్నాయట, కొన్ని బారెడున్నాయట, అంజనాద్రి విభుడు ఇక్కడి పరుషలకు సంజీవని అయ్యాడట, అంటే యేమిటి? భావదీపిక చదవండి మరి.

**భావదీపిక :**

దొవెల్లా (దారిలో అంతా) తోరణములే. అవియన్నీ ముంచిన లతలతో (అతిశయించిన పూలతీగలతో) చేయబడినవి. కొన్ని "మూర" వున్నాయట, కొన్ని "బార" వున్నాయట.

ఆ తిరుమలలో ప్రీతికరమైన మఠములు, గోపురములు, తేరుపడిగెలె (రథములకు అమర్చిన జెండాలే) తెరువెల్లా (దారిపొడుగునా) కనబడుతున్నాయి. కావలసినన్ని పండ్లను కురిపించే చెట్లు, తోరములైన (బలిష్ఠమైన) వెదురు చెట్ల జొంపములు (కొమ్మలు) కనబడుతున్నాయి.

యాత్రికుల ఆటలు, తిరుపులు (అటూఇటూ తిరుగుట) అందపుటురువులు (అందమైన రూపములు) కనబడుతున్నాయి. వారి పాటలతో వనమెల్లా వైభవంగావున్నది. నెమళ్ళ కూటములు, కోయిలల గుంపులు హారములుగా నిలిచి నిర్మలమైన పెద్ద సభలు నిర్వహిస్తున్నాయి.

తిరుమలకొండపై యెక్కడ చూచినా వింజామరలు, విసనకఱ్ఱలు, గొంజగొడుగులు (బొడ్డుదగ్గర నడుముకు బిగించిన వస్త్రముపై నిలబెట్టిన గొడుగులు) కనుపిస్తున్నాయి. అంజనాద్రి యేలిక అయిన శ్రీవేంకటపతి, పరుషలకు (యాత్రికుల గుంపులకు) సంజీవనియై కుదిరినాడు.



**సంఖ్య : 151 సంపుటము : 1 పుట : 101 రాగం : శ్రీరాగం**

పల్లవి: దినము ద్వాదశి నేడు తీర్థ దివసము నీకు
జనకుడ అన్నమాచార్యుడ విచ్చేయవే.
చ. 1: అనంతగరుడ ముఖ్యులయిన సూరిజనులతో
ఘననారదాది భాగవతులతో
దనుజమర్దనుడైన దైవశిఖామణి తోడ
వెనుకొని ఆరగించ విచ్చేయవే.
చ. 2: వైకుంఠాన నుండి ఆళువారల లోపలనుండి
లోకపు నిత్యముక్తులలోన నుండి
శ్రీకాంతతోడనున్న శ్రీవేంకటేశు కూడి
ఈకడ నారగించ నింటికి విచ్చేయవే.
చ. 3: సంకీర్తనముతోడ సనకాదులెల్ల పాడ
పొంకపు శ్రీవేంకటాద్రి భూమినుండి
లంకె శ్రీవేంకటగిరి లక్ష్మీవిభుడు నీవు
సంకెల మాయింటి విందు లారగించవే.

**అవతారిక :**

అన్నమాచార్యుల వారి 513 వర్ధంతి నాడు, నేను తాళ్ళపాక పెద తిరుమలయ్య పాడిన ఈ కీర్తన పాడి, ఇట్లా వివరించగలుగుతున్నానంటే అది అక్కడవున్న శ్రీవేంకటేశ్వరుని కృప, "అక్కడే" వున్న నా గురువు అన్నమయ్య అనుగ్రహం. ఇది ఇలాగే నేను "రేపు" ఏ లోకానికి పోయినా, నాకొక్కసారి ఆయనను "చూచే" భాగ్యం కలిగించమని వేడుకొంటాను. రమణుని దయ.

**భావదీపిక :**

నేడు ద్వాదశి దినము. నేడు నాజనకుడు అన్నమాచార్యుని తీర్థదివసము (విష్ణుసాయుజ్యము చెందిన రోజు). నాతండ్రి అన్నమాచార్యుడా ఇక్కడ వచ్చి అనుగ్రహించు.

అనంతుడు, గరుడుడు మరియు ముఖ్యులైన వైష్ణవగురువులతోన, నారదాది భాగవతులతోను, దనుజాంతకుడైన శ్రీహరితోను, వెనుకొని (వెంటతెచ్చుకొని) ఆరగించుటకు విచ్చేయవయ్యా!

నీతోపాటు వైకుంఠానవున్న ఆళ్వారులతోను, అంతర్ముఖులైన హరిసాయుజ్యం పొందిన వారితోను, శ్రీకాంతయైన లక్ష్మీదేవితోను శ్రీవేంకటేశ్వరునితోను కలసి ఇక్కడ మా ఇంట విందునారగించ విచ్చేయవయ్యా! మమ్ము అనుగ్రహించు

ముగ్ధులైన సనకాదులు కూడా నీ మధుర సంకీర్తనలు వింటూ భూమిమీద లంకె (వరుసగా నున్న) శ్రీవేంకటాద్రికి విచ్చేశారు. ఆ ఏడుకొండలు శ్రీలక్ష్మికి విభుడైన శ్రీవేంకటేశ్వరునితో కలిసి నీవు అంకెల (జతగా) మా ఇంటికి విచ్చేసి మమ్మానందింప జేయుమని మా మనవి.

**సంఖ్య : 21  సంపుటము : 1  పుట : 14  రాగం : శుద్ధ వసంతం**

పల్లవి: దురితదేహులే తొల్లియును శ్రీ-
హరి భజించి నిత్యాధికులైరి
చ. 1: అనంతకోటి మహామునులు ఈ-
సనకాదులు నిశ్చలయశులు
ఇనశశినయనుని నితనిని మును
గని భజించి గత కల్మషులైరి
చ. 2: అతిశయమతులు మహామహులు సుఖ-
రతి విముఖులును చిరంతనులు
హిత విచారమతి నితనిని సం-
తతమును భజించి ధన్యులైరి
చ. 3: దేవతాధిపులు దివ్యులును కడుఁ-
బావనులును తగ బరహితులు
యీ వేంకటపతి నితనిని
సేవించి సుఖాంచితమతులైరి

**అవతారిక :**

అన్నమయ్య ఈ కీర్తన ఈనాడు అందరికంటే ఉత్తములు, అధికులుయైన మహామునులు, చిరంజీవులైన మహామహులు, దేవతాధిపతులు యీ శ్రీవేంకటపతిని సేవించి అంత్యమున మోక్షసుఖములు పొందిరి అని నిర్ద్వంద్వంగా చెబుతున్నారు. అందుకే దైనందిన జీవితంలో కూడా వొకడు రాజభోగి అయితే మరొకడు యాచకుడవుతున్నాడు..

**భావదీపిక :**

జీవులందరూ తొల్లి (గతజన్మలలో) దురితదేహులే (పాపులే). వారందరూ యేదో ఒక జన్మలో హరిభక్తులై హరిని భజించి నిత్యాధికులైరి (దైనందిన జీవితంలో అధికులైరి).

ఈ సృష్టిలో కోట్లాది మహామునులు, సనకసనందనాది నిశ్చలులైన యతులు, మును(సృష్టి మొదట్లో) ఇనశశినయనుడు (సూర్యచంద్రులు నేత్రాలుగాగల) ఇతనిని భజించి, గత కల్మషులైరి (నిష్కల్మషులైనారు).

అతిశయమతులు (పరిపక్వతజెందిన చిత్తముగల) మహామహులు, సుఖేశ్చయందు విముఖతకలవారు, చిరంతనులు (చిరంజీవులు), పరులహితమును గురించే ఆలోచించే మనస్సుకల ఉన్నతులు, ఇతనిని నిరంతరము భజించి ధన్యులైనారు.

దేవతలలో సర్వోన్నతులైనవారు, దివ్యత్వమును పొందినవారు, కడున్‌పావనులు (ఎంతో పుణ్యాత్ములు), పరులహితమే తగినదని వొనరించువారు, యెందరో ఈ శ్రీవేంకటేశ్వరుని సేవించి, సుఖాంచితమతులు (అంత్యమున మోక్షసుఖమును పొందిన) వారైనారు.



**సంఖ్య : 38  సంపుటము : 2  పుట : 26  రాగం : దేసాక్షి**

పల్లవి: దేవ నీదయ యెంతునో దివ్యసులభ మెంతునో
కావించి గంటుగట్టుక కాచుకుండే విదివో
చ. 1: వెదక నావసమా వేగుదాఁకా నిన్ను నేను
కదిసి నీమూరితి కాన వసమా
యెదుట శంఖుచక్రాల యెట్టిదైవమ నేనని
పొదుగుచు నీకు నీవే పొడచూపేవు గాక
చ. 2: పొగడ నావసమా పురుణించి నీగుణాలు
తగుల నావసమా నీతలుపెఱిగి
నిగడి వేదశాస్త్రాల నిన్ను నీవే చెప్పుకొని
పగటు మాయజ్ఞానము పాపేవింతే కాక
చ. 3: కొలువ నావసమా గుఱుతెఱిఁగి నీవెంట
చెలుగి నాచేతులు బూజించ వసమా
నిలిచి శ్రీవేంకటేశ నీవే నాయెదలో నుండి
మలసి పెరరేఁపుచు మన్నించేవు గాక

**అవతారిక :**

అన్నమయ్య ఈ కీర్తనలో స్వామీ! నీవే మమ్మల్ని దయతో మన్నించాలిగాని నీ మూర్తిని “చూడలేము”, నీ గుణాలు వర్ణించలేము, నిన్ను కొలిచి పూజించనూలేము. ఎందువల్ల నంటే మా అజ్ఞానం వలన, చివరికి నీవే నన్ను మన్నించి నీ శ్రీవేంకటేశ్వరుని రూపంలో నాయెదలో నిలిచావు. “గంటకట్టుకొని” నన్ను కాచుకొంటున్నావు-అంటున్నారు.

**భావదీపిక :**

దేవా! నీదయ యెంతటిదో, నీ దివ్య సులభము (అనుగ్రహము) యెంతటిదో యెవరు వర్ణించగలరు? ఇదిగో, నీవు కావించి (అవునట్లుచేసి) గంటుగట్టుక (ముటకట్టినట్లు) కాపాడెదవు.

తెల్లవారేదాకా నిన్ను వెదకటం నావల్ల నవుతుందా? నీ మూరితి(మంగళమూర్తి)ని చూడటం నా వశమౌతుందా? దివ్యశంఖచక్రాలతో నీ పరమాత్మరూపు ఒకచోట చేర్చి నీవే చూపించాలి. నీకు నీవే దర్శనమివ్వాలి. అంతేగాని... నాతరమా?

పోనీ, నిన్ను కీర్తించటం నాతరమా? పురుణించి(ఎదిరించి) నీ గుణముల నెఱుగ నాతరమా? నీ తలపెరిగి నిన్ను ధ్యానించక అది సాధ్యమౌతుందా? వేదాలలోను, శాస్త్రాలలోను నీ గురించి నీవే చెప్పుకొన్నావు. మా పగటు అజ్ఞానము (తిరస్కారపు అజ్ఞానం) నీవే పాపేవు (తొలగించేవు) అంతే.

నిన్ను గుర్తుపట్టి కొలుచుట నావశమా? చేతులెత్తి మనసారా నిన్ను పూజించ నావశమా? నిలిచి (స్థిరపడి) ఓ శ్రీవేంకటేశ్వరా! నీవేనా యెదలో (హృదయంలో) వుండిపోయి మళ్ళీమళ్ళీ నన్ను పెరరేపుచూ (ప్రేరేపిస్తూ) మన్నిస్తున్నావు. అంతేకాని నేనెంత? నాబ్రతుకెంత?

**సంఖ్య : 435 సంపుటము : 1 పుట : 291 రాగం : మలహరి**

పల్లవి: దేవా యీతగవు దీర్చవయ్యా
వేవేలకు నిది విన్నవమయ్యా
చ. 1: తనువున బొడమినతతి నింద్రియములు
పొనిగి యెక్కడికిc బోవునయా
పెనcగి తల్లికడ బిడ్డలు భువిలో
యెనగొని యెక్కడి కేcగుదురయ్యా
చ. 2: పొదుగుచు మనమున బొడమినయాసలు
అదన నెక్కడికి నరుగునయా
వొదుగుచు జలములనుండు మత్స్యములు
పదపడి యేగతి బాసీనయ్యా
చ. 3: లలి నొకటొకటికి లంకెలు నివే
అలరుచు నేమని యందునయా
బలు శ్రీవేంకటపతి నాయాత్మనుc
గలిగితి వెక్కడి కలుషములయ్యా

**అవతారిక :**

అన్నమయ్య శ్రీవేంకటేశ్వరునే ఈ తగవు పరిష్కరించవయ్యా అని అడుగుతున్నారు. మాకు ఇంద్రియాల వల్ల బాధ, అవి దేహాన్ని వదలిపోవు. ఆశ మనస్సునుండి పుడుతున్నది. మనస్సులేక నాకు ఉనికేలేదు. అన్నీ ఒకదానితో నొకటి లంకె. ఇదిగో నీవు నా ఆత్మలో నెలకొనినావు. ఇక నాలో కల్మషమే లేదు.

**భావదీపిక :**

దేవా! నీవే ఈ తగవు (వివాదము) తీర్చి న్యాయం చెప్పు. ఇది వేవేలకు (అసంఖ్యాకంగా) నేను చేసే విన్నపములయ్యా!

శరీరంలోనుంచి యుక్త సమయానికి వుద్భవించినవే ఇంద్రియాలు. అవి శరీరాన్ని వదలియెక్కడికి పోతాయి? తల్లిని వదలి బిడ్డలుండగలరా? తల్లిని యెక్కడికిపోతారు స్వామీ? శరీరంవున్నంత కాలం వాటి బాధ వుంటుంది.

మనస్సు నుంచి పుట్టిదాంట్లో చెలరేగేవే ఆశలు. కావాలంటే అవెక్కడికి పోతాయయ్యా? జలములో పుట్టిపెరిగే చేపలు పదపడి (ఖచ్చితంగా) పొమ్మంటే అవెక్కడికి పోతాయి? అట్లాగే ఆశలు కూడా మనస్సు వున్నంతకాలం వుంటాయి.

లలి (క్రమముగా) ఇవి మళ్ళీ ఒకదానితో ఇంకొకటి లంకెలు పడివుంటాయి. దీనికి నేనేమి అనగలనయ్యా? నాలోకలుషాలు యెందుకు కష్టపెట్టటం లేదంటే ఒకటే సమాధానం వున్నది. ఓ శ్రీవేంకటేశ్వరా! నా ఆత్మలో నీవేవున్నావు. ఇంకా యెక్కడి కలుషాలు?



**సంఖ్య : 4 సంపుటము : 2 పుట : 3 రాగం : భైరవి**

పల్లవి: దైవమా నీమాయ తలమొ లెఱcగనీదు
కావరపు విషయాల కట్లు వదలవు
చ. 1: గక్కునc బెరిగివచ్చీ కాలము మీcదమీcద
వొక్కనాcటి కొక్కనాcటి కొత్తుకొత్తుక
నిక్కి తుమ్మిదలవంటి నెరులెల్లాc దెల్లనాయ
కక్కరమాయ మేను కాంక్షలూ నుడుగవు
చ. 2: చిన్ననాcడు మోహించిన చెలులు నేc జూడcగానే
పన్నిన వయసు మీరి ప్రౌఢలైరి
వన్నెకుc బెట్టిన సొమ్ము వడి రాసి యెత్తుదీసె
మున్నిటివే వెనకాయ ముచ్చటాc దొలcగదు
చ. 3: సిగ్గులెల్లాc బెడcబాసె చేరి యవ్వరు నవ్వినా
యెగ్గుపట్టదు మనసు యెఱుకతోనే
నిగ్గుల శ్రీవేంకటేశ నీవు నన్ను నేలుకొని
దగ్గరి నాలోనుండcగా తలపూc గైవాలదు

**అవతారిక :**

అన్నమయ్య చెప్పిన అచ్చ తెలుగు కీర్తన వివరించడం ఆషామాషీ వ్యవహారం కాదు. దైవమా నీమాయ వలన నన్ను కావరం వదలటంలేదయ్యా! జుట్టు తెల్లబడింది కోరిక చల్లబడలేదు. ప్రౌఢవయసొచ్చినా చెలులపై మోహం చెదరదు. ఎవ్వరు నవ్వినా నా మనస్సు సిగ్గువిడచి పెట్టింది. స్వామి! నీవు నన్నేలుకొంటే గాని నా ఆలోచనలు వాడిపోవు.

**భావదీపిక :**

ఓ దైవమా! మీమాయ యెటువంటిదంటే దాని తలయేదో మొలయేదో యెవ్వరూ తెలియలేరు. కావరము హెచ్చి విషయముల కట్లు తెంచుకోవటం అసాధ్యమవుతుంది.

చూస్తుండగానే గబుక్కున కాలము గడచిపోయింది. రోజులు దొర్లిపోయాయి. ఒత్తుకుపోతూ ముదిమి వచ్చేసింది. నల్లని తుమ్మెదలవంటి నెరులెల్లా (వెంట్రుకలన్నీ) తెల్లబడిపోయాయి. కానీ నీకక్కరపు మాయ (కఱకు మాయ) వలన ఈ దేహంలోని కోరికలు పోవటంలేదు.

చిన్ననాడు నేను మోహించిన నా చెలులు వయస్సుపైబడి ప్రౌఢలయ్యారు. ఆభరణాలను మెఱుగు పెట్టిస్తే దాని యెత్తు తగ్గిపోయినట్లు మున్నిటికే వెనకాయె (ముందువచ్చిన వన్నీ వెనుకబడ్డాయి) ముచ్చటా తీరిపోయింది.

సిగ్గులన్నీ మాయమైనవి. మనస్సు యెగ్గు పట్టదు. నన్నుచూసి నలుగురూ నవ్వినా మనసు లెక్కచేయుటలేదు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు నన్ను యేలుకొని నాలోనే దగ్గర చేరావు. దానితో నా తలపూగైవాలదు (నా ఆలోచన కూడా వాడిపోక నిగ్గుదేలింది).

**సంఖ్య : 284 సంపుటము : 3 పుట : 192 రాగం : సామవరాళి**

పల్లవి: దైవమా నీ వెలితేది తమవెలితేకాని
జీవుల(లు?) పట్టినకొల్ల చేతిలోనే వున్నది.
చ. 1: నిండినవి జగముల నీనామము లనంతము-
లండఁ దలఁచే వారి భాగ్యమే కాని
పండియున్న దిదె దేవభక్తి యెందు చూచినాను
దండితోడఁ బనిగొనే తమ నేర్పేకాని.
చ. 2: మనసులలో నున్నది మరి నీపై జ్ఞానము
వొనరఁ దెలిసేవారివోపికేకాని
ఘనమైనమున్నిటి నీకథలెల్లా నున్నవి
విననేరిచిన వారి వివేకమే కాని.
చ. 3: శ్రీవేంకటేశ మీముద్ర చెల్లుబడై వున్నది
వేవేగ ధరించేవారి వేడుకే కాని
తావుకొని చేరువ నీదాస్య మిట్టే వున్నది
భావించి నమ్మేటి వారిపని యింతేకాని.

**అవతారిక :**

భక్తిజాలువారే ఈ కీర్తనలో అన్నమయ్య సర్వమూ జనులలోపమే కాని పరమాత్మదేమీ లోపంలేదని చెబుతున్నారు. "కొల్ల" అంటే "పుచ్చు' అని అర్థం చెప్పుకోవచ్చు. జీవలకు పట్టిన పుచ్చేకాని ఇది దేవుని లోపం కాదు ఎందుకంటే పుచ్చు వీడి చేతలలోనే వున్నది..

**భావదీపిక :**

ఓ దైవమా! నీవెలితేది? (నీ లోపంయేముంది?) తమ వెలితేకాని (జీవుల లోపమేకదా!) నిజానికి జీవులకు పుట్టిన కొల్ల (పుచ్చు) వారిచేతిలోనే వున్నదయ్యా!

జగమంతా నిండిన నీ నామములనంతములు. అక్కడ వాటిని స్మరించేవారి భాగ్యమేకాని వేరొకటికాదు. ఎక్కడ చూచినా దైవభక్తి పండివున్నది. దిట్టతనముతో దానిని పనిగొనె (చేబట్టే) వారికి నేర్పువుండాలి. అంతే.

ప్రభూ! నీయొక్క జ్ఞానము మనస్సులో స్థిరపడుతుంది. కాకపోతే ఆ పరమజ్ఞానము తెలియాలంటే యెంతో ఓపికవుండాలి. అది తెలియాలంటే అనాదిగా నీ కథలెన్నో వున్నాయి. ఘనమైన వాటిని విని నేర్చేవారికి వివేకంవుండాలి. అంతేకాని, నీలోపం యేమిటి?

శ్రీవేంకటేశ్వరా! నీ పవిత్రముద్రలు (శంఖ,చక్ర, నామములు) అనాదిగా చెల్లుబడిలో వున్నవి. వాటిని వేడుకగ (ఆనందముగా) ధరించాలి. ఆపైన నీకు చేరువయై నీ దాస్యము స్వీకరించాలి. అట్టివారు నిన్ను భావించి నీపై నమ్మకం వుంచాలి. అదే వారిపని. అంతేకాని మరోకటి కాదు.



**సంఖ్య : 73 సంపుటము : 2 పుట : 49 రాగం : మాళవి**

పల్లవి: ధ్రువవరదా సంస్తుతవరదా
నవమైన యార్తుని నన్నుఁ గావవే
చ. 1: కరిరాజవరదా కాకాసురవరదా
శరణాగతవిభీషణ వరదా
సిరుల వేదాలు నిన్నుఁ జెప్పగా వినీని
మరిగి మఱుగుచొచ్చే మమ్ముఁ గావవే
చ. 2: అక్రూరవరదా అంబరీషవరదా
శక్రాది దివిజనిచయవరదా
విక్రమించి యిన్నిటా నీవే ఘనమని నీకు
చక్రధర శరణంటి సరిఁగావవే
చ. 3: ద్రౌపదీవరదా తగ నర్జునవరదా
శ్రీపతీ ప్రహ్లాదశిశువరదా
యేపున శ్రీవేంకటాద్రి నిటు నేను నాగురుఁడు
చూపఁగా గొలిచే నచ్చుగఁ గావవే

**అవతారిక :**

చక్కటి శరణాగతి కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఆర్తితో యెవడు శరణంటే వారిని రక్షించటం స్వామి నియమం. అది గజరాజైనా, ప్రహ్లాదుని వంటి శిశువైనా, ద్రౌపది లాంటి అబలైనా, రాజుని ధిక్కరించలేని అక్రూరుడైనా, నిరాదరణకు గురైన ధ్రువుడైనా స్వామి కృపకు పాత్రులైన వారే. ఇంతకీ వరదుడంటే వరముతో అనుగ్రహించిన వాడని.

**భావదీపిక :**

ఓ ధ్రువ వరదా! సంస్తుతించిన వారిని అనుగ్రహించే దేవా! నవమైన ఆర్తుని (పరిచయంలేని దుఃఖితుని) కూడా రక్షిస్తావు కదా! వాళ్ళందరినీ కాపాడితివి కదా! నన్నుగావవే.

ఓ కరిరాజ (గజేంద్ర) వరదా! కాకాసురవరదా! నిన్ను శరణన్న శత్రుభ్రాత విభీషణుని అనుగ్రహించినవాడా! వైభవం గల వేదాలు నిన్ను పొగడగా విన్నాను. వెంటనే నీ నీడలోకి వచ్చాను. మమ్ము రక్షించవేమయ్యా?

ఓ అక్రూర వరదా! అంబరీష వరదా! శక్రాది (దేవేంద్రుడు మొదలైన) దివిజనిచయ వరదా! (దేవతాసమూహమును రక్షించినవాడా!) ఉద్యమించి అందరిలోను నీవే గొప్పవాడవని, వో చక్రాయుధా! నీకు శరణంటిని. నన్ను సరిగావవే (యుక్కముగా రక్షించవే).

ఓ ద్రౌపదీ వరదా! అర్జున వరదా! ఓ శ్రీపతీ! శిశువైన ప్రహ్లాదుని అనేకమార్లు రక్షించినవాడా! శ్రీవేంకటాద్రి మీద వెలసిన నిన్ను నా గురుడు చూపగా నాటినుండి నిన్ను అచ్చుగా (నా వాడవని) కొలిచితిని. నన్ను రక్షించవేవయ్యా?

**సంఖ్య : 54 సంపుటము : 1 పుట : 36 రాగం : భూపాళం**

పల్లవి: నీ కథామృతము నా నిరతసేవన నాకు
చేకొనుట సకలసంసేవనం బటుగాన

చ. 1: ఇదియె మంత్రరాజము నాకు నేప్రొద్దు-
నిదియె వేదసంహితపాఠము
యిదియె బహుశాస్త్రమెల్లఁ జదువుట నాకు-
నిదియె సంధ్య నాకిదియ జప మటుగాన

చ. 2: యిదియె బ్రహ్మవిద్యోపదేశము నాకు-
నిదియె దుఃఖవిరహితమార్గము
యిదియె భవరోగహితభేషజము నాకు-
నిదియె వుపనిషద్వాక్యపద్ధతిగాన

చ. 3: యిదియె దానఫల మీఁజాలినది నాకు
యిదియే తలఁపఁ బరహితకర్మము
యిదియె తిరువేంకటేశ నీసంస్మరణ-
మిదియె యిదియె ఇన్నియును నటుగాన

**అవతారిక :**

హరికథామృతము తన కెటువంటిదో వినిపిస్తున్నారు అన్నమయ్య. ప్రతిదినమూ స్వామి వారి భాగవతగాథలను అమృతపానముగా సేవించుటే తనకు సకలసంసేవన యట. అంతుచేత స్వామి నామపారాయణమే మంత్రము, అదే వేదము, అదే శాస్త్రము, అదే సంధ్యావందనము, అదే బ్రహ్మ విద్య, అదే దుఃఖోపశమనము, అదే భవరోగహరణము, అదే ఉపనిషద్వారము, అదే దానఫలదాత, అదే పరహిత కర్మము అంటున్నారు. ఇంతకంటే ఇంకేమి కావాలి?

**భావదీపిక :**

ఓ ప్రభూ! నీ కథామృతపానమే నాకు "నిరతసేవ" (మిక్కిలి ఆసక్తికరమైన సేవ). దానిని చేకొనుటే సకల సంసేవనంబు. అటుగాన (అందుచేత) నాకు మరి ఇంకేదైనను అనవసరమే.

అంతెందుకు ఇదియే (హరికథాశ్రవణము) యేవేళనైన నాకు మంత్రరాజము "ఓం నమోవేంకటేశాయ" వేదసంహితపాఠము. ఇదియే సకల శాస్త్రపారాయణము. ఇదియో నా జపము-సంధ్యావందనము. అందుచేత నాకు తక్కినవి అనవసరము.

నాకు స్వామి కథామృతపానమే బ్రహ్మవిద్యోపదేశము. నాకు దుఃఖహారణ మార్గము కూడా ఇదే. ఇదియే నాకు భవరోగము (పుట్టుకలనే వ్యాధిని) నివారించు "హితభేషజము" (మేలుచేసే ఔషధము). ఇదియే ఉపనిషద్వారము నాకు. అందుచేత నాకు మరియేదియు అనవసరము.

నాకు అనేక దానఫలమును ఇయ్యగలిగిన సులభమైన మార్గము హరికథామృతపానమే. నేను పరహితకర్మముల నావరించి వేరుగా పుణ్యము సంపాదించనక్కరలేదు. హరిగానమే నాకది అందిస్తుంది. ఓ తిరువేంకటేశా! నీగానమే నాకు నీ సంస్మరణము. అందుచేత స్వామీ! నాకు సకలమూ నీ కథామృతపానము.. ఇదే ఇదే ఇదే.. అన్నీ ఇదే.



**సంఖ్య : 17 సంపుటము : 1 పుట : 11 రాగం : శ్రీరాగం**

పల్లవి: నీవేకానింక నే నన్య మెఱఁగ యే-
త్రోవ చూపి నాకుఁ దోడయ్యెదవయ్య

చ. 1: అపరాధశత కోట్లయినవి వొక్క-
నెపమున ననుఁ గావనేరవా
అపరిమితదురితా లైనవి యే-
ఉపమచేత నన్ను నుద్ధరించెదవయ్య

చ. 2: అతిశయముగఁ గర్మినైతిని నీ-
మతము నాకొకయింత మరపవా
ఇతర కర్మారంభహితుఁడను
గతి మోక్ష మెటువలెఁ గల్పించెదవయ్య

చ. 3: తిరువేంకటాచలాధీశ్వరా నీ-
శరణాగతులఁ బ్రోవఁజాలవా
పరమదయానందపరుఁడవు యే-
వెరవున భవములు వెడలఁ ద్రోచెదవయ్య

**అవతారిక :**

అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుని తనకు ముక్తిత్రోవ చూపించమని వేడుకొంటున్నారు. నీవు కాక మరొక దిక్కులేదని అర్థిస్తున్నారు. కోట్లకొలది అపచారములను చేసినా, అతిశయించిన గర్మిష్టినైనా, మోక్షానికి అనర్హుడు నైనా నీ శరణార్థిని నీవుగాక మరెవ్వరు నన్ను దయదలుస్తారంటున్నారు.

**భావదీపిక :**

ప్రభూ! నీవే తప్ప నేనింక అన్యమేదియునెఱగను. ఏత్రోవచూపి నాకు తోడయ్యెదవయ్యా?

నా అపరాధములు శతకోట్లయినవి స్వామీ! కాని ఏదో నెపముతో నను రక్షించలేవా? నేను అపరిమితమైన పాపాలు చేశాను. ఇక నన్ను యెవరితో పోల్చి, పోనీలే వీడూ అంతేకదా! అని వుద్ధరిస్తావు?

స్వామీ! నేను అతిశయముగల కర్మిష్టిని. దాని బదులు నీమతము (వైష్ణవము)ను వొకింత అలవాటు చేయరాదా? ఇక నేనేమో ఇతర కర్మల నారంభించుట హితముగా తలచెడివాడను. మరి నాకు మోక్షగతిని యెట్లు కల్పించెదవయ్యా?

ఓ తిరువేంటాచలాధిపా! నేను నీ శరణాగతుడను ప్రభూ! నన్ను కూడా బ్రోవజాలవా? నీవు పరమ దయానందపరుడవు, ఆ మాట సత్యమే. కాని యే వెరవున (ఏ ఉపాయమున) నా భవములను (పుట్టుకలను) వెడలకొట్టి నన్ను ఆదుకోగలవయ్యా? నిజమే కాని నీవే యేదో విధంగా నన్ను కాపాడు ప్రభూ!

**సంఖ్య : 490 సంపుటము : 1 పుట : 328 రాగం : శంకరాభరణం**

పల్లవి: నెరవాది సాహసులు నిత్యశూరులు
దరితవిదూరులు ధ్రువాదులు

చ. 1: తక్కక శ్రీహరిభక్తితాపలుసేసి యెక్కిరి
చక్కఁగా వైకుంఠము సనకాదులు
వొక్కట విష్ణుకథలు వోడసేసుక దాఁటిరి
పెక్కు సంసారజలధి భీష్మాదులు

చ. 2: కడువిరక్తియనేటికత్తులనే నరకిరి
నడుమ భవపాశముల నారదాదులు
బడినే హరిదాసులుపౌఁజులు గూడుకొనిరి
సుడివడ కిహమందే శుకాదులు

చ. 3: పరమశాంతములనే పట్టపేనుగుల మీఁద
వరుసల నేఁగేరు వ్యాసాదులు
సిరుల శ్రీవేంకటేశుఁ జేరి సుఖముఁ బొందిరి
బెరసి దాస్యమున విభీషణాదులు

**అవతారిక :**

అన్నమయ్య ఈ కీర్తనలో నిత్యమూ శ్రీమన్నారాయణునితో వుండే ఆయన పరివారాన్ని కీర్తిస్తున్నారు. వారంతా నిత్యులూ, పాపరహితులు, బంధముక్తులు, ఇహముననే పరమును గాంచినవారు, పరమశాంతులు, దాస్యముచే మెప్పించినవారు అవుటచే పేరు పేరునా సన్నుతిస్తున్నారు.

**భావదీపిక :**

నిత్యశూరులు అని పిలువబడే గరుత్మంతాది శ్రీహరి పరివారము నెరవాది సాహసులు (నేర్పరులైన సాహసోపేతులు). ధ్రువాది భక్తులు దురిత విదూరులు (పాపరహితులు).

సనకాది ఋషులు వెనుదీయక శ్రీహరి భక్తితో తాపసులై చక్కగా వైకుంఠపదమునెక్కిరి. భీష్మాది భక్తులు అనేక సంసారతాపత్రయములను అనుభవిస్తూనే వొక్కట (ఒకేసారి) విష్ణుకథలనే ఓడనెక్కి ఈ సంసారజలధిని దాటిరి.

నారదాది మునులు గొప్పవిరక్తి అనే కత్తితో, మధ్యలో తగిలిన భవపాశములను నరికివేసి హరికృపకు పొత్తులైరి. శ్రీశుకుడు మొదలైన యోగులు సుడివడక (శ్రమచెందక) ఇహమందే (జీవించియుండగానే) వేగముగా హరిదాసుల పౌజుల (సేనలో) చేరిపోయిరి.

వ్యాసుడు మొదలైన భాగవతులు పరమశాంతము అనే పట్టపుటేనుగు నెక్కి వరుసగా విష్ణుసాయుజ్యమును పొందినారు. వేంకటేశ్వరుని జేరి సిరులతో జనులు సుఖములు పొందిరి. విభీషణాది రాక్షసులు కూడా రామచంద్రుడైన శ్రీహరికి దాస్యము చేసి చిరంజీవులై వర్ధిల్లిరి.



**సంఖ్య : 493 సంపుటము : 1 పుట : 330 రాగం : సాళంగం**

పల్లవి: నేరిచి బ్రదికేవారు నీదాసులు
నేరమిఁ బాసినవారు నీదాసులు

చ. 1: కామముఁ గ్రోధము రెంటీఁ గాదని విడిచి మంచి-
నేమము వట్టినవారే నీదాసులు
దోమటి బాపపుణ్యాలఁ దుంచివేసి చూడగాఁనే
నీమాయ గెలిచినారు నీదాసులు

చ. 2: కిక్కిరించిన యాసలు గిందవేసి మోక్షము
నిక్కి నిక్కి చూచేవారు నీదాసులు
వెక్కసపు భక్తితోడ వెఱపు మఱపు లేక
నెక్కొన్న మహిమవారు నీదాసులు

చ. 3: అట్టె వేదశాస్త్రముల అర్థము దేటపఱచి
నెట్టుకొని మించినారు నీదాసులు
యిట్టె శ్రీవేంకటేశ యితరమార్గములెల్లా
నెట్టువడఁ దోసినారు నీదాసులు

**అవతారిక :**

హరిదాసుల వైశిష్ట్యాని పొగడుతున్నారు అన్నమయ్య. జీవన గమ్యమును నేర్చి హరియే సర్వస్వమని బ్రతికేవారే నీ దాసులు. నేరమును విడచిన వారే నీ దాసులు అంటున్నారు. కనబడినంత తేలికగాదు ఈ కీర్తన వివరణ. ముక్తికోసం అన్యమార్గాలు అనవసరం అంటున్నారు.

**భావదీపిక :**

జీవతాశయం హరిని చేరుట. దీనిని నేర్చి బ్రతికేవారే నీ దాసులు (హరిదాసులు) నేరమి (నేరాచరణము) బాసినవారు (విడనాడిన వారు) నీ దాసులు.

కామక్రోధముల రెంటినీ విడచిపెట్టి మంచి నియమముతో జీవించే వారే నీ దాసులు. దోమటి (కపటపూరిత) పాపపుణ్యములను త్రుంచివేసి చూస్తుండగానే నీవు కల్పించిన మాయను గెలిచిన వారే నీ దాసులు.

కిక్కిరించిన (వంచించిన) ఆశలను క్రింద పడవేసి మోక్షము కొరకై యెవరు యెదురు చూస్తుంటారో వారే నీ దాసులు స్వామీ! దుర్లభమైన నీ భక్తితో భయము, మఱపు లేక నెక్కొన్న (పాదుకొనిన) మహిమ కలిగిన వారే నీ దాసులు.

ప్రభూ! వేదములు, శాస్త్రములు అర్థసహితముగా తేటపరచి (వివరించి) ప్రచారము చేయుటలో ఉద్దండులే నీ దాసులు. ఓ శ్రీవేంకటేశ్వరా! అశాస్త్రీయమైన అనేక ఇతర మార్గములను కాలదన్ని నీ దాసులు నెట్టువడి (అతిశయంతో) త్రోసిపుచ్చినారు స్వామీ!

**సంఖ్య : 489 సంపుటము : 28 పుట : 323 రాగం : రామక్రియ**

పల్లవి: పడఁతులాల సోబానఁ బాడరమ్మా
అదరి పెండ్లాడీని అహోబళేశుఁడు
చ. 1: యెదురుఁ గొండలమీఁద యిందిరాఁ దానుఁగూచుండి
మదనకళలు రేఁగ మాఁటలాడి
పదిలపుఁ జూపులనే బాసికము గట్టుక
అదివో పెండ్లాడీ నహోబళేశుఁడు
చ. 2: కను సన్నల మెల్లనె కాఁగిటికిఁ జేరి చేరి
చెనకుల నవ్వులనే సేసలు చల్లి
వెనుకొని మోవులను విందుల వెట్టుకొంటాను
అనిశముఁ బెండ్లాడీ నహోబళేశుఁడు
చ. 3: సందడింపు వేడుకల సమరతులనుఁ గూడి
కందున పెండ్లి పీఁటైన గద్దె మీఁదను
అందమైన శ్రీవేంకటాద్రి గరుడాద్రిని
అందుకొని పెండ్లాడీ నహోబళేశుఁడు

**అవతారిక :**

అహోబలములో లక్ష్మీనృసింహుని కళ్యాణం రాజ్యలక్ష్మీతో వైభవంగా జరుగుతోంది. స్త్రీలంతా మంగళగీతాలు పాడుతున్నారు. అహోబలంలో నృసింహుని కీర్తిస్తూ అన్నమయ్య చక్కటి శృంగార కీర్తన చెబుతున్నారు. పెండ్లిపీట, తనగద్దెగా విలసిల్లిన ఈ వేంకట నృసింహుడు గరుడాద్రివాసుడే.

**భావదీపిక :**

ఓ వనితలారా! సోబాన (మంగళగీతములు) పాడండమ్మా! అహోబలేశుడైన ఈ నరసింహుడు అదరి (అతిశయముగా) పెండ్లాడుచున్నాడు.

ఎదురెదురుగా నున్న కొండలమీద తానూ, ఇందిరాదేవి కూర్చునియుండి మదనతాపములు చెలరేగునట్టు మాటామంతీ జరిపి అదిగో అహోబలేశుడు స్థిరమైన చూపులనే బాసికము కట్టుకొని వున్నాడు.

ఒకరికొకరు కనుసైగలు చేసికొంటూ కౌగిట్లో దూరి దూరి సరసోక్తులనే నవ్వుల జల్లుసేసలో (తలంబ్రాలు)గా చల్లి, మధ్యమధ్య వెనుకొని మోవితేనెలు (వెంబడించి అధరామృతమును) విందులు చేసికొంటూ ఈ అహోబలేశుడు నిరంతరంగా పెండ్లాడుచున్నాడు.

సందడిగొలిపే వేడుకలతో సమరతిగూడి (ఉపరతితో అలరించి) సింహాసనమే పెండ్లి పీటగా ఆసీనులైనారు. అందమైన వేంకటాద్రిలోనూ, ఇక్కడి గరుడాద్రి మీదనూ భక్తుల జేజేలందుకొని అహోబలేశుడు పెండ్లాడినాడు.



**సంఖ్య : 232 సంపుటము : 2 పుట : రాగం : భైరవి**

పల్లవి: పరమాత్ముఁడు సర్వపరిపూర్ణుఁడు
సురలకు నరులకు చోటయి యున్నాఁడు
చ. 1: కన్నులఁ గంటానే కదు మాటలాడుతానే
తన్నుఁగానివానివలె దాగియున్నాఁడు
అన్నియు వింటానే అట్టే వాసన గొంటానే
వన్నెలనూనె కుంచమువలె నున్నాడు
చ. 2: తనువులు మోచియు తలఁపులు దెలిసియు
యెనసియు నెనయక యిట్లున్నాఁడు
చెనకి మాయకు మాయై జీవునికి జీవమై
మొనసి పూసలదారమువలె నున్నాఁడు
చ. 3: వేవేలు విధములై విశ్వమెల్లా నొకటై
పూవులు వాసనవలె బొంచియున్నాఁడు
భావించ నిరాకారమై పట్టితే సాకారమై
శ్రీవేంకటాద్రిమీఁద శ్రీపతై యున్నాఁడు

**అవతారిక :**

పరమాత్మయెక్కడున్నాడు? అనేవారికి అన్నమయ్య బదులు చెబుతున్నారు. పరమాత్మయెక్కడలేదు? కొద్ది కొద్దిగా కాదు, అంతటా నిండివున్నాడు. దేవతలకీ, మానవులకీ తానే స్థావరమైయున్నాడు. అంటీముట్టనట్టున్నా అన్నీ తానేయై నిరాకారుడూ, సాకారుడూ తానే అయివున్నాడు.

**భావదీపిక :**

అయ్యలారా! పరమాత్మ సర్వపరిపూర్ణుడై (విశ్వమంతా నిండి) యున్నాడు. అందుచేత సురలకు, నరులకు కూడా ఆయనే స్థావరమైయున్నాడు.

తన కన్నులతో మనని చూస్తున్నా బాగా మాట్లాడుతున్నా తనను కాదన్నట్లు దాగివుంటాడు. అన్నీ వింటూనే వుంటాడు, అన్నీ వాసన జూస్తూనే వుంటాడు. కుంచముతో కొలిచిన నూనె వలె అంటీముట్టనట్టుంటాడు.

అంతర్యామియై తనువులు మోస్తున్నా, మనలో ఆలోచన కలిగిస్తున్నా తనదే అయినా తనది కానట్లుంటాడు. మాయకు కూడా ఆయనే మాయ. జీవునిలో జీవమూ ఆయనే. ముత్యానికి పూసలహారంలో దారమువలె దాగివున్నాడు.

ఈ విశ్వంలో వేర్వేరు రూపాలు వేలకొలది (వేలకు వేల) రూపాలలో వున్నవి. పూలలో వాసన వలె దాగివున్నవి. ఆయనను నిరాకారుడుగా భావించినా సాకారుడుగా వూహించినా శ్రీవేంకటాద్రిపై శ్రీపతవలె వున్నాడు.

**సంఖ్య : 130 సంపుటము : 1 పుట : 89 రాగం : కేదారగౌళ**

పల్లవి: పరమాత్ముని నోరఁబాడుచును యిరు-
దరులు గూడఁగు దోసి దంచీ మాయ

చ. 1: కొలఁది బ్రహ్మాండపు కుందెనలోన
కులికి జీవులను కొలుచు నించి
కలికి దుర్మోహపు రోఁకలివేసి
తలంచి తనువులను దంచీ మాయ

చ. 2: తొంగలి రెప్పలు రాత్రులుఁ బగలును
సంగడి కనుఁగవ సరిఁ దిప్పుచు
చెంగలించి వెసఁ జేతులు విసరుచు
దంగుడు బియ్యముగా దంచీ మాయ

చ. 3: అనయముఁ దిరు వేంకటాధీశ్వరుని
పనుపడి తనలోఁ బాడుచును
వొనరి విన్నాణి జీవులనెడి బియ్యము
తనర నాతనికియ్య దంచీ మాయ

**అవతారిక :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో "మాయ" లోకంలోని జీవులందరిని బ్రహాండమనే రోటిలో వేసి దంచుతున్నదని అంటున్నారు. పరమాత్ముని కీర్తనలు పాడుతూనే రెండువైపులా చిందుతున్న ధాన్యాన్ని తోస్తూ ధాన్యాన్ని దంచుతున్నదట మాయ. అయితే జ్ఞాన సంపన్నులైన జీవులనెడి బియ్యాన్ని మాత్రం ఆ శ్రీవేంకటేశ్వరునికిస్తుందట. మరి మనలాంటి వారిని? దంచుతూనే వుంటుందట, ఆ మాయ.

**భావదీపిక :**

పరమాత్ముని నోరబాడుచును (కీరిస్తూ) మాయ (శ్రీహరి కల్పితమైన, నేను-నాది అనే మాయ) యిరుదరులు గూడగ (రోటి గుంటల కిరువైపులా) తోసి తోసి కర్మఫలం అనే ధ్యాన్యాన్ని దంచుతున్నది.

కొలది బ్రహ్మాండము (పరిమితి గల బ్రహ్మాండము) యొక్క కుందెనలో (రోటిగుంటలో) కులికి (అతిశయించిన) జీవులను కొలిచి రోట్లోనింపి అందమైన దుర్మోహము అనే రోకలితో కావాలని వారి దేహములను దంచివేస్తునది యెవరు? పరమాత్ముని మాయయే.

ఆ మాయ యొక్క తొంగలి రెప్పలు (వికసించిన కనురెప్పలే) రేయింబవళ్ళు. తన జంట కనురెప్పలను సరిదిప్పుచూ (సరిగా మారుస్తూ), చెంగలించి (విజృంభించి) వేగముతో తన చేతులు విసరుచు, దంగుడు బియ్యముగా (దంపుడు బియ్యంగా) బాగుగా దంచుతున్నది.

అనయము (నిరంతరము) శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞానువర్తియౌ తనలో తానే పాడుతూ, అతిశయించిన విన్నాణిజీవులు (జ్ఞాన సంపన్నులైన జీవులు) అనే బియ్యాన్ని తనర (వినయముగా) ఆ స్వామికి వొసగెదనని దంచుతున్నది ఆ మాయ.



**సంఖ్య : 526 సంపుటము : 2 పుట : 351 రాగం : మధ్యమావళి**

పల్లవి: పరాకు నేయకురమ్మ పడఁతులాల
సరాగానా బాగాలీరే సతులకుఁ బతికి

చ. 1: మాటలఁ దేటలు చల్లి మగువలిద్దరి మీఁద
కూటువఁ బాదాలు చాఁచి కొలువున్నాడు
చాటుచు నవ్వులు నవ్వి సన్నలు కన్నులఁ జేసి
వేఁటలాడీ వలపు గోవిందరాజు లిదివో

చ. 2: వొత్తగిలి పానుపువై నుంగరపువేళ్లు చూపి
గుత్తపుగుబ్బలంటఁగఁ గోరుచున్నాఁడు
పొత్తుల మోవులు చూపి పూవులవాట్లు వేసి
విత్తీఁ దమకము గోవిందరాజు లిదివో

చ. 3: లోననే యేపొద్దునుండి లోకమెల్లాఁ దెలుసుక
మానినుల కాఁగిళ్ళ మరిగున్నాఁడు
నానిన చెమటలతో నంటుశ్రీవేంకటేశుఁడై
వీనులలో మాటాడీ గోవిందరాజు లిదివో

**అవతారిక :**

పరాకు చేయటం అంటే నిర్లక్ష్యం చేయటం, బాగాలీయడం అంటే నైవేద్యం పెట్టటం అని అర్థం అయితే కాని తిరుపతి గోవిందరాజస్వామిపై అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన అర్థంకాదు. గోవిందరాజస్వామి శృంగారపురుషుడైనందువల్ల ఇది శృంగారకీర్తన అన్నారు కానీ ఇందులో శృంగారం యేమీ లేదు.

**భావదీపిక :**

ఓ పడతులారా! (భక్తస్త్రీలారా!) పరాకుసేయకురమ్మ (నిర్లక్ష్యం చేయకండమ్మా!) ఈ పతికి, ఆయన సతులకు సరాగాన(ఒద్దికగా) బాగాలీరే (నైవేద్యం పెట్టండి).

తనమగువ లిద్దరి మీద (శ్రీదేవి, భూదేవిపై) చలోక్తులు విసరుచూ, వారి ఒడిలో పాదాలు చాచి గోవిందరాజు లిదిగో కొలువై వున్నాడు. బాహాటంగా నవ్వులొలికిస్తూనే ఇద్దరికీ కళ్ళతో సైగలు చేస్తున్నాడు. వలపుల వేటాడుతున్నాడు.

ఈ గోవిందరాజులు పాన్పుపై వొత్తిగిలి పడుకొని తన ఉంగరాల వ్రేళ్ళు చూపిస్తూ తన భార్యల చనుగుబ్బలను తాకాలని కోరుచున్నాడు. తీయని తన అధరాలు చూపిస్తూ పూలచెండ్లు వారిపై విసరుతూ వారిద్దరిలో తమకము (పారవశ్యానికి) అంకురార్పణ చేస్తున్నాడు.

ఏ వేళనైనా తన పాన్పుపైవున్నా లోకంలో జరిగేవి యెప్పటికప్పుడు తెలిసికొంటూ, తనభార్యల కౌగిళ్ళను మరిగివున్నాడు. నానిన చెమటలతో వున్ననూ ఇదిగో ఈ గోవిందరాజులే అక్కడ శ్రీవేంకటాద్రిపై నున్న స్వామియై వారి చెవులలో యేదో చెబుతున్నాడు.

**సంఖ్య : 77 సంపుటము : 2 పుట : 52 రాగం : మాళవి**

పల్లవి: బలువుఁడు హరిఁ జేపట్టితిని
తలఁచినదెల్లా దక్కెను నాకు

చ. 1: దురితధ్వంసుఁడు దుఃఖవిదారుఁడు
అరిభయంకరుఁ డచ్యుతుఁడు
సిరివరుఁ డితనినిఁ జేకొని కొలిచిన
పరమసుఖమెపో భయ మెక్కడిది

చ. 2: దానవాంతకుఁడు దైవశిఖామణి
మానరక్షకుఁడు మాధవుఁడు
నానాముఖముల నాపాలఁ గలఁడు
యేనెపముల నా కెదురే లేదు

చ. 3: అనయము నిర్మలుఁ డఖిలానందుఁడు
ఘనుఁ డీ శ్రీవేంకటవిభుఁడు
కనుకొని మము నిటు గాచుక తిరిగీ
యెనయఁగ నేలికె యితఁడే మాకు

**అవతారిక :**

అన్నమయ్య ఈ కీర్తనలో నేను బలవంతుడైన హరిని స్వీకరించాను అందుకే నేను అనుకొన్నదల్లా నాకు దక్కింది. అతనిని నమ్మినవారికి భయమెక్కడిది? ఆ దైవ శిఖామణి యెవరి పక్షాన వుంటే వారి కెదురుండదు. శ్రీవేంకటపతి తనని నమ్మినవారిని రక్షిస్తాడు.

**భావదీపిక :**

శ్రీహరియే బలువుడు (బలవంతుడు) అని చేపట్టితిని. అందుకనే మేము కోరినదెల్లా మాకు దక్కినది.

దురితధ్వంసుడు (పాపనాశకుడు) దుఃఖములను ఎదలించి పోగొట్టువాడు. శత్రుభయంకరుడు, చ్యుతి (నాశనము) లేనివాడు. సిరివరుడు (లక్ష్మీపతి) అయిన ఇతనిని స్వీకరించి కొలిచిన భయమెక్కడిది? పరమానందమేపో!!

శ్రీహరి దానవాంతకుడు. దేవతలలో తలమానికెము. ద్రౌపతివంటి ఆపన్నుల మానసంరక్షకుడు. మాధవుడు (లక్ష్మీపతి) అనేక విధములుగా నా యందు దయజూపుచున్నాడు. ఏ విధంగా జాచినా నా కెదురేలేదు.

అనయము (ఎల్లప్పుడు) స్వామి నిర్మలుడే. అమందానందకందళిత హృదయారవిందుడే. ఈ శ్రీవేంకటేశ్వరుడు ఘనుడు. మాకు అతిశయించగా గొప్ప ఏలిక ఈ తిరుమలనాథుడే.



**సంఖ్య : 133 సంపుటము : 31 పుట : 89 రాగం : నాట**

పల్లవి: బాపు బాపు రాఘవ నీ ప్రతాపమేమని చెప్ప
పైపై నీ పేరువిని పారేరు రాకాసులు

చ. 1: వాలినెత్తురు నీటను వాఁడిపదనిచ్చినమ్ము
కూలిచె నొక్క మాటునఁ గుంభకర్ణుని
యీలకొని మాయామృగ మెమ్ములనొరసినమ్ము
రాలించె నుత్తరగోపురముపై గొడగులు

చ. 2: తొడికి మింటితాపలు తుంచి దూప(?) దాఁకినమ్ము
జడధిమరుదేశాల జల మింకించె
యెడయక కౌశికుని యజ్ఞముగాచినమ్ము
అడరి రావణుని పూర్ణాహుతిగఁ జేసెను

చ. 3: బెరసి యేపొద్దును నీపిడికిటిలోనియమ్ము
సురలభయముఁ బాపి సూటికెక్కెను
ఇరవై శ్రీవేంకటాద్రి నిటు రామచంద్రుఁడవై
పరగఁగ నీయమ్ము పగయెల్ల నీఁగెను

**అవతారిక :**

నేడు మనం "బాగుబాగు" అని మెచ్చుకొన్నట్లే అన్నమయ్య కాలంలో "బాపుబాపు" అని మెచ్చుకొనేవారు. శ్రీరామచంద్రునిపై చేసిన ఈ కీర్తనలో అన్నమయ్య రాఘవా! నీ ప్రతాపాన్ని యేమని వర్ణించను స్వామీ! నీపేరు వింటేనే రాక్షసులు పరుగులు పెట్టేవారు. అన్నమయ్య "కొసమెరుపు" అన్యులకు సాధ్యమా? మీరే చదవండి. అన్నట్లు "అమ్ము" అంటే "SELLING" కాదు బాణము అని అర్థం.

**భావదీపిక :**

బాగు బాగు రాఘవా! నీ ప్రతామునుయేమని వివరించనయ్యా? నీ పేరును పైపైన ఆనోటా ఈ నోటా వినినంతనే రాక్షసులు పారిపోతున్నారయ్యా!

వారి నెత్తురు నీరుజేసిన వాడియైన అమ్ము నీదే. కుంభకర్ణుని ఒక్కసారిగా కూల్చినదీ నీ అమ్మే (బాణమే). మాయామృగమును ఈలకొని (ప్రాణాలుగ్గబట్టి) యెమ్ముల నొరసినమ్ము (చక్కగా రాచిన బాణము) ఇదే. రావణుని కోట ఉత్తరగోపురముపై గొడుగును కూల్చినది ఈ బాణమే.

ఒడిసిపట్టి ఊర్ధ్వలోకముల మెట్ల నెక్కించ గలిగినదీ అమ్ము. సముద్రపు జలాన్ని ఇంకించబోయినది ఈ అమ్ము. వదలక విశ్వామిత్రుని యాగరక్షణ జేసినదీ అమ్ము. రావణుని పూర్ణాహుతిగా (సాంతం ఆహుతి) చేసినదీ అమ్ము.

అతిశయించి అన్ని వేళలా నీ హస్తమున వుండేదే నీ అమ్ము. దేవతల భయమును నివారించినదే నీ అమ్ము. శ్రీవేంకటాద్రిపై నెలకొనిన నీవే ఇటు రామచంద్రుడవై వర్ధిల్లగా నీ అమ్ము దానవ విధ్వంసకుడవైన నీ పగనంతటిని ఈగెను (నివారించెను).

**సంఖ్య : 274 సంపుటము : 2 పుట : రాగం : లలిత**

పల్లవి: భోగము నేను నీకు భోగివి నీవు
శ్రీగురుఁడ విన్నిటాను చిత్తగించు నన్నును

చ. 1: చక్కని జన్మపు సంసారవృక్షమునకు
పక్కున(వ) ఫలము నీవు భావించగా
మక్కుమ గర్మమనేటి మత్తగజమునకును
యెక్కిన మావటీఁడవు యెంచఁగ నీవు

చ. 2: నెట్టన దేహమనేటి నిర్మలరాజ్యమునకు
పట్టమేలుచుండిన భూపతివి నీవే
దిట్టమైన చిత్తమనే తేజిగుఱ్ఱమునకు
వొట్టుక రేవంతుఁడవు వుపమింప నీవు

చ. 3: సంతతమైన భక్తిచంద్రోదయమునకు
రంతులఁ జెలఁగు సముద్రమవు నీవు
చెంతల శ్రీవేంకటేశ జీవుఁడనే మేడలోన
అంతర్యామివి నీవు అంకెలఁజూచినను

**అవతారిక :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తన గాయకుల సామ్రాజ్యంలో తగిన ప్రాముఖ్యత పొందినప్పటికీ సాహిత్యప్రియుల మనస్సు దోచుకుంటుందనటంలో నాకు సందేహములేదు. అద్భుతమైన ఉపమానాలతో సాగిపోయే ఈ కీర్తనలో పరమాత్మ భోగేశ్వరుడు. జీవాత్మలన్నీ ఆయన భోగములు సంసారము, కర్మము, దేహము, చిత్తము, భక్తి, అంతరాత్మ అన్నీ స్వామి కల్పితములే అంటున్నారు.

**భావదీపిక :**

ప్రభూ! నీవు భోగివి (అనుభవించువాడవు). నేను భోగమును (అనుభవింపబడువాడను). నీవు నేను చెప్పబోయే వాటన్నిటికీ శ్రీగురుడవు (శ్రీపతివి). నన్ను చిత్తగించవయ్యా!

ఈ సంసారవృక్షానికి భావించిచూస్తే నీవు ఆచితూచి ఇచ్చే చక్కటి 'జన్మమే' పక్కువ ఫలము (పక్వమైన పండు). ఎంచిచూస్తే నీవు మా'కర్మము' అనే మదగజాన్ని యెక్కి నడిపే సమర్ధుడైన మావటివి.

నెట్టన (నిజముగా) నా దేహము అనే నిర్మలమైన రాజ్యానికి నీవు పట్టముకట్టుకొన్న చక్రవర్తివి. చక్కగా దానిని పరిపాలిస్తున్నావు. నా మనస్సు అనే దిట్టమైన వేగముగల గుఱ్ఱానికి ఉపమానంగా చెప్పాలంటే నీవు నేర్పరివైనట్టి రేవంతుడవు (స్వారీచేసే రౌతువు).

శాశ్వతమైన భక్తి అనే చంద్రోదయం జరుగవలె నంటే నీవు కరుణా సముద్రమును నాలో విస్తరింపజేయ వలసిందే. మాచెంతనే వున్న శ్రీవేంకటేశ్వరా! అంకెల జాచిన (అధీనులమై గమనిస్తే) నేను జీవుడను. ఇది ఒక మేడ. దీంట్లో సంచరించే అంతర్యామివి నీవే తండ్రీ!



**సంఖ్య : 354 సంపుటము : 4 పుట : 238 రాగం : మంగళకౌశిక**

పల్లవి: భారకుఁ డతఁడే బంధువుఁ డతఁడే
చేరితి మతనినే చెంచెలమేలా

చ. 1: చెనకునాయుధము చేతఁ గలిగితే
ఘననిర్భయుఁడై కడఁగీనట్ల (ట?)
అనంతాయుధుఁ డాతుమనుండఁగ
వెనుకొని యెందుకు వెఱవఁగనేలా

చ. 2: భువి నొకరాజునుఁ బొందుగఁ గొలిచిన
యివల నచ్చికం బెరఁగఁడట
భువనరక్షకుఁడె పొదిగొని యేలఁగ
వివరించి యొరుల వేఁడఁగనేలా

చ. 3: తోవ నిధానము దొరికినయప్పుడే
యేవిధములు మరి యెంచఁడట
శ్రీవేంకటపతి చేకొని కావఁగ
భావన నితరోపాయములేలా

**అవతారిక :**

భారకుడు అంటే భారము మోసేవాడని అర్థం. అన్నమయ్య యేమంటున్నారంటే జీవులందరికి పుట్టిన దగ్గర్నుంచి చచ్చేదాకా నిజమైన బంధువు, యెవ్వరు? ఆ శ్రీహరియే. నేడు అతనిని చేరుకున్నాం. ఇంకా చిత్తచాంచల్యం యెందుకు? అంటున్నారు.

**భావదీపిక :**

అయ్యలారా! జీవలందరి భారకుడు (బరువుమోసేవాడు) ఆ శ్రీహరియే. బంధువు కూడా అతడే. మేము అతనినే జేరినాము. ఇంకా మాకు చాంచల్యమెందుకు?

చేతిలో చెనకగల ఆయుధం వుంటే భయం వుండదు. విశ్వరూపుడై అనంత బాహువులు, అనంతమైన ఆయుధములున్నవాడు మా ఆత్మలోనే వున్నాడు. ఇంకా వెనుకొని (వెనకకు తగ్గి) భయపడుటేందుకు?

భూమి మీద ఒక రాజుని ఆశ్రయిస్తే, సేవిస్తే ఇవల అచ్చికము (కొఱత) యెరుగంట. మరి ఆ శ్రీహరి భువన రక్షకుడు, జగదేకపతి కదా! ఆయనే పొదిగొని (పూని) యేలగా నేను వేరొకరిని వేడుకొనుట యెందుకు? రాజులు ఇచ్చే రక్షణ యేపాటిది?

త్రోవలో నిక్షేపము దొరికిన వాడు చిన్న చిన్న ధనాదాయములను లెక్కచేయడు. అదే విధంగా శ్రీవేంకటేశ్వరుడే చేకొని రక్షిస్తుంటే ఇతరోపాయములతో అన్యదేవతలను ఆరాధిస్తు బ్రతుకుట యెందులకు?

**సంఖ్య : 139 సంపుటము : 1 పుట : 95 రాగం : భూపాళం**

పల్లవి: భోగి శయనమును బుసకొట్టెడిని
యోగనిద్ర పాయును మేల్కొనవే
చ. 1: కన్నులు దెరవక కమలబాంధవుఁడు
వెన్నెల రేణువు వెలయ దిదే
అన్నన మలసీ నరుణోదయ మిదే
మిన్నక నీవిటు మేలుకొనవే
చ. 2: తెల్లనికన్నులు దెరవక విరియఁగ
నొల్లక జలజము లున్నవివే
కల్లనిదుర నినుఁ గవియఁగ నియ్యక
మెల్లనాయ నిటు మేలుకొనవే
చ. 3: తెరవగు రెప్పలు దెల్లవారవలె
తెరవక చీఁకటి దీరదిదే
తెరఁగు వేంకటాధిప నీవెఱుఁగుదు
మెఱుఁగులు చల్లుచు మేలుకొనవే

**అవతారిక :**

శ్రీమన్నారాయణుడు శేషతల్పముపై యోగనిదురలో నున్నాడు. ఆదిశేషుడు నిన్ను సేవించుకోవాలని బుసలుకొడుతున్నాడు. దానివలన నీయోగనిదుర చెదరిపోతుంది. కాబట్టి ఇకనైనా మేల్కొనవయ్యా అని స్వామిని నిదురలేపుతున్నారు అన్నమయ్య, ఎంతటి ధన్యులు.

**భావదీపిక :**

స్వామి! నీ భోగిశయనమును (శేషతల్పము కూడా) బుసకొడుతున్నది). దానివలన నీ యోగనిదురపాయును (విడిచిపోతుంది). ఇకనైనా మేల్కొనవయ్యా!

నీవు కన్నులు తెరువకపోతే కమలబాంధవుడు (సూర్యుడు), వెన్నెలరేరాజు చంద్రుడు కనబడరుకదా! కొద్దిపాటి అరుణకాంతి వ్యాపిస్తున్నది. ఇంకా జాగుచేయక నీవిటు మేల్కొనవయ్యా!

నీ తెల్లని కన్నులు తెరవకపోతే జలజములు (పద్మములు) విరియంగ నిచ్చగించవు. నీ కల్లనిదుర (దొంగనిద్ర) నిన్ను ఆక్రమించనీయకు స్వామీ! ఇప్పుడు మేల్కొనవే ప్రభూ! పోనీ మెల్లగా మేల్కొనవయ్యా!

నీవు రెప్పలు తెరవాలి, తెల్లవారాలి. నీవు రెప్పలు తెరవకపోతే ఇదే చీకటి తీరనేతీరదు. ఓ శ్రీవేంకటేశ్వరా! తెరగు (తరించు మార్గము) నీవెఱుగుదువు. ఇకనైనా మెఱుగులు (కాంతులు) వెదజల్లుచూ మేల్కొనవయ్యా!



**సంఖ్య : 37 సంపుటము : 1 పుట : 24 రాగం : శ్రీరాగం**

పల్లవి: మనసిజ గురుఁడితఁడో మరియుఁ గలఁడో వేద
వినుతుఁ డీతఁడు గాక వేరొకఁడు గలఁడో
చ. 1: అందరికి నితఁడెపో అంతరాత్ముఁడనుచు-
నందు రితఁడో మఱియు నవల నొకఁడో
నందకధరుఁడు జగన్నాథుఁడచ్యుతుడు గో-
విందుఁ డీతఁడుగాక వేరొకఁడు గలఁడో
చ. 2: తనర నిందరికిఁ జైతన్యమొసఁగిన యాతఁ-
డొనర నితఁడో మఱియు నొకఁడు గలఁడో
దినకరశతతేజుఁడగు దేవదేవుడు, త-
ద్వినుతుఁ డితుడఁగాక వేఱొకఁడు గలఁడో
చ. 3: పంకజభవాదులకుఁ బరదైవ మితఁడని
అంకింతురితఁడో అధికుఁడొకఁడో
శాంకరీస్తోత్రములు సతతమునుఁ గైకొనెడి-
వేంకటవిభుఁడో కాక వేరొకఁడు గలఁడో

**అవతారిక :**

శ్రీమన్నారాయణుడే ఈ ఏడుకొండల యేలిక. మన్మథుని తండ్రి మరింకెవరున్నారు? వేదములన్నీ వేనోళ్ళ వినుతించేది ఈయనగాక వేరొకరున్నారా? అని తెగవేసి అడుగుతున్నారు అన్నమయ్య. అంతరాత్ముడు, చైతన్య స్వరూపుడు, శతసూర్యతేజుడూ, పార్వతీస్తుత్యుడు, ఈ వేంకటవిభుడు కాక వేరెవరున్నారు?

**భావదీపిక :**

మానవులారా! మనసిజగురుడు (మన్మథుని తండ్రి) ఇతడేనా? లేక మరెవరన్నావున్నారా? చతుర్వేదములు వినుతించేది ఇతడుగాక వేరొకరున్నారా? లేరు గాక లేరు.

జీవులందరికీ అంతరాత్మ ఇతడేపో! అని అంటారు. ఇతడుగాక మరి అవతల వేరొకడున్నాడా? నందకమనే ఖడ్గాన్ని ధరించే జగన్నాథుడు, అచ్యుతుడు, గోవిందుడు అని పిలువబడే ఈ మహానుభావుడు కాక వేరొకరున్నారా?

తనర (అతిశయముగా) అందరికీ చైతన్యమొసగిన ఆతడితడేనా? లేక మఱియొక డున్నాడా? శతదినకరతేజుడు (వందమంది సూర్యుల కాంతి గలవాడు) దేవదేవుడు, తద్వినుతుడు (వైష్ణవులందరిచే కీర్తించబడెడివాడు) ఇతడు గాక వేరొకరున్నారా?

పంకజభవుడైన బ్రహ్మాది దేవతలకు సైతము పరదైవము (పరమాత్ముడు) ఇతడేకదా! వారందరూ అధికుడని అంకింతురితనినే (ఈతనినే స్తుతింతురు). శాంకరి (పార్వతీదేవి) స్తోత్రములను యెల్లప్పుడూ స్వీకరించునది ఈ శ్రీవేంకటేశ్వరుడా లేక వేరుగా మరెవరున్నారు? లేరు.

**సంఖ్య : 443 సంపుటము : 1 పుట : 300 రాగం : రామప్రియ**

పల్లవి: మరలి మరలి జయమంగళము
సొరిది నిచ్చలును శుభమంగళము
చ. 1: కమలారమణికి గమలాక్షునకును
మమతల జయజయమంగళము
అమరజననికిని అమరవంద్యునకు
సుముహూర్తముతో శుభమంగళము
చ. 2: జలధికన్యకును జలధిశాయికిని
మలయుచును శుభంమంగళము
కలిమికాంత కాకలికివిభునికిని
సులువులయారతి శుభమంగళము
చ. 3: చిత్త జుతల్లికి శ్రీవేంకటపతికి
మత్తిల్లినజయం మంగళము
యిత్తలనత్తల యిరువురకాఁగిటి
జొత్తులరతులకు శుభమంగళము

**అవతారిక :**

అత్యద్భుతమైన మంగళగీతం పాడుతున్నారు అన్నమయ్య. ఇది నేను విశ్లేషిస్తున్న 2815వ కీర్తన అనేక మార్లు నేను విని పరవశించిన ఈ కీర్తనను నేను ఇంతవరకు విశ్లేషించలేకపోయానంటే అది కేవలం నా దురదృష్టం. హరి ఆజ్ఞ లేనిదే ఏదీ జరుగదు అనడానికి ఇంకా మీకు సాక్ష్యం కావాలా??

**భావదీపిక :**

శ్రీసతికి శ్రీపతికి నేను మరల మరల జయమంగళము పలుకుచున్నాను. నిచ్చలును (ప్రతినిత్యమూ) సొరిది (క్రమబద్ధముగా) శుభమంగళము పలికెదను.

కమలాదేవికి, కమలనేత్రుడైన శ్రీహరికి మమతానురాగములతో జయమంగళం పలికెదను. అమరజననికి (దేవతల మాతృమూర్తియైన లక్ష్మీదేవికి) దేవతలు స్తుతించే నారాయణునకు సుమూహర్తము కలిగిన శుభమంగళము.

సాగర పుత్రికకు, క్షీరసాగరశయనుడైన విష్ణువునకు మలయుచు (ఉద్యమించుచు) జయమంగళం పలికెదను. కలిమికాంతకు (ధనలక్ష్మికి) కలికవిభుడు శ్రీనాథునికి అతి సులువైన శుభమంగళము.

చిత్తజుతల్లికి (మన్మథుని కన్నతల్లికి) శ్రీవేంకటేశ్వరునికి మత్తిల్లిన (సగర్వముగా) జయమంగళము పలుకుచున్నాను. ఇత్తలనత్తల (ఇటూ అటూ చేరిన) ఇద్దరు భూమామణులు (శ్రీదేవి, భూదేవి) కౌగిట్లో జోడు రతులకు శుభమంగళము.



**సంఖ్య : 402 సంపుటము : 1 పుట : 269 రాగం : గుండక్రియ**

పల్లవి: మరిగి వీరిపో మాదైవంబులు
కెరలిన హరి సంకీర్తనపరులు
చ. 1: వినియెడి వీనుల విష్ణుకథలకే
పనిగొందురు మాప్రపన్నులు
కనియెడి కన్నులు కమలాక్షునియం-
దనువుపరతు రటు హరిసేవకులు
చ. 2: పలికెడిపలుకులు పరమాత్మునికై
యలవరతురు శరణాగతులు
తలఁచేటి తలఁపులు ధరణీధరుపై
తలకొలుపుదు రాతదియ్యులు
చ. 3: కరముల శ్రీపతికైంకర్యములే
మురియుచుఁ జేతురు ముముక్షులు
యిరవుగ శ్రీవేంకటేశ్వరు మతమే
సిరుల నమ్ముదురు శ్రీవైష్ణవులు

**అవతారిక :**

శ్రీ వైష్ణవ గురువులపై చక్కని కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. వీరేపో! మా దైవము అంటున్నారు. ఆ హరిసేవకులు మనస్సుకు కమలాక్షునియందు అనుకూల పరుస్తారు. శ్రీవేంకటేశ్వరుని మతమే నమ్మిన వారు మన బోంట్లకు "సిరుల" నమ్ముదురు, అంటున్నారు.

**భావదీపిక :**

కెరలిన (అతిశయించిన) హరి సంకీర్తనా పరులైన ఈ హరిదాసులు మమ్ము హరిని చేర్చెదరు. అందుకే మరిగి (పరిచితమైన) వీరేపో! మా దైవము.

వీనులు కేవలం వినటానికి కాదు, విష్ణుకథలు విని తరించడానికని ఆప్రపన్నులు (శరణాగతులు) పనిగొందురు (నియోగిస్తారు). చూచే కన్నులున్నది కమలాక్షుని దర్శించుటకే అని మనని హరిసేవకు అనువు (అనుకూల) పరతురు.

ఆ శరణాగతులు మాట్లాడే శక్తివున్నది, చెత్త మాట్లాడుటకు కాక, పరమాత్ముని నుతించుట కొరకని అలవాటు చేస్తారు. మనస్సులో యే తలంపు వచ్చినా ఆ తదియ్యులు (భాగవతులు) ధరణీధరునిపై తలకెలుపుదురు (లగ్నము) చేయింతురు.

శ్రీహరి మనకు చేతులిచ్చినది శ్రీపతి కైంకర్యమునకే అని మురియుచు మనల్ని ముముక్షువులను (విడచి పెట్టుటకు సిద్ధపడినవారుగా) చేస్తారు. అతిశయించిన శ్రీవేంకటేశ్వరుని మతమే సిరుల పంట అని ఆ శ్రీవైష్ణవులు నమ్ముతారు.

**సంఖ్య : 446 సంపుటము : 1 పుట : 299 రాగం : పాడి**

పల్లవి: మఱియు మఱియు నివె మాపనులు
మెఱసితి మిందే మిక్కిలిని
చ. 1: నారాయణునకు నమస్కారము
ధారుణీపతికిని దండము
శ్రీరమణునకును జేరి శరణ్యము
వారిధిశాయికి వరుస జోహారు
చ. 2: రామకృష్ణులకు రచనలబంటను
దామోదరునకు దాసుఁడను
వామనమూర్తికి వాకిటిగొల్లను
సోమర్కనేత్రునిసొరిదిలెంకను
చ. 3: గోవిందునికే కొలువులు సేతుము
దేవొ త్తముబడిఁ దిరుగుదుము
భావజగురునకు పంపునడతుము
శ్రీ వేంకటపతి సేవింతుము

**అవతారిక :**

అన్నమయ్య ఈ కీర్తనలో తమకు కర్తవ్యం నారాయణుని సేవ తప్పించి మరేమీ లేదని నొక్కివక్కాణిస్తున్నారు. ఏది చెప్పినా అనంతనామాలున్న హరి నామాలను అనేకమార్లు అనేక విధముల పలుకుటయే ఆయన జీవనగమ్యం.అదే ఆయన పని. అదే ఆయన మనబోటి వారికి పెట్టిన బిక్ష.

**భావదీపిక :**

హరిభక్తులారా! నాకు మరే కర్తవ్యములేదు. మళ్ళీమళ్ళీ నేను చేయవలసినది ఒక్కటే పని. మా పనులన్నీ హరి సేవయే. మేము దీంట్లోనే మెఱసితిమి( ప్రకాశించితిమి).

నేను నమస్కరించేది నారాయణునికి, ఆ ధారుణీపతికి నా దండములు. నేను శరణుచొచ్చినది శ్రీనాథునికి. వారధిశయనునికి (క్షీరసాగరశయనునికి) నేను వరుసగా జోహారు (జయము జయము) పలికెదను.

రామకృష్ణులకు (ఏకకాలమున బలరామునిగాను శ్రీకృష్ణునిగాను అవతరించిన) స్వామి రచనలకు (లీలలకు) నేను బంటును. దామోదరునికి దాసుడను. వామనమూర్తికి వాకిటి గొల్లను (వాకిట్లో కావలి గొల్లవాడిని). సోమార్కనేత్రునికి (సూర్యచంద్రనేత్రునికి) నేను యుక్తమైన శిష్యుడను.

మేము గోవిందునికి మాత్రమే కొలువు సేతుము. దైవశిఖామణి వెంట మాత్రమే మేము తిరిగెదము. భావజగురుడు (మన్మథుని తండ్రి)యైన శ్రీహరి ఆజ్ఞాపించినట్లే నడుచుకొంటాము. ఈ తిరిమలాదీశుడైన శ్రీవేంకటేశ్వరుని మాత్రమే సేవిస్తాము.



**సంఖ్య : 252 సంపుటము : 5 పుట : 172 రాగం : శ్రీరాగం**

పల్లవి: మామనునేతు మాగతవానసి
కౌముక విద్యా కల చలరే
చ. 1: భిల్ల వధూ కుచ పీడన కుతుకో
త్ఫుల్ల కరాంబుజ భూషణ !
పల్లవ గోపక పరివృత ! శఠజన
వల్లభ ! రతి పరవశ ! చలరే
చ. 2: గోపీజన కుచ కుంకుమ పంకవి-
లేపన మిళిత లలిత దేహా!
తాపకరణ ! సంతత బహు వినయా
లాప ! రూపమేళన ! చలరే
చ. 3: పరవనితామణి పరతంత్రత్వాత్
పరుష నఖాంకిత పతిరసికిమ్
కురువక భూరుహ కుంజ గృహంతే
తిరువేంకట నగాధిప చలరే

**అవతారిక :**

శృంగారంలో నాయిక తన ప్రియుడిని "రా" కోట్టటం పరిపాటే. అన్నమయ్య వినిపిస్తున్న ఈ సంస్కృత కీర్తనలో నాయిక, ముందు ఇక్కడనుంచిపోరా! ఇప్పటికి వచ్చావులే నీవు కామకళా ప్రవీణుడవు కాదన్నదెవరు? గోరంట చెట్ల పొదల్లో నీవు ఆడువారిని యేమిచేస్తావో నాకు తెలియదా?

**భావదీపిక :**

మామను నేతుంఅసి (ఎందుకంత బ్రతిమిలాడతావు?) ఆగతవాన్‌రే (నీ దగ్గరకు వచ్చాను కదరా!) నీవు కామవిద్యావిశారదుడవు చలరే (ముందు ఇక్కడ నుంచి పోరా!)

చెంచులక్ష్మీ కుచపీడనాసక్తికల నారసింహా! అందులకై నీచేతులు పద్మముల వలె వికసిస్తాయి. ఆ చేతులే నీకు భూషణములు. విటులైన గొల్లవాళ్ళు చుట్టూచేరినవాడా! నీవు అన్యస్త్రీల నెరుగనట్లు నటించే శఠులకు నాయకుడవు. నీవు రతిలో యెంత పరవశిస్తావో నాకు తెలియదా? పోరా!

గోపికల కుచములపైని కుంకుమ చందన మిశ్రమం లేపనం వలె వెరుస్తున్న దేహము కల శ్రీకృష్ణా! నీవు నక్కవినయాలు చూపించే మాటల గారడీవాడవు. అనేక రూపాలతో నీవు వారితో కూడెదవు. ఒరేయ్ ఇక్కడినుంచి వెళ్ళిపోరా!

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు పరస్త్రీలకు పరతంత్రత్రాతవు (కట్టుబానిసవు). నీవు కూడిన స్త్రీలకు వాడిగోళ్ల వున్నట్లు తోస్తున్నది. కురువక భూరుహకుంజగృహంతే (నీఇల్లు ఇక్కడ కాదురా! ఆడవాళ్ళతో క్రీడించే గోరంట్ల చెట్టు పొదరిళ్ళు నీ ఇళ్ళు). శుభప్రదమైన వేంకటనగాధీశా! ముందు ఇక్కడ నుంచి పోరా!

**సంఖ్య : 467 సంపుటము : 1 పుట : 333 రాగం : సాళంగనాట**

పల్లవి: ముంచినవేడుకతోడ మొక్కుటగాక
కంచములోపలికూడు కాలఁదన్ననేఁటికి
చ. 1: వేదార్థములు నీవేమిహరించినసుద్దులే
కాదని అవునని కొన్ని వాదములేల
యేది నీవు సేసినాను యిన్నియును నియ్యకోలే
సోదించనేఁటికి యందు సొట్టు లెంచనేఁటికి
చ. 2: కర్మము లిన్నియును నీకైంకర్యసాధనలే
అర్మిలిఁ దారతమ్యము లడుగనేల
నిర్మితము నీ దింతే నెరసు లెంచంగనేల
ధర్మమందు నింక గజదంతపరీక్షేఁటికి
చ. 3: భక్తియింతా నొక ఘంటాపథము నీశావలే
యుక్తిఁ బాత్రాపాత్రములు ఊహించనేల
ముక్తికి శ్రీవేంకటేశ మూలము నీపాదములు
సక్తులయి నమ్ముటగాక చలపదమేఁటికి

**అవతారిక :**

అన్నమయ్య ఈ కీర్తనలో శ్రీహరి కరుణకు పాత్రులవ్వాలంటే మీరు వేదవేదాంగాలను శోధించనక్కరలేదు. గజదంత పరీక్షల వంటి కర్మకాండలు చేయవలసిన పనిలేదు. భక్తితో చేసేదేదైనా నీ సేవయే స్వామీ! నీ పాదములను నమ్మితే ఇంకా తడబాటు పడటం వుంటుందా? అంటున్నారు.

**భావదీపిక :**

మన యెట్టెదుటనున్న ఈ నిలువెత్తు దేవునికి వేడుకతో మొక్కక వుండుట, చక్కటి కూడు పెట్టిన కంచాన్ని కాలితో తన్నటం వంటిదే. అదెందుకు చెప్పండి.

వేదవేదాంగములన్నీ నీవెట్లు విహరించితివో తెలిపే సంగతులే. వాటిపై అవునని కాదని వాదనలెందుకు? నీవేది చేసినా అన్నీ మాకు ఇయ్యకోలే (అంగీకారమే). వాటి బాగోగులు పరిశోధించుటదేనికి? సొట్టులు వెతుకుటదేనికి?

మేము చేసే యజ్ఞ, యాగ, పూజ, కర్మలేవైనా నీ శరణాగతి విధానములే. అర్మిలి (అపేక్షతో) చేయాలేగాని వాటిలో తారతమ్యములెంచవచ్చునా? ఈ సృష్టి నీవు నిర్మించినదే. అంతే, దీనిలో లోపాలను వెదుకుట అవివేకం కాదా? నీవే గీతాచార్యుడవు, నీ ధర్మమును తర్కించటం ఏనుగు దంతాలను శుభ్రపరచటం లాంటిది పనికి మాలిన ప్రయాస.

ఘంటాపథంగా భక్తితో చేసేదేదైనా నీ సేవయే. అందుయుక్తితో పాత్రాపాత్రములు (తగినవి తగనివి) వూహించుట దండుగ. ఓ శ్రీవేంకటేశ్వరా! ముక్తికి మూల సాధనం నీపాదము. సక్తులై (మనస్ఫూర్తిగా) నమ్మాలిగాని తడబాటెందుకు?



**సంఖ్య : 263 సంపుటము : 1 పుట : 176 రాగం : ఆహిరి**

పల్లవి: మోహము విడుచుటే మోక్షమది
దేహ మెఱుఁగుటే తెలివీనదే
చ. 1: ననిచిన తనజన్మముఁ గర్మముఁ దన-
పనియు నెఱుగుటే పరమ మది
తనకు విధినిషేధములుఁ బుణ్యముల-
ఘనత యెఱుగుటే కలిమి యది
చ. 2: తతిఁదతిఁ బ్రేమపుతల్లిదండ్రులను
యెఱఁ గనిదే కులహీన తది
చఱులఁ బొరలి యాచారధర్మములు
మఱచినదే తనమలిన మది
చ. 3: కమ్మరఁ గమ్మరఁ గామభోగములు
నమ్మి తిరుగుటే నరక మది
నెమ్మది వేంకటనిలయునిదాసుల-
సొమ్మయి నిలుచుట సుకృత మది

**అవతారిక :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో మనం తరచుగా వాడే మోక్షము తెలివి అనేమాటలకు నిజమైన అర్థం వివరిస్తున్నారు. పరము, పుణ్యము, కులహీనత, మలినము, నరకము, సుకృతము-వంటి మాటలకు నిజమైన అర్థం యెంతమందికి తెలుసు? కావాలంటే మీరూ వినండి.

**భావదీపిక :**

అయ్యలారా! అరిషడ్వార్గాలలో ప్రధానమైనది "మోహము" దానిని విడిచిపెట్టటమే నిజమైన మోక్షము. ఈ దేహమే సుఖదుఃఖాలకు కారణం. ఇది అశాశ్వతం అని తెలియుటయే నిజమైన తెలివి. అందుకని మనం తెలివిలేని వారమే.

తనకు కలిగిన పుట్టుక "పురాకృత కర్మ" వలన అని తెలియుటే పరము (కైవల్యము). తనకు విధి నిషేధించిన పనులు చేయకుండుటే "పుణ్యము". కలిమి అంటే ధనంవుండుట కాదు. పుణ్యముల ఘనత నెరుగుట.

కులహీనుడంటే కులం చెడ్డవాడని కాదు. తనను కన్న తల్లిదండ్రులను ప్రేమించనివాడు. మలినము అంటే మురికి. దేహానికి అంటిన మురికి కడిగితే పోతుంది. కాని చఱులబొరలి (యధేచ్ఛగా తిరిగి) తన ఆచారధర్మమును మఱచుట తాను కడుగు కొనలేని మురికి.

మరల మరల కామభోగాలను నమ్మి యెట్లాపడితే అట్లా తిరుగటయే నిజమైన "నరకము" మనస్ఫూర్తిగా తాను శ్రీవేంకటేశ్వరుని దాసుల యొక్క సొమ్ముగా మారి వారి సేవకుడుగా జీవితం గడుపుటయే నిజమైన సుకృతము.

**సంఖ్య : 588 సంపుటము : 11 పుట : 337 రాగం : భవుళి**

పల్లవి: యోగి భోగి నటనం కురు వు(ఉ)ల్లాసాననమోహన
సాగరోద్భవకన్యకాపతి సారస శ్రీవేంకటగిరియోగి
చ. 1: లీలానక్షత్రజాలాధికరంద
మాలాత్రైవిక్రమాకారయోగి
హాలాహలకర కోలాహలకర
శూలాయుధవంద్య పరిపూర్ణయోగి
కాళీవినుత ప్రహేళిచరితాహి
మౌళిఘన సారవిన్యస్తయోగి
చ. 2: గరుడపక్షి వాహగమన విహారి
గురునాగశైలేశ గోరక్కు రే
మురళీనాదశృంగ మోహనమురారి రే
కరుణానంద సాగరశాయి రే
పరమ శ్రీవేంకటపతియవతార
నరరూప గోపికానాథ గోరక్కు రే

**అవతారిక :**

అతి చక్కని గీర్వాణిలో కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఆ తిరుమల శృంగారభోగరాయుడు, యోగీశ్వరుడు, త్రిజగంబుల నాక్రమించినట్టి త్రివిక్రముడు. కాళీస్తుత్యుడు, శూలిమిత్రుడు, గరుడగమనుడు, నరరూపగోపీనాథుడు-అని తనకే ప్రత్యేకమైన శైలిలో సప్తశైలేంద్రుని కీర్తిస్తున్నారు.

**భావదీపిక :**

ఓ సారస (ఆహ్లాదకరుడైన) వేంకటగిరి యోగీ, అటు గొప్పయోగులకు, ఇటు ఐహికభోగులకు ఆనంద నృత్యాన్ని చేయి ప్రభూ! సాగరపుత్రికకు భర్తవైన వో జగన్మోహనా! నీకు జయము.

లీలగా నక్షత్రసమూహమును కత్తుల మాలవలె ధరించిన త్రివిక్రమాకారాన్ని ధరించిన యోగీ! జయము. హాలాహలోద్భవ సమయమున జనించిన కోలాహలాన్ని వుపశమింపచేసిన శూలి (శంకరుడు) పూజించునట్టి యోగీ! జయము.

కాళీ (పార్వతీదేవి) నుతించు నిగూఢచరితా జయము. నాగాభరణములను శిరస్సున ధరించినందున కర్పూరము వలె శాంతిని ప్రసాదించు యోగీ! జయము.

గరుడపక్షి వాహనముగా విహరించు స్వామీ! జయము. ఘనమైన శేషాచలనివాసా! జయము. గోరక్షకుడవైన యోగీశ్వరా! జయము. మురళీనాదముచే సర్వులకు శృంగారభావనలు జనింపజేసిన వో మోహన-మురారీ! జయము. కరుణానందసాగరమున శయనించు దేవా! జయము. శ్రేష్ఠమైన శ్రీవేంకటపతి అవతారము ధరించిన ప్రభూ! మునులు నరరూపుధరించి గోపికలైతే వారు కోరినట్లే రమించిన గోపాలా! యోగేశ్వరా! జయము జయము.



**సంఖ్య : 403 సంపుటము : 3 పుట : 275 రాగం : భైరవి**

పల్లవి: విశ్వరూప మిదివో విష్ణురూప మిదివో
శాశ్వతులమైతి మింక జయము మాజన్మము
చ. 1: కొండవంటిహరిరూపు గురుతైన తిరుమల
పండిన వృక్షములే కల్పతరువులు
నిండినమృగాదులెల్ల నిత్యము క్తజనములు
మెండుగఁ బ్రత్యక్షమాయ మేలువో నాజన్మము
చ. 2: మేడవంటిహరిరూపు మించైనపైఁ డిగోపుర-
మాడనే వాలినపక్షు లమరులు
వాడలఁ గోనేటిచుట్ల వైకుంఠనగరము
యీడ మాకుఁ బొడచూపె ఇహమేపో పరము
చ. 3: కోటిమదనులవంటి గుడిలో చక్కనిమూర్తి
యీటులేని శ్రీవేంకటేశుఁడితఁడు
వాఁటపు సొమ్ములు ముద్రవక్షపుటలమేల్మంగ
కూటువై నన్నేలితి యెక్కువవో నాతపము

**అవతారిక :**

శ్రీహరి విశ్వరూప దర్శనం చేస్తున్నారన్నమయ్య. తిరుమలపై పండిన వృక్షాలలోను, మృగజాతిలోను, బంగారు శిఖరాలలోను, పక్షులలోను, కోనేటిలోను, తిరుమలేశుని మూర్తిలోను, శంఖచక్రాది సాయుధుడైన ఆ అలమేల్మంగ విభుని పరివారమే ఆయనకు కనుపిస్తోంది. నా జన్మ, నా తపమూ ఫలించాయి స్వామీ! అంటున్నారు. ఇది వ్రాస్తున్న నాకు అంతే ప్రభూ!.

**భావదీపిక :**

ఇదిగో విశ్వరూపము, ఇదిగో శ్రీమహావిష్ణురూపము, ఈ తిరుమలను దర్శించే మేము శాశ్వతులు (చిరంజీవులము) అయినాము. మా జన్మము జయము (ధన్యమైనది).

ఈ తిరుమల కొండ గుర్తేమిటి? కొండవంటి శ్రీహరి ఇక్కడ పండిన వృక్షములు. స్వర్గలోకములోని కల్పవృక్షాలే కదా! కిక్కిరిసి తిరుగాడు మృగములు నిత్యముక్తులైనయోగులే. మిగతావారికేమోగాని నాకు అట్లే ప్రత్యక్షమైనది. నా జన్మము మేలైనది కదా!

మేడవలె నిడుపైన హరిలోనున్న ఆలయపు బంగారు గోపురాలను చూడండి. వాటిపై వాలిన ఆ పక్షులు యెవరు? వారంతా దేవతలు. ఈ కోనేటి చుట్టూ వున్న వాడయే వైకుంఠనగరము. ఈడ తిరుమలపైననే మాకు కనుపిస్తున్న ఇహలోకమంతా పరలోకంలా దర్శనమిస్తున్నది.

ఈ గుడిలోని మూర్తి కోటిమన్మథుల సౌందర్యరాశి. ఇతడు సాటిలేని శ్రీవేంకటేశ్వరుడు. వాటమైన ఆయన నగల ధగధగలు చూడండి, శంఖచక్రాది ముద్రలను చూడండి. స్వామి వక్షముపైనున్న అలమేల్మంగమ్మను చూడండి. వీటన్నిటితో కూడినన్నేలితివి. నాతపము ఫలించింది.

**సంఖ్య : 217 సంపుటము : 1 పుట : 145 రాగం : ముఖారి**

పల్లవి: వెరపులు నొరపులు వృథా వృథా
ధరపై మరియంతయును వృథా
చ. 1: తడయక చేసినదానంబులు వృథా
యెడనెడ నెఱిఁగిన యెఱుక వృథా
వొడలిలోనిహరి నొనరుగ మతిలోఁ
దడవనిజీవమె తనకు వృథా
చ. 2: జగమున బడిసినసంతానము వృథ
తగిలి గడించినధనము వృథ
జగదేకవిభుని సకలాత్ముని హరిఁ
దెగి కొలువనిబుద్ధియును వృథా
చ. 3: పనివడికూడిన పరిణామము వృథ
వొనరఁగనుండినవునికి వృథా
ఘనుఁడఁగు తిరువేంకటగిరి హరిఁగని
మననేరని జన్మములు వృథా

**అవతారిక :**

మనం ఈ ప్రపంచంలో కొందరిని చూచి భయపడుతుంటాం, కొందరిని చూచి ఆశ్చర్యపడుతుంటాం. కానీ ఇది తాత్కాలికమే. దీని వలన మనకు ప్రయేజనమేమి లేదు. మరి ఇదంతా వృథాప్రయాస కాక మరేమిటి? అంటున్నారు అన్నమయ్య.

**భావదీపిక :**

ఓ మానవులారా! వెరపులు (భయములు) ఒరపులు ఆశ్చర్యములు వృథా వృథా. ధరపై (ఇలలో) మరి అంతా వృథా ప్రయాస అని తెలుసుకొండి.

తడయక (ఆలోచించక) యెవ్వరికైనా దానం చేస్తే అది వృథా. స్పష్టంగా కాక యెడనెడ (అక్కడక్కడా) నేర్చిన యెఱుక (నేర్పు) వృథా. మన దేహంలోనే వున్న హరిని బాగుగా తెలుసుకొలేని జీవము తనకు వృథాయే కదా!

ప్రపంచములో సంతానము పొందుట వృథా వృథా. అత్యాశతో గడించిన ధనము తనకు వృథాయే అవుతుంది. జగదేకపతియైన శ్రీహరి సకలాత్మలయందు స్థితుడే. అట్టి స్వామిని కొలవని బుద్ధివున్నా అది వృథాయే.

పనివేళా మార్పుతీసికొనివస్తే, అట్లా వచ్చిన మార్పుయెన్నాళ్ళుంటుంట? అదంతా వృథా. ఒకవేళ వున్నా అతనికి అంతా వృథాయే సుమా? ఘనుడైన శ్రీవేంకటగిరి హరిని చూచి ఆయన దాసుడై నివసించలేని మనిషి జన్మము వృథా కాకమరేమిటి?



**సంఖ్య : 217 సంపుటము : 5 పుట : 148 రాగం : శంకరాభరణం**

పల్లవి: వేఁటకాఁడనంటా నా వెంటఁ బాయవు వోరి
చీటకపు చెంచెంత నాచేతిలా గెరఁగవా
చ. 1: పొదలో నేనేసిన పులి నీవేసితినని
పెద్ద పెద్ద యెలుగుఁల బెదరించేవు
కుదురుగుబ్బల నిన్నుఁ గుమ్ముదునో వుండేవో మేను
చిదియఁగా మేటిచెంచెత నన్నెఱఁగవా
చ. 2: చేరువ నా మోఁటునఁ జేరిన నామెకముల
నేరుపరినంటా నీవునేసేవు
జీరలుగా కొమ్ము గోరఁ జింతునో వూరకుండేవో
పేరుకల చెంచెత నా బిరుదులెరఁగవా
చ. 3: చొల్లెపు చుట్టలతోడ చూపులకు నడ్డాలు
చెల్లునంటా వచ్చి చెట్టవట్టేవు
వొల్లననఁగా గూడేవు వుద్దండపు వేంకటేశ
జల్లివింటి చెంచెత నాచలములెరఁగవా

**అవతారిక :**

అన్నమయ్య చేసిన అద్భుతప్రయోగాలలో సంవాదనే కీర్తనలు అనన్యాసాధ్యమైనవి. తరచుగా నాయిక, నాయకునితో సంవాదిస్తుంటుంది. ఈ కీర్తనలో నాయిక చెంచులక్ష్మీ నాయకుడు నరహరి. ఆమెయెంత గడుసు చెంచెత అంటే... చొల్లెపు చుట్టలతోడ చూపులకు నడ్డాలు చెల్లనంటా వచ్చి చెట్టాపట్టేవు అని దెప్పుతోంది..

**భావదీపిక :**

ఆమె:– వేటగాడని, ఓరి! నా జంటవదలవేమిరా?
అతడు:– ఓ చీటకపు (సింగారాల) చెంచెతా! నా చేతినైపుణ్యం తెలీదా?
ఆమె:– పొదలోవున్న పులిని నేను వేస్తే నీవువేసితివని పెద్దపెద్ద ఎలుగుబంట్లకు చెప్పుకోరాదా?
అతడు:– కుదిరిన గుబ్బలున్న నిన్ను కుమ్మేస్తాను, వుండవే! ఓ మేటి చెంచెతా! చిదియగ (నలిగిపోతావు), నన్నెరగవటే!
ఆమె:–నామోటున (చిక్కులో) చేరిన మృగాన్ని నీవు పెద్దనేర్పరిలాగా కొట్టినావుగదా!
అతడు:– నాకొమ్ముగోర(కొనదేలిన గోళ్ళతో) జీరలు చింతునో (చారలుగా చీల్చేస్తాను) ఊరకుండవే. పెద్దపేరున్న చెంచెతా! నీవునా బిరుదులెరగవులే.
ఆమె:– ఓయి! చుట్టలు చుట్టిన నీజడ నీచూపులకు అడ్డాలుగావున్నవి. అయినా చెల్లునంటా (చెల్లిపోతుందిలే) అని వచ్చినాచేతులు చెట్టపట్టేవు. ఓ ఉద్ధండపు వేంకటేశా! వద్దన్నా నన్ను కూడెవు.
అతడు:– జల్లివింటి (తోకకుచ్చులు వ్రేలాడేవిల్లువున్న) చెంచెతా! నీవు నాపట్టుదల నెరుగవా?

**సంఖ్య : 228 సంపుటము : 2 పుట : 151 రాగం : శంకరాభరణం**

పల్లవి: శరణన్న విభీషణుఁ గరుణఁగాచిన వాఁడు
పరికింపఁదారక బ్రహ్మమా యీరాముఁడు
చ. 1: ఆలికై విల్లు విరిచె వాలికై యమ్మువేసిన-
వాలుమగఁటిమిగలవాఁడు వీఁడు
ఆలను జలధిగట్టి కేలనుమోక్షమిచ్చి
యేలెను జటాయువును యీతఁడా రాముఁడు
చ. 2: మింటికెట్లు దెగనేసియంటిపగసాధించి
దంటరాకుమారుఁడు తానీ శూరుఁడా
బంటుగా వాయుజునేలినంటు సుగ్రీవుతోఁజేసి
కంటక రావణవైరి ఘనుఁడా యీరాముఁడు
చ. 3: రాకాసులమర్దించి కాకాసురునటుగాచి
మైకొన్న జానకీరమణుఁడితఁడా
యీకడ శ్రీవేంకటాద్రి నిరవైతానునున్నాఁడు
దీకొన్న ప్రతాపపుఁదేవుఁడా యీరాముఁడు

**అవతారిక :**

శ్రీరామచంద్రమూర్తి విశిష్టతలను తలచి కీర్తిస్తున్నారు అన్నమయ్య. తారకబ్రహ్మము యీ రాముడేనా అని అబ్బురపడుతున్నారు. శ్రీవేంకటాద్రిపై వెలసి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తున్నది, ఈ ప్రతాపశాలియేనా అని ప్రశ్నిస్తూ స్తుతిస్తున్నారు.

**భావదీపిక :**

ఈ శ్రీరామచంద్రుని వైభవమును గ్రహించండి. ఈయన శత్రువుభ్రాత అయినా శరణన్న విభీషణుని కరుణతో రక్షించాడు. తరచిచూస్తే ఈ రాముడు తారక బ్రహ్మయాయేమి?

భార్యగా సీతను చేపట్టుటకు శివుని విల్లు విరచినాడు. వాలిని సంహరించుటకు రామబాణం వేశాడు. మగతనం గల దిట్ట ఇతడే కదా! రాళ్ళతో సేతువును నిర్మించి, కేలన (సునాయాసంగా) ప్రజలకు మోక్షం ఇచ్చాడు. జటాయువునేలిన రాముడితడేనా?

నింగిపై శరము సంధించి యంటి తన పగ సాధించిన మేటి రాకుమారుడా ఈ శూరుడు. వాయునందనుడైన హనుమంతుని బంటుగా స్వీకరించి ఆతని రాజైన కపివీరుడు సుగ్రీవునితో మైత్రి చేసికొని కంటకడైన రావణుని వైరిగా కీర్తిగడించిన ఘనుడితడా?

రాక్షస సంహారం చేసినా, శరణన్న కాకాసురుని ఆ రీతి కాపాడిన శరణాగతరక్షకుడీ జానకీవల్లభుడా? ఆనాడు అన్ని ఘనకార్యాలు చేసినేడు శ్రీవేంకటాద్రి నెలవైతానున్నాడు. ఆ విధంగా దీకొన్న (ఢీ కొనిన) ప్రతాపశాలి, ఈ శ్రీరామచంద్రుడా?



**సంఖ్య : 217 సంపుటము : 5 పుట : 148 రాగం : శంకరాభరణం**

పల్లవి: శ్రీపతి నీయాజ్ఞ సేసెద మిదివో
పూఁపల మాయలఁ బొరలఁగనేలా
చ. 1: కాయము సుఖదుఃఖములకు మూలము
పాయము యింద్రియపరవశము
ఆయము రెంటికి నన్నపానములు
మోయని మోఁపిది మునుఁగఁగనేలా
చ. 2: తలఁపు పుణ్యపాతకముల మూలము
కలిగిన పుట్టువు కర్మగతి
ఫల మిది రెంటికి బలుసంసారము
కలిగిన వెట్టికి కాదననేలా
చ. 3: జీవుఁ డింతటా సృష్టికి మూలము
భావము బ్రకృతికిఁ బ్రపంచము
చేవగ రెంటికి శ్రీవేంకటేశ్వర
నీ వంతరాత్మవు నెమకఁగనేలా

**అవతారిక :**

అన్నమయ్య శ్రీపతికి విన్నవించుకొంటున్నారు. ఇదిగో మేము నీ యాజ్ఞ పాటిస్తూనేవున్నాము కదా! అయినా మమ్మల్ని నీ మాయలో యెందుకు ముంచెత్తుతావు? నీ సృష్టిలో ప్రతిదానికి ఒక మూలమువుంటుంది. కానీ ఆ రెండిటికీ మూలకారణమైన శ్రీవేంకటేశుడే నా అంతర్యామి. ఇక నాకు బెదురెందుకు?

**భావదీపిక :**

ఓ శ్రీపతి! నీ ఆజ్ఞసేసెదము (అమలు పరచెదము). ఇదివో నీ యొక్క పూపల మాయల (ఉద్యమించిన మాయలలో) బొరలగనేల (పొర్లాడుటెందులకో) కదా!

సుఖదుఃఖములకు మూలమేమిటి? మా శరీరమే. ఇంద్రియ పరవశత్వము, పాయము (వయస్సు) ప్రభావము. ఆ రెండిటికి మర్మము అన్నపానములు. ఇది మోయలేని భారము. దీనిలో మునిగిపోవుటెందులకు?

మనిషి చేసే పాపపుణ్యాలకు కారణం యేమిటి? వాడి ఆలోచన. కలిగిన పుట్టుకలకు కారణమేమిటి? కర్మగతి. ఈ తలపులు, పుట్టుకలకు బలమైన సంసారము కారణము. సంసారమంతా వెట్టి చాకిరియే. దీనిని కాదనుట సాధ్యమా?

ఈ సర్వ సృష్టికి మూలము జీవుడు. ప్రకృతి ప్రపంచములకు మూలము భావము. ఈ రెండిటికి అనగా సృష్టికి, ప్రకృతికి మూలము శ్రీవేంకటేశ్వరుడేరా! మా అంతర్యామివైన నిన్ను ఇంకా దానికై నెమకగనేల? (అన్వేషించుటెందులకు?).

**సంఖ్య : 258 సంపుటము : 2 పుట : రాగం : మౌళి**

పల్లవి: శ్రీపతి నీవు సిద్ధించుటే సిద్ధులన్నియు
పైపై నీశరణమే పరమపదంబు
చ. 1: పరమాత్మునిపై నాత్మ ప్రవేశింపఁజేయుటే
పరికింపఁ బరకాయప్రవేశము
గరిమ నాహృదయాకాశమునఁ దలఁచుటే
గిరవై యబ్బినయట్టి ఖేచరత్వము
చ. 2: మంచి పరమహంసనామము ప్రాణులచే వింట
చంచుల వినేటి దూరశ్రవణము
కాంచి నీరూపము ఆరుకమలాల ధ్యానించుట
యెంచఁగ దూరగమన మింటిలో నౌట
చ. 3: సావధానమె లోచూపు సర్వథా నిన్నుఁ జూచుట
తావులనే అనిమిషత్వము చేరుట
శ్రీవేంకటేశ్వర నీసేవకుఁడై నిలుచుటే
వేవేలు తత్త్వజ్ఞానవిధుల నిలుచుట

**అవతారిక :**

అన్నమయ్య ఈ కీర్తనలో ఆనాటి ప్రజలతో అష్టసిద్ధులపై తన అభిప్రాయాలను చెబుతున్నారు. సరి అయిన "మంత్రశక్తి" (ఆనాటి) కాని "తంత్రశక్తి" కాని మనకుంటే ఈ సిద్ధులన్నీ సాధ్యమేనని "ఆదిశంకరుల" వంటి మహానుభావులు నిరూపించారు. దూరశ్రవణ, దూరగమనం, ఖేచరత్వం, పరకాయప్రవేశం చేసి చూపించుతుంటే కూడా నమ్మనివాణ్ణి వదిలిపెట్టి మీ పని మీరు చూసికొనండి.

**భావదీపిక :**

ఓ శ్రీపతీ! అష్టసిద్ధులువున్నాయంటారు. కాని నీవు సిద్ధించటం కంటే గొప్ప సిద్ధి వుంటుందా? ఆపైన నీ శరణాగతి పొందుటే పరమపదము 'వైకుంఠము' చేరుట.

పరమాత్మునిపై మన ఆత్మను ప్రవేశింపజేయుటే పరిశీలించి చూస్తే నిజమైన "పరకాయ ప్రవేశము" అనే సిద్ధి నాహృదయాకాశమున నిన్ను తలచుటే "ఖేచరత్వము" (ఆకాశంలో ఎగురుట), అదికూడా నాకు అబ్బినది.

పరమహంస వంటి మంచి గురువుల నామమును ప్రాణులు దూరం నుంచే వినగలరు. అదే సద్గురువు మహిమ. దానినే "దూరశ్రవణం" అని అంటే తప్పేమిటి? నీ దివ్యమంగళ రూపాన్ని షట్చక్రములలో ధ్యానించుటే ఇంట్లోవున్నా అనంత విశ్వంలో ప్రయాణించే "దూరగమనం".

అంతఃధర్శనము అంటే వేరే యేమి లేదు, సర్వథా నిన్ను మనస్సులో దర్శించగలుగుటయే అనిమేషత్వము చేరుట (దైవత్వము పొందుట) నీ దగ్గర చేరి రెప్పవాల్చక నిన్ను చూచుటయే. ఓ శ్రీవేంకటేశ్వరా! నీ సేవకుడై నిలచుటే అనేక తత్వజ్ఞాన విధులలో నిలచుట.



**సంఖ్య : 12 సంపుటము : 1 పుట : 8 రాగం : ధన్యాసి**

పల్లవి: సందడి విడువుము సాసముఖా
మంధరధరునకు మజ్జనవేళా
చ. 1: అమరాధిపు లిడుఁ డాలవట్టములు
కమలజ పట్టుము కాళాంజి
జమలిచామరలు చంద్రుఁడ సూర్యుఁడ
అమర నిడుఁడు పరమాత్మునకు
చ. 2: అణిమాదిసిరులనలరెడు శేషుఁడ
మణిపాదుక లిడు మతి చెలఁగా
ప్రణుతింపు కదిసి భారతీరమణ
గుణాధిపు మరుగురు బలుమరును
చ. 3: వేదఘోషణము విడువక సేయుఁడు
ఆదిమునులు నిత్యాధికులు
శ్రీదేవుండగు శ్రీవేంకటపతి
ఆదరమున సిరు లందీ వాఁడె

**అవతారిక :**

అన్నమయ్య చెప్పిన కీర్తనలో "సాసముఖా" అనే నూతన పదప్రయోగం చేశారు. ఇది సముఖ! సముఖ అనే హెచ్చరిక అని కొందరు పెద్దల భావన. "సందడి విడువుడు" అని వుంటే ఆ అర్థం సరిపోతుందికాని, "సందడి విడువుము" అంటే ఎలా సరిపోతుంది. నా అభిప్రాయం అది సహస్రముఖా! అని స్వామిని సంబోధించారని. కాని మిగిలిన చరణాలు హెచ్చరికనే సూచిస్తున్నాయి. అయితే సందడి విడుడు సముఖా సముఖా–అనవచ్చును కదా!

**భావదీపిక :**

సందడి విడువుము (గోలచేయటం ఆపండి) సాసముఖా (హెచ్చరిక హెచ్చరిక) మంధరగిరిని ధరించిన శ్రీహరికి మజ్జనవేళ (అభిషేకమునకు వేళైంది).

అమరాధిపులు (దేవతాప్రముఖులు) ఆలవట్టములు (విసనకఱ్ఱలతో) వీస్తున్నారు. కమలజ (శ్రీలక్ష్మీ!) కాళాంజి (తమ్ములువుమియు పాత్ర) పట్టుకోవమ్మా! ఓ సూర్యచంద్రులారా! ఇద్దరూ కలసి చామరములు వీచండి. ఈ పరమాత్మకు అన్నీ అమర్చండి త్వరగా త్వరగా!

అణిమాది సిద్ధులు కలిగిన ఆదిశేషుడా! స్వామి మనసుసంతసించునట్లు నీ మణులతో చేసిన పాదుకలను సిద్ధంచెయ్యి. భారతీరమణా (బ్రహ్మదేవా!) గుణాధిపుడను, మన్మథుని జనకుడును అయిన శ్రీపతిని పలుమరును (అనేక మార్లు) ప్రణుతింపుము (స్వామిని పొగడుము).

ఆదిమునులు (సనకాది మునీంద్రులు) నిత్యాధికులు (చిరంజీవులలో శ్రేష్ఠులు) విడువక చతుర్వేదములను గానం చేయండి. శ్రీదేవుడైన ఈ శ్రీవేంకటేశ్వరుడు మీ అందరికీ ఆనందముతో సిరిసంపదల నొసగి కరుణిస్తాడు.

**సంఖ్య : 488 సంపుటము : 28 పుట : 322 రాగం : లలిత**

పల్లవి: సరసుఁడ వవుదువు జాణ వవుదువు
యిరవైన పనులు మీరిద్దరికిఁ దగును
చ. 1: మోమున నిండె కన్నులఁ జెంగావి మించె
సెలవులఁ జిరునవ్వు చిమ్మిరేఁగెను
యెలమి నేకతమున నింతి నేమిసేసితివో
వులివచ్చి సిగ్గులను వోలలాడీని
చ. 2: చెమట చెక్కులఁ గారె చిత్తము సంతసమందె
తమి మేనఁ బులకలు దైవారెను
రమణితో నీవెంత రతిసాము సేసితివో
తిమురుచు సంతోసాన తెప్పలఁ దేలీని
చ. 3: మోవిపైఁ దేనియ లూరె ముచ్చటలు నోరికబ్బె
పూవులు కొప్పున నుండి పొందుగ రాలె
శ్రీవేంకటేశుడ కాంతఁ జెంది యం (యెం?) త చేసితివో
వేవేలు వేడుకలను వినోదించీని

**అవతారిక :**

అన్నమయ్య ఈ శృంగార కీర్తనలో చెలికత్తె వలె స్వామితో నీవు సరసుడవు జాణవు అనే మాట నిజమే మీరిద్దరూ (దేవి, స్వామి) చేసే పనులు మీకే తగియున్నవి. అంతులేని మీ వేడుకలు వినోదం కలుగజేస్తున్నాయి ప్రభూ! అంటున్నారు. ఇటువంటి కీర్తన అన్నమయ్యకు గాక పరులకు అసాధ్యం.

**భావదీపిక :**

స్వామీ! నీవు సరసుడవు, జాణవు (నేర్పరివి) అవుదువు (అయ్యెదవుగాక!) అతిశయించిన ఈ చిలిపి పనులు మీ ఇద్దరికి (స్వామికి, దేవికి) తగినట్టున్నవయ్యా!

ఆమె మొగమున కళలు సొంపారినవి. నిద్రలేమిచే కన్నులు ఎఱ్ఱబడినవి. అయినా పెదవులపై చిరునవ్వు తొణికిసలాడుతూనేవున్నది. ఏకాంతమున నీవామెను యేమి చేశావయ్యా? నులివెచ్చని సిగ్గులలో ఆమె వోలలాడుచున్నది.

ఆమె చెక్కిళ్ళు చెమటలు కారిపోతున్నాయి. మనస్సు ఆనందపరవశమైనది శరీరాలపై పులకలు నిక్కబొడుచుకొన్నవి. శ్రీరమణితో నీవెంత మదన సంగ్రామం చేశావో!! తిమురుచు (ఉద్రేకముతో) సంతోషముతో ఆ దేవి తెప్పలుదేలియాడినది (తలపుల నావలో తేలియాడుతొంది).

ముచ్చట్లతో నోరుతడి ఆరిపోయింది. అధరములు తేనెలూరుతున్నవి. ఆమె కొప్పునుండి పూలు జలజలా రాలిపోతున్నాయి. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవా కాంతను యెంత స్వాధీనము చేసికొంటివోగాని, అంతులేని వేడుకలు కాంతను సంతోషపు అంచుల చెంత నిలిపినది.



**సంఖ్య : 228 సంపుటము : 1 పుట : 153 రాగం : ముఖారి**

పల్లవి: సిరి దొలంకెడి పగలు చీఁక టా యితఁడేమి
యిరవు దెలిసియుఁ దెలియనియ్యఁడటుగాన
చ. 1: తలపోయ హరినీలదర్పణంబో
ఇతఁడు వెలుఁగుచున్నాడు బహువిభవములతోడ
కలగుణం బటువలెనె కాఁబోలు లోకంబు
గలదెల్ల వెలిలోనఁ గనిపించుఁ గాన
చ. 2: మేరమీరిననీలమేఘమో యితఁడేమి
భూరిసంపదలతోఁ బొలయుచున్నాడు
కారుణ్యనిధియట్ల కాఁబోలు ప్రాణులకు
కోరికలు దలఁపులోఁ గురియు నటుగాన
చ. 3: తనివోని ఆకాశతత్వమో యితఁడేమి
అనఘుఁడీ తిరువేంకటాద్రి వల్లభుఁడు
ఘనమూర్తి అటువలెనె కాఁబోలు సకలంబు
తనయందె యణఁగి యుద్భవమందుఁగాన

**అవతారిక :**

ధగధగలాడే నగలతో నల్లని ఆ శ్రీవేంకటేశ్వరుడు పగలు చీకటివొకచోటే వున్నాయా అన్నట్లున్నాడని పొగడుతున్నారన్నమయ్య. ఈయన మహిమ కాసేపు తెలిసినట్టుంది కాపేపు యేమీ తెలియనట్లుంటుంది. ఈ ఇంద్రనీల దర్పణం లాంటి ఈ నీలమేఘశ్యామునిది ఆకాశతత్వం.అందుకే కనబడినా లేదు, కనబడని చీకటిలోనూ వున్నాడు.

**భావదీపిక :**

ఈ స్వామి ధరించిన వైభవోపేతమైన నగలు, నల్లని ఆయన ఒంటిమీద మెరుస్తుంటే పగలు చీకటి సృష్టించినదితడేనా అన్నట్లున్నది. ఎందుకంటే ఆయన ఇరవు (మహిమ) కొంత తెలిసినట్లున్నాయేమి తెలియనియ్యడు.

ఆలోచిస్తే ఇతడు హరినీలదర్పణము (ఇంద్రనీలపు అద్దం) కాదుగదా! ఎన్నో వైభవాలతో వెలిగిపోతున్నాడే, మరి ఈయనకు గల గుణం కూడా లోకములో బయటకు కనబడే గుణాలలాగే కనిపిస్తున్నాయి. అద్దం చేసేపని కూడా అదే కదా! మనం యేమిచేస్తే బింబమూ అదే చేస్తుంది.

అతిశయించిన నీలమేఘమా ఇతడు అనిపిస్తున్నది. ఎందుకంటే పెద్దపెద్ద సంపదల నిండుకుండలావున్నాడు. కారుణ్యనిధి కాబోలు అని కూడా అనిపిస్తున్నది. ప్రాణుల తలపులో కోరికలు కురిపుస్తున్నాడు కదా! మరి.

అనఘుడైన (పాపరహితుడైన) ఈ శ్రీవేంకటేశ్వరుడు అంతులేని ఆకాశతత్వమున్నవాడా యేమి? ఈ ఘనమూర్తి అట్లాగేవుంటాడు కాబోలు. ఎందుకంటే ఆకాశము ఏమీలేనట్లున్నా సకల ఖగోలమండలము దాని యందే అణగివుంటుంది కదా! అన్నీ దానినుంచే వుద్భవిస్తాయి.

**సంఖ్య : 144 సంపుటము : 1 పుట : 98 రాగం : సామంతం**

పల్లవి: సులభమా మనుజులకు హరిభక్తి
వలనొంది మరికదా వైష్ణవుఁడౌట
చ. 1: కొదలేని తపములు కోటానఁగోటులు
సదన నాచరించి యటమీఁద
పదిలమైన కర్మబంధము లన్నియు
వదలించు కొనికదా వైష్ణవుఁడౌట
చ. 2: తనివోని యాగతంత్రములు లక్షలసంఖ్య
అనఘుఁడై చేసినయట మీద
జననములన్నిట జనియించి పరమపా-
వనుఁడై మరికదా వైష్ణవుఁడౌట
చ. 3: తిరిగితిరిగి పెక్కు తీర్థములన్నియు-
నరలేక సేవించినట మీఁద
తిరువేంకటాచలాధిపుఁడైన కరిరాజ-
వరదుని కృపఁగదా వైష్ణవుఁడౌట

**అవతారిక :**

అన్నమయ్య చెప్పిన ఈ కీర్తనలో మనుష్యులకు వైష్ణవుడు కావటం అంత సులభం కాదని అంటున్నారు. అసలు ముందు హరికృప వలన ఆయనపై భక్తి కలగాలి. తపమునాచరించి, కర్మబంధవిముక్తుడై, యేజన్మలోనో అనేకయాగముల నాచరించిన పుణ్యాత్ముడై పొందవలసిన జన్మలన్నీ పొంది, యెన్నో తీర్థములు తిరిగి సేవించి తద్వారా శ్రీవేంకటేశుని కృపపొందితే... అప్పుడు వైష్ణవుడవుతాడు.

**భావదీపిక :**

మనుష్యులకు హరిభక్తి అంత సులభంగా సిద్ధిస్తుందా?మరి హరిభక్తి కలిగాక కదా! వైష్ణవుడవుతాడు.

కొదవలేని కోటానుకోట్ల తపములు నాచరిస్తే ఆపైన భద్రంగా తగులుకొన్న కర్మబంధాలు తొలగిపోతాయి. ఆట్లావాటిని వదలించుకొంటే కదా! వైష్ణవుడవుతాడు. అది అంత సులభమా?

తనిలోని (తృప్తి చెందక) లక్షల సంఖ్యలో గొప్ప యాగతంత్రములను నిర్వహించి పుణ్యాత్ముడై, ఆ విధంగా పొందవలసిన జన్మలన్నీ పొంది పరమపావనుడైతేనే కదా! వైష్ణవుడవుతాడు? అది అంత సులభమా?

లెక్కలేనన్ని పుణ్యతీర్థాలలో తిరిగి తిరిగి నరలేక (ముదిమిని లెక్కచేయక) సేవించిన మీదగాని కరిరాజునిగాచిన శ్రీవేంకటేశ్వరుని కరుణ కలుగదు. అది కలిగితే కాని వైష్ణవుడు కాలేడు. మళ్ళీ మనం మొదటికే వచ్చాము. అది అంత సులభమా? చెప్పండి.



**సంఖ్య : 512 సంపుటము : 4 పుట : 345 రాగం : బౌళి**

పల్లవి: సులభుఁడై వున్నాఁడు సుగ్రీవనారసింహుఁడు
నెలకొన్నదాసులకు నిధానము వీఁడే
చ. 1: తుంగభద్రాతటమున తొడపై నిందిరతోడ
సింగారించుకొన్నవేల్పుసింహము వీఁడే
సంగతిగా దేవతలు జయవెట్టి కొలువఁగా
చంగటనే మహిమలఁ జెలరేఁగీ వీఁడే
చ. 2: చలువబండలమీఁద చక్కనికొండలదండ
అలరీని వీరనరహరి వీఁడె
వెలయు శంఖచక్రాలవేవేలు హస్తములతో
బలవంతుఁడై వున్నాఁడు పంతముతో వీఁడే
చ. 3: పువ్వులతోఁటలనీడ భువనేశ్వరములోన
జవ్వనపు మనుజ కేసరి వీఁడె
ఇవ్వల శ్రీవేంకటాద్రి నిరవై వరములిచ్చి
నవ్వుమోముతోడ భువనము లేలీ వీఁడే

**అవతారిక :**

భువనేశ్వరమనే వూరిలో వెలసిన సుగ్రీవనారసింహుని కీర్తిస్తున్నారు అన్నమయ్య. ఆయన (స్వామి) తన దాసుల పాలిటి నిధానమట. కీర్తనను బట్టి ఇది తుంగభద్రానది వొడ్డున వున్న నృసింహాలయంగాను, అక్కడ చలవరాతి బండల కొండమీద ఈ నృశింహుడు వెలిసినాడట. ఈయనే శ్రీవేంకటేశుడట.

**భావదీపిక :**

ఈ సుగ్రీవనరసింహుడు బహుసులభుడైన వున్నాడు. ఆయన యొక్క దాసులుగా స్థిరపడిన వారికి ఈయన నిధానము (పాతర) వంటివాడు.

తుంగభద్రానది ఒడ్డున వెలసిన ఈ నృసింహుని తొడపై ఇందిరాదేవిని సింగారించుకు కూర్చుని వున్న దేవసింహమీతడే. ఆయన సరసను జేరి దేవతలంతా జయజయధ్వానములు చేస్తుంటే మహిమలతో చెలరేగి వీడే చెంగటనే (చేరువనే) వున్నాడు.

అందమైన కొండల నడుమ చలువరాతి బండల మీద అలరిన వీరసింహము, వీడే. శంఖచక్రాలు ధరించిన ఈ స్వామి వేలాది హస్తములవాడు. హిరణ్యకశిపుని వరములకు ప్రతిగా పంతముతో చంపిన ఈయన గొప్ప బలవంతుడైయున్నాడు.

భువనేశ్వరమనే వూరిలో పూలతోటల నీడలో యౌవనం గల మనుజకేసరి (నరసింహము) వీడే. ఇటువైపున శ్రీవేంకటాద్రి మీద నెలకొని వరములిచ్చేది, ఈ నవ్వు మొగముతో భువనములేలేటి వీడే.

**సంఖ్య : 248 సంపుటము : 1 పుట : 166 రాగం : ముఖారి**

పల్లవి: సొరిది సంసారంబు సుఖమా యిందరికి
వెరవెఱంగక వగల వేఁగేరు గాక
చ. 1: దేహములు దలఁప సుస్థిరములా ప్రాణులకు-
నూహింప లోభ మట్లుండుఁ గాక
మోహంబుచే వెనకముందెఱుఁగలేక తమ-
దేహసుఖములు మరిగి తిరిగేరుగాక
చ. 2: నెలకొన్నద్రవ్యములు నిలుచునా యెవ్వరికి
అలవి నిలుపఁగరాని యాస గాక
బలువైన వట్టి విభ్రాంతిచే దగులువడి
తెలిసియును దెలియ కిటు తిరిగేరు గాక
చ. 3: నెఱయువిభవములెల్ల నిజములా యిందరికి
కొఱమాలినట్టి తమగుణముగాక
యెఱుకతోఁ దిరువేంకటేశుఁ గొలువఁగలేక
తెఱఁగుమాలిన బుద్ధిఁ దిరిగేరుగాక

**అవతారిక :**

"సొరిది సంసారము" అంటే యధాతథంగా వివరించలేము. సంసారంలో అన్నీ ఒక క్రమములో జరిగిపోతూనే వుంటాయి. అందరికీ దీంట్లో సుఖము దొరుకుతుందా? లేదు. కాని దీని విధానమేమిటో తెలియక దీని "వగలు" చూచి, భ్రమపడి ఇదే పనిగా వేగుతుంటారు దీంట్లోనే. ఎదురుగా వున్నా ఏడుకొండల వాడిని "శరణు" అనలేరు. అన్నమయ్య చెప్పేది అక్షర సత్యం.

**భావదీపిక :**

దానిష్టప్రకారం నడిచే సంసారంలో అందరికీ సుఖం దక్కుతుందా? లేదు. అంతా భ్రమ. దీని వెరవు (విధానం) యెఱుంగక (తెలియక) దీని వగలలో వేగేరు (సతమతమౌతారు).

ఆలోచిస్తే ప్రాణులకు ఈ దేహాలు శాశ్వతములా? కావే. "లోభం" వలన అట్లా అనిపిస్తుంది, అంతే! ఇక "మోహం" వలన వెనుక ముందు చూడక తమ దేహసుఖము కోసం వెంపర్లాడి పిచ్చి తిరుగుళ్లు తిరుగుతుంటారు అంతే.

ఎవ్వరికైనా సంపాదించిన ద్రవ్యము (ధనం) శాశ్వతంగా నిలుస్తుందా? నిలుపలేని "ఆశ" వలన అట్లా అనిపిస్తుంది అంతే. బలమైన "భ్రాంతికి" లోనై తాము తెలిసిన విషయమే అయినా తెలియనట్లు పిచ్చి తిరుగుళ్లు తిరుగుతుంటారు అంతే.

జీవితంలో యెన్నో వైభవాలు కలుగుతుంటాయి. మనందరికీ ఇది సహజమే. అయితే నరుడు కొఱమాలిన (పనికిమాలిన) తన "గుణము" చేత అవే నిజమని, శాశ్వతమని అనుకుంటాడు. ఎన్నడూ దీనిని తెలిసి శ్రీవేంకటేశ్వరుని కొలిచే బుద్ధిలేక, దారితప్పి పిచ్చి తిరుగుళ్ళు తిరుగుతుంటారు అంతే.



**సంఖ్య : 309 సంపుటము : 2 పుట : రాగం : శ్రీరాగం**

పల్లవి: హరి నీదాసులభాగ్య మిది యెంతని చెప్పేము
విరివైన నీసుద్దులు వింటిమయ్యా
చ. 1: నెమ్మదిని నీవనేటి నిధానము గన్నవారు
కిమ్ముల సంపన్నుల సుఖింతురయ్యా
కమ్మటి నీభక్తియనే కామధేను వున్నవారు
వుమ్మడి నచ్చికము లేకుందురయ్యా
చ. 2: చేరి నీపై చింతయనే చింతామణిగలవారు
కోరినట్టల్లా బదుకుదురయ్యా
సారపు నీకృపాపారిజాత మబ్బినవారు
బోరన సంతోసాలఁ బొదలుదురయ్యా
చ. 3: హత్తి నీనామమనే అమృతముగలవారు
నిత్తెమైన పదవుల నిలుతురయ్యా
యిత్తల శ్రీవేంకటేశ ఇన్నిటా నన్నేలితివి
సత్తుగా నీవారు నాకుఁ జనవిత్తురయ్యా

**అవతారిక :**

అన్నమయ్య శ్రీహరితో యేమి చెబుతున్నారో ఆలకించండి. స్వామీ! నీ దాసుల భాగ్యమునెంతని వర్ణించను? అంతేలేని నీ భాగవత గాథలు యెన్ని విన్నామయ్యా? నీ నామామృతమును గ్రోలినవారు నిత్యమైన పదవులలో నీ పరివారంగా నిలిచిపోతారు అంటున్నారు.

**భావదీపిక :**

ఓ శ్రీహరీ! నీ దాసుల భాగ్యము ఇది యింత అని యెట్లు చెప్పగలమయ్యా? విరివైన (అంతులేని) నీ సుద్దులు (కథలు) మేము వింటిమి స్వామీ!

"నీవు" అనే పెన్నిధిని తన మనస్సులో పొందినవాడు కిమ్ముల (తమ మనస్సులలోనే) సంపన్నులవలె సుఖింతురు. కమ్మటి నీ భక్తి అనే కామధేనువును పొందినవారు తమకు యెట్టి అచ్చికము (కొరత) లేకుందురయ్యా!

నీ పైననే ఆలోచన అనే చింతామణిని స్వంతం చేసికొనినవారు తాము కోరుకున్న విధంగా బ్రదుకు గడుపుతారయ్యా! సారవంతమైన నీ కృప అనే పారిజాతం యెవ్వరి వద్ద వుంటుందో, వారు బోరన (శీఘ్రముగా) సంతోషాలలో తేలియాడుతుంటారు.

హత్తి (పొందికగా) నీ నామామృతము నాస్వాదించినవారు చిరంజీవులై నిత్యమైన పదవులను వైకుంఠములో పొందుతారు ఈ విధంగా వో శ్రీవేంకటేశా! అన్ని విధాలా నన్నేలితివి. నీవారు (వైష్ణవులు) నిజముగా నాకు చనవిత్తురయ్యా (ఆప్యాయతనిస్తారు స్వామీ!)

**సంఖ్య : 358 సంపుటము : 2 పుట : రాగం : లలిత**

పల్లవి: హరిహరి నీమహిమ లనంతములు
విరతి జీవులకెల్ల నేరుపులై వున్నవి
చ. 1: యెందరు భోగించినదో యీబ్రహ్మాండము దొల్లి
అందరికిఁ దమతమదై వుండును
కందువ నెవ్వరెవ్వరి కాణాచి యైనదో భూమి
సందడించీఁ బంటలను సకలసస్యములు
చ. 2: చుట్టుక యం(యెం)దరికిని సొమ్మయినదో కాలము
అట్టె అందరి ఆయుష్యమై యున్నది
గట్టిగా నెవ్వరెవ్వరి కంచము కూడో యీమాయ
దట్టపు సంసారముల ధర్మములై యున్నవి
చ. 3: ముంచి యం(యెం)దరికై నాను మోపులై వుండీ కర్మము
పంచు కందరికిఁ దమ పనిపాటలై
పంచుక శ్రీవేంకటేశ వారివారి బ్రదుకులు
నించి నీవే యైతివి నిధినిధానమవై

**అవతారిక :**

శ్రీహరి మహిమలను పొగడుతున్నారు అన్నమయ్య. కాని భ్రమవలన జీవులందరూ ఏ పని జరిగినా అది తమ నేర్పరితనం వలన జరిగిందనుకొంటుంటారు. ఈ బ్రహ్మాండాన్ని చూడండి. నా ఇల్లు, నా పొలం, నా తోట, నా రాజ్యం అనుకొంటుంటారు. ఇవి వాడివా? వాడు వచ్చేటప్పుడు తెచ్చుకోలేదు, పోయేటప్పుడు కొనిపోలేదు. మరి వాడిదేమిటి?

**భావదీపిక :**

ఓ హరీ! శ్రీహరీ! నీ మహిమలు అనంతములు ప్రభూ! విరతి జీవులకెల్ల (విరామం కొరకు వచ్చిపోయే జీవులందరికి) నేరుపులైవున్నవి (తమ ప్రయోజకత్వం అని భ్రమ కలిగిస్తాయి).

ఈ విశ్వమంతా ఇదివరలో యెందరు భోగించారో కదా! అందరూ ఇది తమ తమ స్వంతం అని భ్రమించలేదా? ఈ భూమి యెందరెందరికి కాణాచి (చిరకాలమూ నాదే) అనిపించిందో! దాంట్లో పండే పంటలు, వున్న నిధులు "నావే" అని భ్రమించారు.

ఎంతమంది తమ జీవితకాలం తమ సొమ్ము అని భ్రమించారో కదా! అందరూ ఆయుష్యము (ఆయుర్దాయం) మాదే అనుకొన్నారు. సంసారపు ధర్మములైన బాధ్యతలు యెవ్వరెవ్వరికో నిర్దేశించబడ్డాయి. అవి యెవరి కంచపు కూడో యీ మాయ యెవరికి తెలుసు?

చేసిన కర్మమోపులై (బంధనములై) అందరికీ వారి వారి పనిపాటలై (జీవనోపాధియై) అందరూ చేసికొనవలసి వస్తోంది. ఈ విధముగా శ్రీవేంకటేశ్వరా! వారి వారి బ్రతుకంతా నీవే నిండిపోయి, నీవే వారికి నిక్షేపమైతివి.



రచయిత

## అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు




| | | |
|---|---|---|
| పిలవండి | : | అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు |
| పుట్టింది | : | 9-6-1945 |
| చదివింది | : | ఎం. టెక్. |
| ఉండేది | : | ఫ్లాట్ నెం. 5, ప్లాటు నెం. 61, సిద్దార్ధ అపార్ట్‌మెంట్స్, సిద్దార్ధనగర్, |
| రంధి | : | భగవన్నామ సంకీర్తన |
| నచ్చింది | : | శాస్త్రీయ సంగీతం |
| నచ్చంది | : | నక్కజిత్తులు |
| మెచ్చింది | : | సజ్జన సాంగత్యం |
| రింగండి | : | +91 9393021360 |
| చదవండి | : | www.geetadeeksha.com |
| ఇవ్వండి | : | e-mail : www.geetadeeksha@gmail.com |